ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం,
శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం;
తిథి: షష్ఠి ఉ. 7.29 వరకు; నక్షత్రం:
ఆరుద్ర సా.5.53 వరకు; అమృతకాలం: ఉ.7.48 నుంచి
9.25 వరకు; వర్జ్యం: తె.5.43 నుండి 7.17 వరకు;
దుర్ముహూర్తం: సా. 4.15 నుండి 7.01 వరకు;
రాహుకాలం: సా. 4.21 నుండి 5.47 వరకు;
యమగండం: మ.12.00 నుండి 1.27 వరకు;

Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!








సంపుటి:58 • సంచిక: 181 • ఆదివారం 20 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+4 • వెల: 6.00 • Published from:Hyderabad|Karimnagar|Nizamabad|Suryapet|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati|Kurnool|Anantapur|Nellore


# బంద్ ముగిసింది.. సస్పెన్స్ మిగిలింది..



కొన్ని చోట్ల ఉద్రిక్తం.. అరెస్టులు

తెగిన సీపీఐ ఎంఎల్ నేత రంగారావు వేలు

తాత్కాలిక డ్రైవర్‌పై దాడి.. ఓయూలో విద్యార్థుల ర్యాలీ

నల్లబ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగులు నిరసన, ధర్నా

స్తంభించిన జనజీవనం.. సరుకు రవాణాకు అంతరాయం

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా రాష్ట్రబంద్ సంపూర్ణంగా జరిగింది. బంద్‌కు వివిధ ప్రజా సంఘాలు, విపక్ష రాజకీయ పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతో పాటు ఆటో యూనియన్లు, ఓలా, ఉబర్ క్యాబ్‌ల సంఘాలు మద్దతు తెలిపాయి. దీంతో శనివారం రాష్ట్ర వ్యాప్తంగా బస్సులు, ఇతర వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఉదయం నుంచే పలు ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య సంస్థలను మూసి ఉంచారు. డిపోల నుంచి బస్సులు బయటకు వెళ్ళకుండా కార్మికులు, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీలకు చెందిన అడ్డుకున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలో రోజువారీ కార్యకలాపాలు స్తంభించిపోయాయి.

బంద్‌కు మద్దతు తెలిపేందుకు బస్‌డిపోల వద్దకు చేరుకున్న వివిధ రాజకీయ పార్టీల నేతలను పోలీసులు ముందస్తుగానే అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో బంద్‌కు మద్దతు తెలిపేందుకు వచ్చిన తెలంగాణ జన సమితి అధినేత ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింలు తదితరులను పోలీసులు జూబ్లీ బస్టాండ్ వద్ద అరెస్టు చేశారు. సీపీఐ నేతలు చాడా వెంకట్‌రెడ్డి, అజీజ్‌పాషాలను హిమాయత్‌నగర్‌లోని మగ్దూంభవన్‌లోనే పోలీసులు అరెస్టు చేసి నారాయణగూడ పోలీసుస్టేషన్‌కు తరలించారు. బస్‌భవన్ ముట్టడికి వచ్చిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతోపాటు విమలక్క, సంధ్యారాణి తదితరులను పోలీసులు అదుపులోకి ➩ 5వ పేజీలో...

## సక్సెస్

ప్రజలు సంపూర్ణ మద్దతిచ్చారు

చర్చలకు పిలవండి: అశ్వత్థామరెడ్డి



5

## ఇబ్బందేం లేదు

### సీఎంకు అధికారుల నివేదన



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర బంద్‌పై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆరా తీశారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు సార్లు రవాణా శాఖ అధికారులతో మాట్లాడి ప్రభావంపై చర్చించారు. ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించడంతో ఎదురైన ఇబ్బందులు, అక్కడక్కడ జరిగిన ఆందోళనలు, ఘర్షణలు, పోలీసుల చొరవ, కేసుల నమోదు తదితర అంశాలను గురించి తెలుసుకున్నారు. ఆర్టీసీ సేవలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు సంస్థ అధికారులు చేపట్టిన చర్యలు, సాధించిన పురోగతిపై సమీక్షించారు. మధ్యాహ్నం రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, కమిషనర్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ కుమార్ సుల్తానియాతో ఫోన్లో మాట్లాడి ప్రభుత్వపరమైన చర్యలపై తగిన మార్గదర్శకాలు ఇచ్చారు. సమ్మె నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి సమాచారంతో జిల్లాల వారీగా నివేదికలు తెప్పించి అందజేయాల్సింగా ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ➩ 5వ పేజీలో...



విద్యుత్ సంస్థల సీఎండీలు ప్రభాకర్‌రావు, రఘుమారెడ్డి, గోపాల్‌రావు ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికుల ఒప్పందం

## విద్యుత్ కార్మికుల చర్చలు సఫలం

ఆందోళనకు తాత్కాలిక విరామం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్లుగా పనిచేస్తున్న కార్మికుల డిమాండ్లకు సంబంధించి శనివారం కార్మిక సంఘాల నాయకులతో అధికారులు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో విద్యుత్ కార్మిక సంఘాలు అన్నిరకాల ఆందోళన కార్యక్రమాలకు విరామం ప్రకటిస్తున్నట్టు వెల్లడించాయి. విద్యుత్ సౌధలో జన్‌కో ఛైర్మన్ దేవులపల్లి ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో టీటఫ్ (తెలంగాణ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ ఫ్రంట్), తెలంగాణ కార్మిక సంఘాల నాయకులతో విడివిడిగా చర్చలు జరిగాయి. పూర్తి సుహృద్భావ వాతావరణంలో జరిగిన ఈ చర్చల్లో కార్మిక సంఘాల నాయకులు లేవనెత్తిన ప్రతి డిమాండ్‌ను అధికారులు పరిశీలించారు. న్యాయమైన, పరిష్కరించదగిన, సాధ్యమైన అన్ని ➩ 3వ పేజీలో...




## ప్రభుత్వ పాఠశాలల్లో మైండ్ స్పార్క్

పైలట్ ప్రాజెక్టు కింద 100 స్కూళ్లలో అమలు

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

6 నుంచి 10వ తరగతి వారికి ప్రత్యేక శిక్షణ

జే-పాల్ సంస్థతో విద్యా శాఖ ఒప్పందం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండేలాగా పాఠశాల విద్యా శాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే విద్యార్థులకు ఆటలతోపాటు నాణ్యమైన విద్య అందించడం కోసం చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో "మైండ్ స్పార్క్" కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 200 ప్రభుత్వ పాఠశాలల్లో 6-10వ తరగతి విద్యార్థులకు పైలట్ ప్రాజెక్టుగా 'మైండ్ స్పార్క్' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఫలితాలను బట్టి రాష్ట్రంలోని అన్ని ➩ 3వ పేజీలో...

## ఇక ఉద్యోగ బదలీలు?

దీపావళి తర్వాత ఏక్షణమైనా

### ఉద్యోగుల కోరికపై సీఎం సానుకూలం

• కీలక శాఖల్లో పెండింగ్ బదలీలకు ఆస్కారం

• సిద్ధమైన దస్త్రం • సీఎం ఆమోదం తర్వాత షెడ్యూల్...!




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మరోసారి కీలక శాఖల్లో ఉద్యోగుల బదలీకి ప్రభుత్వం పచ్చ జెండా ఊపనున్నది. తాజాగా ఉద్యోగ జేఏసీ ప్రభుత్వానికి అందజేసిన కీలక డిమాండ్లలో ఒకటైన తహశీల్దార్లు, ఇతర రాబడి శాఖలు, కలెక్టరేట్లలోని ఆర్డర్ టూ వర్క్ సిబ్బందిని బదలీలకు అనుమతించేలా దస్త్రం సిద్ధమవుతోందని విశ్వసనీయంగా తెలిసింది. రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలకు ముందు తహశీల్దార్లను కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు తాత్కాలిక బదలీలు చేయగా, మరికొన్ని శాఖల్లో కూడా ఎన్నికల విధులతో సంబంధమున్న సిబ్బందిని ఇతర ప్రాంతాలకు పంపారు. ఆ తర్వాత ఏడాది కావొస్తున్నా వారిని పూర్వపు ప్రాంతాల్లోకి పునర్నియామకం చేయకపోవడంతో ➩ 2వ పేజీలో...



## సహకార సేద్యమే రైతుకి రక్ష

(అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

గతకొంతకాలంగా వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదు. దొరికినా అధిక వేతనాలు డిమాండ్ చేస్తున్నారు. నాట్లు, మాసూళ్ళు, కోతలు, నూర్పిళ్ళ సమయాల్లో ఆరుగంటల పనికి వెయ్యి రూపాయల వరకు అడుగుతున్నారు. దీంతో వ్యవసాయ ఉత్పాధకతలో కూలీలపై వెచ్చిస్తున్న ఆర్థికభారం పెరిగింది. ఇది వ్యవసాయోత్పత్తి వ్యయం పెరగడానికి దారితీస్తోంది. ఈ వేతనా లపై కూలీల్ని భరించలేక సాగుకు దూరమౌతున్నా మంటూ పలువురు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కొన్నేళ్ళ క్రితం వరకు దేశంలో సగం మందికి పైగా వ్యవసాయమే ప్రధాన ఉపాధి వనరుగా ఉండేది. చిన్న చిన్న కమతందార్లు కుటుంబ సేద్యం నిర్వహించే వారు. ఇంట్లోని మహిళలే నాట్లు, కోతల పనులు చూసేవారు. పురుషులు ఎడ్లసాయంతో దుక్కిదున్నేవారు. పిల్లలు వారికి సహాయమందించేవారు. ఇలా దీర్ఘకాలం పాటు దేశంలో సాగు కుటుంబ సేద్యంగానే జరిగింది. రాన్రాను పలు కొత్త చట్టాలొచ్చాయి. ముఖ్యంగా బాలకార్మిక చట్టం అమల్లోకొచ్చాక వ్యవసాయ పనుల్లోకి పిల్లల్ని రప్పించడం శిక్షార్హమైందిగా మారింది. బడి బయసు పిల్లలంతా బడికెళ్తున్నారు. ఇక వయోవృద్ధులకు పలు ప్రభుత్వ పథకాలు అందుబాటులోకొచ్చాయి. మధ్య వయస్కులైన స్త్రీ, పురుషులు మాత్రమే వ్యవసాయ పనులకు సిద్ధమౌతున్నారు. వారిలో కూడా 40ఏళ్లకు పైబడ్డ వ్యక్తులు శారీరక ధారుడ్యాన్ని కోల్పోతున్నారు. ఇలా వ్యవసాయ పనులకు అందుబాటులో ఉన్న వ్యక్తుల సంఖ్య తగ్గింది. దీంతో డిమాండ్ పెరిగింది. అందుకనుగుణంగా వేతనాల కోసం పట్టుబడుతున్నారు. ఇది వ్యవసాయ ఉత్పాధక ➩ 3వ పేజీలో...

కూలీల కొరత... వేతనాల భారం

గిట్టుబాటు గగనం... నష్టాల సేద్యం

చట్టాల చక్రబంధం... దిక్కుతోచని రైతన్న



పొలాల్లో యంత్రాల జోరు పెరగాలి

ప్రభుత్వమే అద్దెకు అందుబాటులో ఉంచాలి

రైతుల దృష్టిని ఈ వైపుగా మళ్ళించాలి



8 జగత్తు

ఉద్యమాల విపత్తు!!



## పసిడి పరుగు ఎందాక? 6




## ప్రచారానికి తెర ప్రలోభాల ఎర

హుజూర్‌నగర్‌లో హోరా హోరీ

విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ

పరిశీలకుల కళ్ళుగప్పి పందారం

బరిలో 28 మంది.. గెలుపుపై ప్రధానపార్టీల ధీమా

రేపే పోలింగ్.. ఎన్నికకు సర్వం సిద్ధం

2









సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి కేటీఆర్ సమీక్ష

## స్లిప్ రోడ్లతో ట్రాఫిక్‌కు చెక్

హైదరాబాద్‌లో వాహనాల నియంత్రణకు ప్రభుత్వం కసరత్తు

రద్దీ ప్రాంతాలను గుర్తించాలని అధికారులకు కేటీఆర్ ఆదేశం

పశ్చిమ హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి... జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ అధికారులతో పురపాలక మంత్రి సమీక్ష

3




## చుట్టాలతో జాగ్రత్త

వెనుక.. తుపాకులతో ఓ ఇద్దరు అంగరక్షకులుంటే భలేగా ఉంటది అని చాలామందికి అనిపిస్తుంటుంది. రాజకీయాల్లో తిరిగేవారు, నేతల బంధువులూ.. మాకెప్పుడు ఇలాంటి వరమొస్తుంది.. వెనుక ఇద్దరు గన్‌మెన్లు.. ముందో ఎస్కార్ట్ వాహనం.. ఊళ్ళో పోతుంటే ఎట్లుండాలె.. ఆ రాజసమే వేరుగా ఉంటది అని ఊహిస్తారు. తమ వెనుక ఉన్నట్లు చాలామంది కలలుకంటారు. కొందరు కష్టపడి జీవితంలో పైమెట్టుకు ఎక్కి సాధించుకుంటారు. వీళ్ళు మొదటిరకం. ఇక రెండోరకం.. మరికొందరు.. ఫొటోలతో తమ లెవెల్ చూపి మురిసిపోతారు. తమ చుట్టాలకు వచ్చిన పదవులు, సౌకర్యాలను తమకే వచ్చినట్లు ఫీలవుతారు. అధికారిక సీట్లలో కూర్చుని ఫోజులు కొడతారు. రక్షణగా ఉండే గన్‌లు చేతుల్లో పట్టుకుని తిప్పేస్తారు. సోషల్‌మీడియాలో ఫొటో పెట్టి.. చూశారా మన లెవెల్ అని బిల్డప్ ఇస్తారు. ఇలాంటి వారితోనే అసలు నేతలకు చిక్కు.. తాజాగా అధికార పార్టీ ఎంపీ బండప్రకాష్ బంధువు ఒకరు ఎంపీ బిజీగా ఉన్నాడని ఆయన అంగరక్షకులను తీసుకుని షికారుకు వెళ్ళాడు. తనకే గన్‌మెన్లు ఉన్నట్లు వెనుక నిలబెట్టుకుని ఫొటో దిగి ఫేస్‌బుక్‌లో పెట్టేశాడు. ఈ రోజు ఎంపీ కంటే తానే బిజీగా తిరిగినట్లు కొటేషన్ పెట్టి మరీ పోస్ట్ చేశాడు. ఆ ఫొటో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. ఎంపీ గన్‌మెన్లు ఈయనకు కాపలాకాయడమేంటి? అసలు ఎంపీ ఏమయ్యారు? అంటూ సోషల్‌మీడియాలు ప్రశ్నలు, కామెంట్లపరంపరతో దుమ్మురేగింది. చివరకు ఇది సీఎం కార్యాలయానికి కూడా చేరగా, పోలీసు ఉన్నతాధికారులు ఆ ఎంపీని చుట్టాలతో జాగ్రత్త అనే చెప్పేశారట. తాను పెట్టిన ఫొటో.. తన కోరిక చుట్టూ రేగిన కలకలం చూసి ఆ ఔత్సాహికుడు షాక్‌కు గురయ్యాడట. ఇపుడు ఆ నేత చుట్టాలతో జాగ్రత్తర బై. ఎక్కడివరకు దగ్గరకు తియ్యాలో.. అక్కడికే తియ్యురి. లేకుంటే పరేషాన్ ఉంటది అని చెబుతున్నారట.




## టైం బ్యాడయితే గంతే

నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు.. లేటు, మరింత లేటు.. అన్నట్లు పదవుల పందారానికి పరిస్థితులు అనుకూలించకపోవడంతో నారాజ్ అవుతున్నరు. అసెంబ్లీ పోయింది, పార్లమెంట్ పోయింది.. ఇపుడు దసరాకు అన్నా నామినేటెడ్ పదవి వస్తుందనుకుంటే అదీ వాయిదాపడిందట. హుజూర్‌నగర్ ఎన్నికలు ముగిశాకయినా పదవి వస్తదని ఓపిక పడితే ఆర్టీసి సమ్మె వచ్చిపడిందట. ఇంతలో దీపావళి, సమ్మె ముగిశాక మునిసిపల్ ఎన్నికలు.. ఆతర్వాత ఇంకేం వస్తాయో... మళ్ళీ లేటు.. లేటే. పూజకు పనికిరాని పువ్వులాగా తాము సేవకు తప్ప పదవులకు పనికి రావడంలేదంటూ పదవి గ్యారంటీ అనుకున్న ఓ ముఖ్య నేత కుమిలిపోతున్నాడు. తెలంగాణభవన్‌కు వచ్చినపుడల్లా.. సార్ నా పదవెపుడు అంటూ ఆరాతీయడం.. ఈసారి నీకు పక్కా అని చెప్పడం ఎపుడూ మామూలేనట. టైం బ్యాడయితే గంతే.. ఎంత రాసిపెట్టి ఉంటే గంతే. పరిస్థితులు పండుగ చేసుకున్నపుడు మనమేం చేయలేం కదా అని తనను కలిసిన నేతలతో వేదాంతం చెబుతున్నాడట.

- కంది రామచంద్రారెడ్డి



### హుజూర్ ఉప ఎన్నికలో

# తెరాస గెలుపు ఖాయం

- ఉత్తమ్ భేషజం వల్లే అభివృద్ధి దూరం
- ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**హైదరాబాద్/నేరేడుచర్ల, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నా భేషజాలకు పోయిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రతిపాదనలు పంపలేదని ఉప్పల శ్రీనివాస్ గుప్తా విమర్శించారు. ఉత్తమ్‌ను మరోసారి నమ్మి ఓటేస్తే ఇదే పరిస్థితి పునరావృతమవుతుందని, మరో నాలుగేళ్ళు అభివృద్ధికి దూరమయ్యే ప్రమాదముందన్నారు. ఉత్తమ్ స్వార్థంవల్లే ఉప ఎన్నికలు వచ్చాయని, కోదాడలో చెల్లని పద్మావతి ఇక్కడ ఎలా చెల్లుబాటు అవుతుందన్నారు. కనీసం కళ్యాణలక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేయకుండా ప్రజలకు అందుబాటులో ఉండకుండా హైద్రాబాద్‌లో కూర్చునే ఉత్తమ్ కావాలా, నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ, అభివృద్ధి నిధులు తీసుకు రాగలిగే శానంపూడి సైదిరెడ్డి కావాలో ఆర్యవైశ్యులతోపాటు ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. సమావేశంలో వైఎంపీపీ తాళ్ళూరి లక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు రాచకొండ రామ్మోహన్, పురప్రముఖులు మాశెట్టి సైదయ్య, విశ్వనాథం, ఉప్పల కృపాకర్, ఊట్కూరి నటరాజ్ తదితరులు ఉన్నారు.

### తెరాస వైపే ఆర్యవైశ్యులంతా

హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో అధికార పార్టీ విజయం తథ్యమని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ధీమా వ్యక్తంచేశారు. దాదాపు పక్షం రోజులపాటు నియోజకవర్గ వ్యాప్తంగా వైశ్యులను చైతన్యపరిచి ప్రభుత్వానికి మద్దతు కోరామని పేర్కొన్నారు. శనివారంతో ప్రచారం ముగిసిన నేపథ్యంలో ఆయన 'ఆంధ్రప్రభ'తో మాట్లాడారు. ఆర్యవైశ్యులంతా అధికార పార్టీ తెలంగాణ రాష్ట్ర సమితివైపే ఉన్నారని తెలిపారు. హుజూర్‌నగర్ తెరాస అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్న తమ విజ్ఞప్తి మేరకు వారంతా స్పష్టమైన హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఆర్యవైశ్య ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులంతా ఈ ఉపఎన్నిక ప్రచారంలో పూర్తిస్థాయిలో పాల్గొన్నారని వెల్లడించారు.

# ప్రచారానికి తెర ప్రలోభాల ఎర



## హుజూర్‌నగర్‌లో హోరాహోరీ

- విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ
- పరిశీలకుల కళ్లుగప్పి పందేరం
- బరిలో 28 మంది.. గెలుపుపై ప్రధాన పార్టీల ధీమా
- రేపే పోలింగ్.. ఎన్నికకు సర్వం సిద్ధం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ ఉప ఎన్నికకు అంతా రంగం సిద్ధమైంది. నెలరోజులుగా హోరాహోరీగా సాగిన ప్రచారం, మోతెక్కిన మైకులు, ఆరోపణలు, ప్రత్యారోపణలు, తిట్లు, శాపనార్థాలు అన్నింటికీ శనివారం సాయంత్రం ముగిసిన ప్రచారంతో తెరపడింది. ప్రచారం ముగియడంతో ప్రధాన పార్టీలు ఆఖర్లో ప్రలోభాలపర్వానికి తెరతీశారు. రెండు ప్రధానపార్టీలు ఓటర్ల ప్రసన్నానికి పోటాపోటీగా పంపకాల జోరు కొనసాగించాయి. కొందరు ఓటుకు రూ.3వేల నుండి 5వేల వరకు పంపిణీచేస్తున్నారని, సామాజికవర్గాలను లక్ష్యంగా చేసుకుని పందారం చేస్తున్నారన్న ప్రచారం ఉండగా, మరో పార్టీ రూ.1000, మద్యం పంపిణీ చేస్తున్నట్లు ప్రచారంలో ఉన్నాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో చరిత్రలో మునుపెన్నడూ లేని రీతిలో మద్యందంపులు దిగగా, ఇటీవల ఆ నియోజకవర్గంలో ఒక ఎక్సైజ్ సీఐను కూడా తొలగించారు. డబ్బుపంపిణీ స్థావరాలకు సంబంధించి కూడా విస్తృత తనిఖీలు జరుగుతున్నా,




పరిస్థితి ఊహించిన ప్రధానపార్టీల నేతలు ముందు జాగ్రత్తలు తీసుకున్నాయి. వ్యయ పరిశీలకులు కఠినంగా వ్యవహరిస్తుండడంతో వారి కళ్ళుగప్పి నేతల అనుచరులు లక్షిత ప్రాంతాలకు వీటిని చేరుస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,36,842 మంది ఓటర్లుండగా, 28మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 302పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇందులో 79సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. టీఆర్ఎస్, కాంగ్రెస్ ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోగా, నువ్వానేనా అన్నట్లు ప్రచారం సాగించాయి. టీఆర్ఎస్ అభ్యర్థిగా శానంపూడి సైదిరెడ్డి బరిలో నిలవగా, కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి సతీమణి పద్మావతి బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతిలో సైదిరెడ్డి 7వేల ఓట్ల తేడాతో ఓటమిపాలు కాగా, ప్రస్తుతం టీఆర్ఎస్ అధికారంలో ఉండడం.. సీఎం కేసీఆర్ అండగా ఉండడం, నేతలంతా ఐక్యంగా కలిసి రావడంతో గెలుపు సునాయాసమేనని నమ్ముతున్నారు. కనీసం 20వేల మెజారిటీతో విజయం సాధిస్తామని టీఆర్ఎస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని నిలుపుకుంటామని ఆ పార్టీనేతలు ధీమాగా చెబుతున్నారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత నియోజకవర్గం కాగా, జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రచారంలో గట్టిగా నిలబడడం, చివర్లో రేవంత్ రెడ్డి ప్రచారం అన్నీ కలిసివచ్చాయని కాంగ్రెస్ చెబుతోంది. కాంగ్రెస్ గ్రాఫ్ చివర్లో పెరుగుతూ వెళ్ళిందని, ఖచ్చితంగా విజయం తమదేనని ధీమా వ్యక్తం చేస్తోంది. భారతీయ జనతాపార్టీ కూడా ప్రతిష్ఠాత్మకంగా బరిలో దిగగా, పట్టులేని ప్రాంతంలో ఏమేర ప్రభావం చూపుతుందోనన్న ఆసక్తి నెలకొంది. బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ కోటా రామారావు బరిలోకి దిగగా, ఆ పార్టీ కూడా విస్తృతంగా ప్రచారం సాగించింది.

### చాపకింద నీరులా..

టీఆర్ఎస్ ఈ ఉప ఎన్నికల ప్రచారాన్ని చాపకిందనీరులా నిర్వహించింది. సామాజికవర్గాలు, గ్రామాలవారీగా ఇన్‌ఛార్జిలను నియమించడం, పని విభజనచేసి ప్రతిరోజూ పర్యవేక్షించడం కలిసొచ్చిందని ఆ పార్టీవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా పల్లా రాజేశ్వరరెడ్డిని నియమించడం ద్వారా క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో పక్కాగా తెలుసుకుని, తన ఆలోచనలను అధిష్ఠానం అమల్లోపెట్టింది. ఇదేమంత్రం వర్కవుట్ అయిందన్న అభిప్రాయంలో ఉంది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఎప్పటిపుడు నేతలకు సలహాలిస్తూ అప్రమత్తం చేశారు. ఉప ఎన్నికల గెలుపుపై టీఆర్ఎస్ ధీమాగా ఉంది. ఆర్టీసి సమ్మెప్రభావం ప్రజలపై లేదని భావిస్తోంది.

# కాంగ్రెస్ ఐక్యతారాగం



- కలసికట్టుగా ప్రచారం
- చేతులు కలిపిన సీనియర్లు
- పార్టీ విజయానికి కృషి
- హస్తం శ్రేణుల్లో జోష్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కాంగ్రెస్ నాయకులు, తమ సహజ ధోరణికి విరుద్ధంగా హుజూర్‌నగర్ ఉపఎన్నికలో కలసికట్టుగా... ఓ జట్టుగా పనిచేశారు. సాధారణంగా కాంగ్రెస్ అంటేనే గ్రూపులు, ఆయా వర్గాల మధ్య విభేదాలు సహజం. అంతర్గత ప్రజాస్వామ్యం అధికంగా ఉండే పార్టీలో ఎవరికి వారే యమునా తీరు అన్నట్లుగా సీనియర్ నేతలు ఉండేవారు. కానీ హుజూర్‌నగర్ ఉప ఎన్నిక నేపథ్యంలో హస్తం నేతల తీరు మారింది. ఈ పరిణామం శ్రేణుల్లో ఆత్మవిశ్వాసం నింపింది. హుజూర్‌నగర్ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలందరు రెండు వారాలుగా ప్రచారంలో తలమునకలైనారు. సిట్టింగ్‌ను నిలుపుకోవాలన్న పట్టుదలతో కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి విజయం కోసం విస్తృతంగా ప్రచారం చేశారు. ఎన్నిక షెడ్యూల్ విడుదలైప్పటి నుంచి.. శనివారం ప్రచారం గడువు ముగిసే వరకు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన సతీమణి పద్మావతి విజయం కోసం నియోజక వర్గంలోనే విస్తృతంగా తిరిగారు. సీఎల్పీ నేత జానారెడ్డికూడా ఒక వైపు నియోజకవర్గంలో పర్యటిస్తునే మరో వైపు ఎన్నికకు సంబంధించిన పార్టీ సమన్వయ బాధ్యతలను కూడ కొనసాగించారు. ఇకపోతే ఎప్పుడు ఉప్పు- నిప్పుగా ఉండే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉప ఎన్నిక సందర్భంగా కలిసి పనిచేయడం పార్టీ కేడర్‌లో నూతనోత్తేజం కనిపించింది. అంతే కాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కీలక నేతలందరూ ఏకతాటిపైకొచ్చి ప్రచారం చేశారు. ఇకపోతే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మధ్య కూడా విభేదాలు ఉన్నాయి. హుజూర్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థిగా పద్మావతిని ఏకపక్షంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎలా ప్రకటిస్తారని, ఆయనకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ కూడ చేశారు. అంతే కాకుండా తాను కిరణ్‌రెడ్డి అనే మరో అభ్యర్థిని సూచిస్తున్నట్లు చెప్పారు. దీంతో ఎన్నికల ముందు పార్టీ ముఖ్యుల మధ్య ఇదేం పంచాయతీ అనే చర్చ సాగింది. తీరా పోలింగ్‌కు రెండు రోజుల ముందు రేవంత్‌రెడ్డి నియోజక వర్గంలో రోడ్‌షోలు, సమావేశాలు నిర్వహించి పార్టీ కేడర్‌లో జోష్ నింపారు. అధికార టీఆర్ఎస్‌పైనఎంపీ రేవంత్‌రెడ్డి పదునైన విమర్శలు చేసి ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉండగా వారం పదిరోజులుగా కూడా రాష్ట్రంలోని ముఖ్య నాయకులుకూడా హుజూర్‌నగ3ర్‌లోనే మకాం వేశారు. పోలింగ్ బూత్‌లవారీగా నివేదికలు తెప్పించుకుని లోపం ఉన్న చోట సరిదిద్దుకునే ప్రయత్నం చేశారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను కూడ సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేశారు. టీఆర్ఎస్ ప్రభుత్వ అన్యాయాలను వివరించే ప్రయత్నం చేశారు. సీఎల్పీ నేత భట్టి, మాజీ మంత్రులు శ్రీధర్‌బాబు, షబ్బీర్ అలీ, జీవన్‌రెడ్డి, సీనియర్ నేత వీహెచ్, పొన్నం ప్రభాకర్, కుసుమ కుమార్, మాజీ ఎంపీలు మల్లు రవితో పాటు పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ప్రచారం నిర్వహించారు. హుజూర్ నగర్ సిట్టింగ్ స్థానాన్ని హస్తగతం చేసుకుంటామనే ధీమాను ఆ పార్టీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. నాయకుల మధ్య ఇదే ఐక్యత కొనసాగితే మరింత ఉత్సాహం ఉంటుందని చర్చ జరుగుతోంది.

# ఇక ఉద్యోగ బదలీలు?

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ సీఎస్‌కు అందజేసిన వినతిపత్రంలో ఈ బదలీలను కీలక అంశంగా పేర్కొంది. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఈ ఫైల్‌ను సీఎం కేసీఆర్ ఆమోదం కోసం సిద్ధం చేస్తున్నట్లుగా తెలిసింది. ఈ ఫైల్‌పై సీఎం సంతకం చేయగానే రెవెన్యూ, వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ల శాఖల్లో బదలీలకు షెడ్యూల్ ఖరారవనుంది. మునిసిపల్ మినహాదాదాపు అన్ని ఎన్నికలు పూర్తవడంతో ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం ప్రస్తుతం ఉన్న బదలీలపై నిషేధాన్ని సడలించి ప్రత్యేక బదలీలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది. ఎన్నికల విధుల్లో భాగంగా తాత్కాలికంగా బదలీలు చేసిన వీరిని త్వరలో పూర్వపు స్థానాలకు, లేదంటే ఇతర ప్రాంతాలకు బదలీలు చేపట్టనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

### తహశీల్దార్లకు తొలి ప్రాధాన్యత...

అన్ని ప్రభుత్వ శాఖల్లో బదలీల ప్రక్రియను గతేడాది ప్రభుత్వం ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తి చేసింది. అయితే ఎన్నికలతో సంబంధం ఉన్న శాఖలతో పాటు కొన్ని ప్రభుత్వ రాబడి శాఖల్లో మాత్రం బదలీలు జరపలేదు. ప్రధానంగా కీలక రాబడి శాఖలైన వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖలో ఇప్పటికీ బదలీలపై నిషేధం కొనసాగుతోంది. అవినీతి ఆరోపణలతో 2017లో 141 మంది సబ్ రిజిస్ట్రార్లను రిజిస్ట్రేషన్ల శాఖ బదలీ చేసింది. ఇక ఆబ్కారీ శాఖలోనైతే ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన బదలీలే చివరగా జరిగాయి. గతేడాది జూన్ 24న జారీ చేసిన బదలీ ఉత్తర్వుల్లో రెవెన్యూ రాబడి శాఖలకు ప్రత్యేక మార్గదర్శకాలు, నిబంధనలు అమలవుతాయని పేర్కొన్నప్పటికీ అమలులోకి రాలేదు.

స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, పీఆర్, వైద్య శాఖల్లో బదలీల ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. విద్యా శాఖలో కూడా బదలీలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా శాఖాధిపతులు గడువు కోరుతూ సీఎస్‌కు లేఖలు రాశారు. ఎన్నికల తర్వాత బదలీలకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థిస్తూ సీఎస్‌కు విజ్ఞప్తులు చేశారు. పంచాయతీ ఎన్నికలు పంచాయతీ రాజ్ శాఖలో బదలీలకు అడ్డంకిగా మారగా, భూ రికార్డుల ప్రక్షాళన రెవెన్యూ, స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖలో అడ్డంకిగా మారాయి. అదేవిధంగా డివిజన్ల సర్దుబాటు కారణంగా వాణిజ్య పన్నుల శాఖలో బదలీలు నిల్చిపోయాయి. ఈ నేపథ్యంలో ఆయా శాఖలు ప్రత్యేక అనుమతి కోరుతూ ప్రభుత్వానికి వినతులు చేశాయి. వ్యవసాయ శాఖలో కూడా రైతుబంధు పథకం, రైతు బీమా కీలకంగా నడుస్తున్న తరుణంలో బదలీలపై ఆంక్షలు విధించారు. నాటి నుంచి ఈ శాఖల్లో కొందరు ఉద్యోగులు బదలీ అయినప్పటికీ రిలీవ్ ఆర్డర్ ఇవ్వొద్దనే ఆదేశాలతో ఇంకా పూర్వపు స్థానాల్లోనే కొనసాగుతున్నారు. కొందరు దీర్ఘకాలిక సెలవులపై వెళ్లినట్లు సమాచారం.

### గత నిబంధనలే ఈసారి కూడా...

గతేడాది వివిధ శాఖల్లో జరిపిన బదలీల్లో ఐదేళ్లుగా ఒకే చోట ఉన్నవారికి తప్పనిసరి బదలీతోపాటు, ప్రాధాన్య పోస్టుల్లో ఉన్నవారికి అప్రాధాన్య పోస్టుల్లోకి, అప్రాధాన్య పోస్టుల్లోని వారికి ప్రాధాన్యత పోస్టుల్లోకి, మారుమూల ప్రాంతాల్లో పనిచేసిన వారికి పట్టణ ప్రాంతాలకు బదలీలు చేశారు. పాత జిల్లాల ప్రాతిపదికన జరిగిన బదలీల్లో ఆర్డర్ టూ సర్వ్, తాత్కాలిక కేటాయింపులకు తొలి ప్రాధాన్యత నిచ్చారు. బదలీలు కోరుతూ లక్షమంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకో గా, పరిపాలనాపర కారణాలు, ఇతర పరిస్థితులతో 40శాతమే బదలీలకు శాఖలవారీగా అవకాశం ఉండటంతో 80వేల మంది వరకు బదలీ చేశారు. మిగిలిన వారికి ఈ దఫా అవకాశం దక్కే చాన్సుంది.

### వాణిజ్య పన్నుల శాఖలో ఖాళీలు...

కీలక పోస్టులు ఖాళీగా ఉండటంకూడా పాలనపై తీవ్ర పడుతోంది. కీలక అధికారులు లేక ఇన్‌చార్జీల పాలన సాగుతుండటంతో పన్నుల వసూళ్లు, సర్వీస్ వ్యవహారాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. మరోవైపు జాయింట్ కమిషనర్లకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆదాయ వసూళ్లలో మందగింపు నమోదవుతోంది. పెద్దదిక్కులేక అనేక నిర్ణయాలు పెండింగ్‌లో పడిపోతున్నాయి. డీసీటీఓలు, సీటీవోలు, అసిస్టెంట్ కమిషనర్లు ఇలా మొత్తంగా 250 వరకు క్యాడర్ ఖాళీలు ఉన్నాయి. 3 జాయింట్ కమిషనర్ పోస్టులు కమిషనరేట్‌లో ఖాళీగా ఉన్నాయి.



## చూచిరాతలకు చెక్

శతకోటి సమస్యలకు అనంతకోటి ఉపాయాలంటే ఏమిటో ఇక్కడున్న దృశ్యాన్ని చూస్తే తెలుస్తుంది. పరీక్షల్లో కాపీకొట్టడం చాలాచోట్ల సాధారణమై పోయింది. కాపీయింగ్‌కు హైటెక్కుటమార విద్యలూ ఉపయోగించడం తెలిసిందే. కానీ కర్నాటకలోని ఓ కళాశాల యాజమాన్యం ఠాట్.. చూచిరాతకు చాన్సే లేదంటూ పక్కా ఏర్పాట్లు చేసింది. ఇదిగో ఇలా అభ్యర్థులకు అట్టపెట్టలనే ముసుగులుగా మార్చి కప్పింది. పక్కవారివైపు చూడటానికి వీలులేకుండా, చూసినా తెలిసిపోయేలా ఇలా చేశారు. కాకపోతే జవాబులు రాయడానికి వీలుగా కళ్ల ఎదుట మాత్రం ఈ కవర్ల ముసుగుకు ఖాళీ ఉంచారు. హావేరీలోని భగత్ పీయూ కాలేజీ ఫస్ట్ ఇయర్ సైన్స్ విద్యార్థుల మిడ్‌టర్మ్ పరీక్షల్లో ఈ విధానం అనుసరించడం అందరినీ ఆకర్షించింది.



## భంగిమ బాగుందా!

ఇక్కడ చాలా స్టైల్‌గా, ఫొటో కోసం స్టిల్ ఇస్తున్నట్లు పోజులు కొడుతున్న సీల్ ఓ పెద్ద ఆకర్షణ. బ్రిట్టనీ (ఫ్రాన్స్)లోని, లిక్టడీ దీవుల్లోని (ఇల్లె అస్) రాళ్లపై ఇలా సీల్ చేపలు పోజులు కొట్టడం సాధారణ దృశ్యమే. ఎండకోసం, గాలి పీల్చుకునేందుకు ఇలా కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటూంటాయి. వీటిని చూసేందుకు పెద్దఎత్తున పర్యాటకులు వస్తూంటారు. నిజానికి ఇంత వయ్యారంగా, చలాకీగా సీల్స్ కనిపించడం అరుదే. భంగిమ బాగుంది కదూ!



## చేతులు కలిపిన పెపే

చైనా చర్యలకు నిరసనగా హాంకాంగ్‌లో యువత కొద్ది నెలలుగా ఉద్యమిస్తున్న విషయం తెలిసిందే. తమను గుర్తుపట్టకుండా ఉండేందుకు ఆందోళనకారులు ముసుగులు ధరిస్తూంటే ఒళ్లుమండిన చైనా, ముసుగులు ధరించడాన్ని నిషేధించింది. దీనిపై మళ్లీ ఉద్యమం ఊపందుకుంది. సామాజిక మాధ్యమాలలో, ముఖ్యంగా హాంకాంగ్ ఆందోళనకారులు విరివిగా ఉపయోగిస్తున్న మీమ్ పెపె, ది ఫ్రాగ్. కప్ప ఆకారంలోని హ్యూమనాయిడ్‌కు ప్రతిరూపంగా దీనిని వాడుతున్నారు. ఇప్పుడు పెపె బొమ్మను ఇలా మానవహారంలో భాగంగా పెట్టి పట్టుకున్న ఆందోళనకారులు కొత్త పద్ధతిలో నిరసన తెలిపారు.



## అధ్యక్షా.. చాక్లెట్!

ఇటలీలో ఇప్పుడు చాక్లెట్ పండుగ నోరూరిస్తోంది. యూరోప్‌లో అతిపెద్ద చాక్లెట్ పండుగ, ఇటలీలోని పెరుజియాలో నిర్వహిస్తారు. దాదాపు పది లక్షల మంది ఈ వేడుకకు హాజ్రై ప్రపంచంలోని వివిధ దేశాల చాక్లెట్ రుచులు ఆస్వాదించి ఆనందిస్తారు. ప్రపంచంలో మరెక్కడా ఈ స్థాయిలో చాక్లెట్ ఉత్సవాలు జరగవు. నెస్లేకు చెందిన పెరుగియా చాక్లెట్ కంపెనీ నిర్వహించే యూరోపియన్ చాక్లెట్ ఫెస్టివల్ 1993నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇటలీలోని ప్రఖ్యాత ఫోర్జా ఇటాలియా పార్టీ అధ్యక్షుడు సిల్వియో బెర్లుస్కోని ఓ చాక్లెట్ కంపెనీని సందర్శించినపుడు ఆయనకో ఓ రుచికరమైన చాక్లెట్‌ను ఇలా అందించారు.



## చిట్టి గోల్ కొడితే...!

కృత్రిమ మేధ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కలగలపి సాధించిన అధునాతన సాంకేతికతను ఇచ్చిపుచ్చుకోడానికి ఏటా నిర్వహించే రోబోకప్ ఫుట్‌బాల్ టోర్నీ పోటీలను ఇటలీ ఇప్పుడు రోమ్‌లో నిర్వహిస్తోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నవకల్పనలు, ఆచరణ, ఫలితాలను దగ్గరనుంచి చూసేందుకు ఈ హ్యూమనాయిడ్ రోబో (చిట్టి)లతో ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తారు. అదే సందర్భంలో అతిపెద్ద ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. దేశవిదేశాలకు చెందిన ఏఐ, ఐటీ నిపుణులు పాల్గొంటారు. పనిలోపనిగా ఈ రోబో ఫుట్‌బాల్ టోర్నీ నిర్వహిస్తారు. ఇప్పుడు రోమ్‌లో నిర్వహిస్తున్న రోబోకప్ టోర్నీలో స్థానిక సాపియాంజీ వర్శిటీ రోబో జట్టుతోపాటు, స్విట్జర్లాండ్, జర్మనీ వర్శిటీల రోబోజట్లు పాలుపంచుకుంటున్నాయి.

# దగాపడ్డ కుర్దులు..!



పశ్చిమాసియాలో గతంలో ఇరాన్,ఇరాక్‌ల మధ్య వైషమ్యాలు సృష్టించి యుద్ధానికి కారణమైన అమెరికాయే ఇప్పుడు సిరియాలోని కుర్దులను ప్రోత్సహిస్తోంది.అలా అనివారికి అండగా నిలవకుండా, కుర్దులపై టర్కీ దాడులు జరుపుతుంటే టర్కీపై హూంకరింపులు చేస్తోంది. అమెరికా బెదిరింపులకు లొంగేది లేదని టర్కీ అధ్యక్షుడు ప్రకటించారు. కుర్దులను రెచ్చగొట్టి సిరియాలోనూ, సరిహద్దుల్లోనూ యుద్ధ వాతావరణం సృష్టించిందిఅమెరికాయే. పశ్చిమాసియాలో పాలస్తీనా, ఇజ్రాయెల్ ల మధ్య ఘర్షణలకు కారణమైన అమెరికా ఇప్పుడు కుర్దులు పోరాటానికి ఆజ్యం పోసి చోద్యం చూస్తోంది.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనాతో వాణిజ్య యుద్ధం చేసేందుకు ఉపక్రమించి వెనక్కి తగ్గారు. ఆ తర్వాత ఇరాన్ భరతం పడతానన్నారు. ఇరాన్‌తో చమురు వాణిజ్యంచేయరాదంటూ భారత్ సహా అన్ని దేశాలకూ హుకుం జారీ చేశారు. ఇప్పుడు సిరియా నుంచి దళాలను ఉపసంహరిం చుకుంటున్నట్టు ఉన్న ఫళంగా ప్రకటించి, సిరియాలో ఉన్న కుర్దులపై విరుచుకు పడేందుకు టర్కీకి అవకాశం కల్పించారు. టర్కీని సర్వనాశనం చేస్తానంటూ ఇప్పుడు హూంకరింపులు జారీ చేస్తున్నారు. ట్రంప్ తాటాకు చప్పుళ్ళకు బెదరబోమంటూ టర్కీ అధ్యక్షుడు స్పష్టం చేశారు. మొత్తం మీద ట్రంప్ అనాలోచిత నిర్ణయం వల్ల సిరియాలో కుర్దుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టు అయింది.

కుర్దుల పై ఇప్పుడు యావత్ ప్రపంచం దృష్టిని సారించింది.సిరియా ఉత్తర ప్రాంతంలో 17 లక్షల మంది కుర్దులు ఉన్నారు.ఏడు దశాబ్దాల క్రితం ఫ్రాన్స్ నుంచి స్వాతంత్ర్యం పొందిన సిరియా కుర్దులు, ఆర్మీనియన్లు, అసిరియన్లు, క్రైస్తవులు, సున్నీ, షియా జాతుల సమాహారంగా ఏర్పడింది.రెండున్నర నుంచి నాలుగు కోట్ల వరకూ ఉండే కుర్దులకు సంఖ్యాధిక్యత ఉన్నప్పటికీ

ప్రత్యేకించి ఒక దేశం లేదు.ఇరాన్,ఇరాక్, టర్కీ, ఆర్మీనియాల్లో కుర్దులు విస్తరించిఉన్నారు. ఇరాక్ తో సఖ్యత ఏర్పడితే కుర్దులు స్వతంత్ర దేశంగా ప్రకటించుకునేందుకు అవకాశంఉంది.స్వయం ప్రతిపత్తి కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరిపించాలని గత నెలలో నిర్ణయించడమే కుర్దులపై దాడులకు ప్రధాన కారణం. కుర్దులను అవసరాలకు వినియోగించుకుని వారిని వదిలివేయడం ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాంహుస్సేన్ కాలంలో కూడా జరి గింది. అపప్టి నుంచి వారిలో స్వాతంత్ర్య కాంక్ష పెరిగింది. తమ సరిహద్దు ప్రాంతాల్లో కుర్దులు స్వాతంత్ర్య పోరాటాన్ని ముమ్మరం చేస్తారేమోనని ఇరాన్,టర్కీలు భయపడ్డాయి.కుర్దులపై టర్కీ విరుచుకుని పడటానికి ఏనాటికైనా వారు ఏకుమేకవుతారేమోనన్న భయమే కారణం. ప్రజాభిప్రాయ సేకరణను ఆపించేందుకు ఈ దేశాలన్నీ ఐక్యరాజ్య సమితిని ఆశ్రయించి,సమితి చేత హెచ్చరిక చేయించాయి.

**అమెరికాయే కారణం:** కుర్దుల్లో స్వాతంత్ర్య కాంక్ష పెరగడానికి అమెరికాయే కారణం. సద్దాం హుస్సేన్ ని పదవి నుంచి దింపే యడానికి కుర్దుల సాయాన్ని అమెరికా తీసుకుంది.ఇరాక్ ను ఆక్రమించుకున్న తర్వాత ఉత్తర ప్రాంతంలో కుర్దులకు స్వయం ప్రతిపత్తిని ప్రకటిస్తున్నట్టు తెలిపింది. అమెరికాకు చెందిన కీలక వ్యక్తులు ప్రత్యక్షం గా,పరోక్షంగా కుర్దులకు మద్దతు ఇస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో కుర్దుల స్వాతంత్ర్య కాంక్ష ను రగుల్కొల్పడంలో అమెరికా వైఖరే కారణం.కుర్దులను రంగంలోకి దింపి ఇప్పుడు టర్కీ సేనల దాడు లకు కుర్దులు బలి అయ్యేట్టు చేసిందిఅమెరికాయే. ఇప్పుడు టర్కీ పని పడతాననడం మేకపోతు గాంభీర్యమే. టర్కీకి అరబ్ లీగ్ సహా పలుదేశాల మద్దతుఉంది. అందుకే అమెరికా రంగంలోకి దిగకుండా హెచ్చరికలకే పరిమితం అవుతోంది. 2011లో అరబ్ స్ప్రింగ్ (వసంతం) పేరిట జరిగిన ఆందోళనలు అన్నిదేశాల్లో మాదిరిగా సిరియాలో అంతఃకలహాలను రేపింది.సిరియాలో అంతర్యుద్ధానికి కారణం అయింది. రాజు అసద్ బషర్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఆందోళన, సున్నీ, షియా తెగల మధ్య సెగలు రేపింది. చివరికి సున్నీల తరపున సౌదీఅరేబియా, షియాల తరపున ఇరాన్ అండగా నిలిచాయి.ఎనిమిది సంవత్సరాల పైగా సాగుతున్న అంతర్యుద్ధంలో వేలాది మంది మరణించారు. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ సిరియా, ఇరాక్ (ఐఎస్ఐఎస్) పుట్టడానికి ఈ అంతర్యుద్ధం కారణమైంది. సిరియాపై అమెరికా మద్దతుతో ఇంతకాలం దాడులు చేస్తూ వచ్చిన కుర్దులు ఇప్పుడు టర్కీ సేనలు తమ మీద పడటంతో సిరియా అధ్యక్షుడు అసద్‌తో అంగీకారం కుదుర్చుకున్నారు.



సిరియాలో టర్కీ సేనలు ప్రవేశించకుండా నివారించేందుకు కుర్దులు సిద్ధమయ్యారు.అయితే, టర్కీ భరతం పడతానని ప్రగల్బాలు పలికిన ట్రంప్ టర్కీ ఆకాంక్షలకు తలఒగ్గేలా ఐదురోజుల కాల్పుల విరమణను ప్రకటించింది.దక్షిణ సిరియా సరిహద్దుల నుంచి 20 మైళ్ళ పరిధిలో సేనలు ఉండరాదన్న స్వీయ అభిమతాన్ని మన్నించి అందుకు తగినఏర్పాట్లు సిరియా చేసింది .ఇది తమ విజయంగా టర్కీ విజయంగా ప్రకటించుకుంది. ఈ మొత్తం వ్యవహారాన్ని కలిపి చూస్తే సిరియాలోని కుర్దులను టర్కీ సేనలకు వ్యతిరేకంగా ప్రోత్సహించిందీ ,తర్వాత వెనక్కి తగ్గిందీ అమెరికాయే.టర్కీతో ఉన్న సమస్యలను సిరియా పరిష్కరించుకునేందుకు ప్రయత్నాలు చేస్తుండగా, అమెరికా జోక్యం చేసుకోవడం వల్లనే సమస్య మరింత క్లిష్టతరంగా మారింది.సున్నీ, షియా తెగల మధ్య వైరాన్నిపెంచింది కూడా అమెరికాయే. సౌదీ అరేబియా ఇరాన్ కి వ్యతిరేకంగా మారడానికి అమెరికాయే కారణం. సిరియాలో తిరుగుబాటుదారులకు సౌదీ అరేబియా ఆయుధ, ఆర్థిక సాయాన్ని అందించిన సంగతి బహిరంగ రహస్యం. సిరియాలో సౌదీ జోక్యంతో ఇరాన్ రంగంలో ప్రవేశించింది. తిరుగుబాటు దారులపై సిరియన్ సైన్యం ఉక్కుపాదం మోపడంతో అరబ్ లీగ్, ఐరోపా, టర్కీ తిరుగుబాటు దారులకుమద్దతుగా నిలిచాయి. సిరియాలో అగ్గి రాజేయడానికీ,కుర్దులను పోరా టానికి ఉసిగొల్పడానికి అమెరికా అనుసరిస్తున్న వైఖరే కారణం. ఐసీస్ ఉగ్రవాదాలను అన్ని ప్రాంతాలనుంచి తరిమివేసేవరకూ ఇరాక్,టర్కీ సైన్యాలు కుర్దుల సేవలను పూర్తిగా ఉపయోగించుకున్నాయి. స్వాతంత్ర్య పోరాటం జరిపే సేనలకు ఇరుగుపొరుగు దేశాల మద్దతు ఉం టుంది.కానీ, కుర్దులను ఇరుగు పొరుగు దేశాల సైన్యాలు వ్యతిరేకించడం గమనార్హం.కుర్దులకు స్వాతంత్ర్యంవస్తే భూభాగాల పంపకానికి పేచీ పెట్ట వచ్చని ఇరాక్ అనుమానిస్తోంది.కుర్దులకు ఇరాక్ వ్యతిరేకంగా మార డానికి ఇదో కారణం. ఇరవైవ శతాబ్దం నాటికి అన్ని దేశాల్లో ఈ మాదిరి పోరాటం సాగించిన సేనలన్నీ స్వాతం త్ర్యాన్ని పొందాయి.కానీ కుర్దుల విషయంలో అది సాధ్యం కాకపవడానికి అమెరికా ఇచ్చిన మాట తప్పడం, పొరుగు దేశాల నుంచి సహకారం లేకపోవడం ప్రధాన కారణం. కుర్దు ప్రాంతం ఒక స్వతంత్ర దేశంగా ఇప్పటికే వ్యవహరిస్తోంది. చమురుక్షేత్రాలను లీజుకు ఇచ్చి వాటి ద్వారా ఆదాయాన్ని పొందుతోంది. అమెరికా గుర్రుకుఅదో కార ణం. ప్రపంచంలో ఏమూల చమురు ఉన్నా అది తమ దేశానికే చెందాలన్న యావ తోనే గల్ఫ్ లో అమెరికా పదే పదే జోక్యం చేసుకుంటోంది.

ఇరాన్,ఇరాక్,సిరియా , టర్కీల సరిహద్దులలో విస్తరించిన కుర్దులు కుర్దిస్తాన్ పేరిట స్వతంత్రదేశంకోసం తరతరాలుగా పోరాడుతున్నారు.నిజానికి ఇరాక్‌ను ఐసీస్ ఉగ్ర వాదుల నుంచికాపాడింది కుర్దులే. అప్పట్లోఐసిస్ ఉగ్రవాదుల ధాటికి తట్టుకోలేక ఇరాక్ సైన్యం పారిపో యింది. ఈ పరిస్థితుల్లో కుర్దులు తమ ప్రాంతమైన పెషమర్గా నుంచి ఐసిస్ ఉగ్రవాదులను తరిమి కొట్టారు. ఐసిస్ ఖాళీ చేసిన ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. అమెరికాలోని రిపబ్లికన్,డెమోక్రాటిక్ పార్టీలకు చెందిన లాబీ యిస్టులకు కుర్దులు భారీ ఎత్తున నిధులు అందజేశారు.కానీ,అమెరికా నుంచివారికి రావల్సిన స్థాయిలో మద్దతురాలేదు.చివరికి అమెరికా ఉసికొల్ప డంతో ఆందోళనప్రారంభించిన కుర్దులు టర్కీసైన్యం నుంచిదాడులకుగురి అవుతున్నారు. కుర్దులు అమెరికా వలలో పడ్డారనడానికి ఇదే ఉదాహరణ.

- పద్మనాభస్వామి

# రాఘవ పాండవీయం



**కం. తన పాండుసమాఖ్యా జగం**
**బున వెలయంగ నిట్టు సకల భూనాథుల నా**
**త్మనిదేశవర్తనులుగా**
**నొనరించె నితాంత వైభవోజ్జ్వలుం డగుచున్.**

**రామాయణార్థం:** తన = తన యొక్క, పాండుసమాఖ్య = తెల్లనైన కీర్తి, జగంబునన్ + వెలయగ = లోకములో ప్రకాశించగా, నితాంత = ఎల్లప్పుడు, వైభవ + ఉజ్జ్వలుడు + అగుచున్ = వైభవకాంతిగలవాడై, ఇట్లు, సకలభూనాథుల = అన్ని దేశముల రాజులను, ఆత్మనిదేశవర్తనులుగా = తన మాటకు కట్టుబడి నడుచుకొనునట్లు ఒనరించెన్ = చేసెను.

**భారతార్థం :** తన యొక్క పాండు సమాఖ్య = పాండురాజు అను పేరు. మిగతాదంతా సమానము.

**తాత్పర్యము:** తన తెల్లనైన కీర్తి/ పాండురాజను పేరు లోకములో ప్రకాశించగా ఎల్లప్పుడు వైభవకాంతిగలవాడై ఈ విధముగా అన్ని దేశముల రాజులను తన మాటకు కట్టుబడి ప్రవర్తించునట్లు చేసెను.

-- --- --

**కం. అతివినయాన్విత కుంతియు**
**ధృతి మహిమాద్రియును నగుచు నతిప్రీతితరం**
**గితమతులై తను గొలువగ**
**జతురమృగయు లేగు దేర జనియెన్ వనికిన్.**

**రామాయణార్థం:** అతివినయ + అన్వితకుంతియు = ఈటెలుగల వారు తోడు రాగా, ధృతిమన్ = ధైర్యశక్తికి, హిమ + అద్రియును + అగుచు = హిమాలయ సమానుడై, అతిప్రీతితరంగితమతులై = మిక్కిలి సంతోషముతో నిండిన మనస్సుగల, చతుర మృగయులు = నిపుణులైన వేటగాండ్రు, తనున్ + కొలువంగా = తన వెంట, ఏగుదేర = రాగా, వనికిన్ = అడవికి, చనియెన్ = వెళ్లెను.

**తాత్పర్యం:** ఈటెలు ధరించినవారు తోడురాగా, ధైర్యశక్తిలో హిమపర్వత సమానుడై నిపుణులైన వేటగాండ్రు సంతోషాత్ములై తనవెంట రాగా అడవికి వెళ్లెను. (దశరథుడు)

**భారతార్థం:** అతివినయాన్విత = అత్యంత వినయముతో గూడిన, కుంతియు = కుంతీదేవి, ధృతిన్ = ధైర్యమునకు, మహి = స్థానమైన, మాద్రియును = మాద్రియు, నగుచు = నవ్వుచు, అతిప్రీతి తరంగితమతులై = మిక్కిలి సంతోషించిన మనస్సు గలవారై, తను గొలువగ, మిగతాదంతా సమానము.

తాత్పర్యము: అత్యంత వినయ సంపన్నులైన కుంతి, మాద్రి నవ్వుచు మిక్కిలి సంతోషాత్ములై తనవెంట రాగా పాండురాజు వేటకు బయలుదేరెను.

-- --- --

**ఉ. హారిమృగవ్యనవ్యవిహితాదరు డాధరణీతలేశు డ**
**ధ్వారచితశ్రమాకలితు డై కడు మెచ్చె సురాపగాజలా**
**సారసమాగమార్హతమసారససార సౌర భో**
**దీరణకారణంబు నతిధీరసమీరకిశోరవారమున్.**

**రామాయణార్థం:** హారి = హారములు గలవాడు, మృగ వ్యనవ్య = వేటలో కొత్త, విహిత + ఆదరుడు = ఆదరముగలవాడు, ఆ ధరణీతల + ఈశుడు = ఆ రాజు (దశరథుడు) అధ్వారచిత = దారిలో కలిగిన, శ్రమాకలితుడై = బడలికచే అలసి, సురాపగా జలాసార = గంగా ప్రవాహమునకు, సమ = సమానమై, ఆగమ = శ్రుతిస్మృతులవలన, అర్హ = శ్రేష్ఠమైన, (ఆగమ + అర్హ = యాత్రా యోగ్యమైన అని కూడ చెప్పవచ్చును). తమ సారస = తమ సానదీజలములందుగల, సారస = బెగ్గురు పక్షులుగల, సారస = తామరల యొక్క, సౌరభ + ఉదీరణ = వాసనలు విస్తరించుటకు, కారణంబు = కారణమైన, అతిధీర = మెల్లమెల్లనైన, సమీరకిశోరవారమున్ = మందమారుత సమూహమును, కడున్ + మెచ్చె = మిక్కిలి మెచ్చెను.

**తాత్పర్యము:** హారములు ధరించిన ఆ దశరథుడు కొత్తదనము వేటలో కనిపించగా దారి మధ్యలో ఏర్పడిన బడలికచే గంగా ప్రవాహ సమానమైన, యాత్రా యోగ్యమైన తమసాజలములలోని బెగ్గురు పక్షులను, తామరల వాసనలు విస్తరించుటకు కారణమైన మెల్లమెల్లగా వీచు మందమారుత వాయువులను మెచ్చెను.

**భారతార్థం :** హారి = ఒప్పుచున్న, మృగవ్య = వేటలో, నవ్య = కొత్తగా, విహిత + ఆదరున్ = ఆదరముగలవాడు, ఆ ధరణీతలేశుడు = ఆ పాండురాజు, అధ్వారచిత శ్రమాకలితుడై, సురాపగాజలాసార = గంగా జలప్రవాహములందు (మిగతా సమానము) సా రసౌరభ = మంచి వాసనలు, ఉదీరణ = విస్తరించుటకు.

**తాత్పర్యము:** ఆ పాండురాజు వేటలో కొత్తదనముచే ఆదరింపబడినవాడై దారిలో ఏర్పడిన శ్రమవలన అలసిపోయి ప్రవాహములందు పరస్పర సాంగత్యముగల బెగ్గురు పక్షులను, మంచి వాసనలు విస్తరించు మందమారుత సమూహమును కడు మెచ్చెను.



డా. ఆర్.అనంత పద్మనాభరావు
రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ జనరల్, దూరదర్శన్
9866586805

# పోరాటాల పీవీ రమణ

పెంటకోట వెంకటరమణ సుదీర్ఘ రాజకీయ జీవితంలో పదవుల కోసం కాకుండా విలువలకే ప్రాధాన్యం ఇచ్చిన పాత తరం ఉత్తరాంధ్ర నాయకుడు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అవిభక్త ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు నమ్మకమైన అనుచరునిగా ఉండేవారు. 1994లో విశాఖలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారసభలో ప్రధానిగా పీవీ నరసింహారావు తాను అమలుజేస్తున్న ఆర్థికసంస్కరణలను గురించి ప్రస్తావిస్తూ, భారత్ బలమైన శక్తిగా రూపు దిద్దుకుంటోందనీ, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమై, ఆ యూనియన్‌లోని ఒకప్పటి దేశాలన్నీ పెట్టుబడిదారీ విధానం వైపు అడుగులు వేస్తున్నాయని అంటూ ఆ ప్రాంతానికి చెందిన పెంటకోటి వెంకట రమణనుద్దేశించి ఒకనాటి నా మిత్రుడు ఈ వాస్తవాన్ని అంగీకరిస్తాననుకుంటాను అని అన్నారు.

అప్పటికి పీవీ నరసింహారావు, పీవీ రమణలు వ్యక్తిగతంగా కలుసుకుని దశాబ్దాలైనా ఒకనాటి కమ్యూనిస్టు నేత, శాసనసభలో పీవీతో కలిసి ఉన్న పెంటకోట వెంకట రమణపై ఆయనకు ఉన్న అవగాహన అది. 1995లో మళ్ళీ ప్రధాని పీవీ ఒకసారి ఒడిషా పర్యటనకు వెళ్తూ విశాఖ విమా నాశ్రయంలో మజిలీ చేశారు. ఆ సమయంలో నగరానికి చెందిన ప్రజా ప్రతినిధులు పీవీకి సన్నిహితులతో ఐఎన్ఎస్ డేగా (విమానాశ్రయ నిర్వహణ ప్రాంతం)లో ప్రధాని పీవీకి పరిచయ కార్యక్రమం జరిగింది. పీవీ సన్నిహితులు, ఇతరులతో పాటు పీవీ రమణ కూడా వరుసలో ఉన్నారు. అందరినీ పల కరిస్తూ వచ్చి ఏం రమణా బాగున్నారా, ఆరోగ్యం ఎలా ఉంది? అని కుశల ప్రశ్నలు వేశారు. పక్కనే ఉన్న రాజ్యసభ సభ్యుడు ద్రోణంరాజు సత్యనారాయణ కల్పించుకుని, రమణ గారు మన పార్టీలో లేరు. తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. అని చమత్కరించారు. అందుకు పీవీ స్పందిస్తూ, రమణ గారు ఏ పార్టీలో ఉన్నా ప్రజల మనిషి, ప్రజాసమస్య ల కోసం తప్ప మరే ఇతర స్వార్థ చింతనా లేని గొప్పవారు. అంటూ పీవీ రమణను పీవీనరసింహారావు ఆలింగనం చేసుకున్నారు.పై



నేడు శతజయంతి

రెండు సంఘటనలు చూసిన పార్టీ నేతలు, పత్రికల్లో చదివిన పాఠకులు పీవీ నరసింహారావు, పీవీ రమణల అనుబంధానికి అచ్చెరువొందారు. నాటి దేశ ప్రధా ని ఒక మాజీ ప్రజాప్రతినిధి పట్ల ఇంత అవగాహన ఉండటానికి ఆ నేత సుదీర్ఘ కాలం చేసిన ప్రజాసేవా కార్యక్రమాలు, నీతి నిజాయితీలతో కూడిన జీవన విధానమే కారణం. పీవీ రమణ రాజకీయ జీవితం కమ్యూనిస్టు పార్టీతో ప్రారంభమైంది. తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. ఆ సమయంలోనే పీవీకి సన్నిహితమయ్యారు. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత ఎన్టీఆర్ పిలుపుపై ఆ పార్టీలోకి వెళ్ళారు. ఏ పార్టీలో ఉన్నా పాత మిత్రులను పీవీ నరసింహారావు అదే ఆప్యాయతతో పలకరించేవారు. పీవీ రమణ కూడా అదే రీతిలో ఉండేవారు. ఆనాటి తరం నాయకులు పదవీ రాజకీయాలకోసం కాకుండా విలువలకే ప్రాధాన్యం ఇచ్చేవారనడానికి ఇదే ఉదాహరణ. పీవీ రమణగా అందరికీ చిరపరిచితులైన పెంటకోట వెంకట రమణ పార్టీలు మారినా విలువలను ఏనాడూ వదులుకోలేదు. పాత పరిచయాలనూ, మిత్రులనూ వదులుకోలేదు విశాఖ రూరల్ జిల్లాలో జరిగిన అనేక రైతాంగ పోరాటాల్లో రమణ మార్గ నిర్దేశకులు. డెబ్బై ఏళ్ళ వయసు మీరినా 1993లో జరిగిన సారా వ్యతిరేక ఉద్యమాన్ని రమణ నడిపించిన తీరు అన్ని పార్టీలలోని యువ నాయకులను ఆకర్షించింది.. ఆయన మంచి రచయిత, సాహిత్యాభిమాని, మృదుశైలిలో ఎదుటి వారిని అభ్యుదయ భావాలతో తీర్చిదిద్దడంలో అందెవేసిన నేత. వేలాదిమందిని ప్రభావితం చేసిన స్ఫూర్తి ప్రదాత. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, తెన్నేటి విశ్వనాథం, వావిలాల గోపాల కృష్ణయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు వంటి నేతల కోవకు చెందిన వారు. ఈ నెల 20వ తేదీన ఆయన శతజయంతి ఉత్సవాలను విశాఖ జిల్లా మునగపాక గ్రామ ప్రజలు, అభిమానులు నిర్వహిస్తున్నారు.

-బీవీ అప్పారావు
9347039294

# సిరివెన్నెలలో మాటలసిరి

సినిమాలో, కథ అవసరాన్ని బట్టి ఎప్పుడు ఎలాంటి సన్నివేశాలు, సంభాషణలు కావాలో మాటల రచయితకు వివరించి అద్భుతమైన సీన్‌లను రాబట్టగలగడంలో దర్శకుడు కె.విశ్వనాథ్ దిట్ట. దర్శకుడు, కథకుడు, మాటల రచయిత కలిసి మేధో మథనం చేస్తేనే గొప్ప సినిమా స్క్రిప్టు రూపుదిద్దుకుంటుంది. సినిమాకు సన్నివేశాలను తేలిగ్గా అల్లుకోవచ్చు. సన్నివేశం తెలిస్తే సంభాషణలు సులభంగానే రాసేయవచ్చు. కానీ కొన్ని సన్నివేశాలకు సంభాషణలు రాయడం ఓ పరీక్షగా నిలుస్తుంది. సిరివెన్నెల చిత్రంలో మూడు,నాలుగు సన్నివేశాలు అలాంటి పరీక్షే పెట్టాయి. వాటిని ఈ వారం వివరిస్తా. సిరివెన్నెల చిత్రంలో కథానాయకుడు (నటుడు సర్వదమన్ బెనర్జీ) గుడ్డివాడు. కానీ ప్రముఖ ఫ్లూట్ విద్వాంసుడు. ఆ పాత్రపేరు హరిప్రసాద్. ఈ చిత్రంలో మూన్ మూన్ సేన్, సుహాసిని కథానాయికలు. సుహాసిని అద్భుతమైన చిత్రకారిణి. కానీ ఆమె మూగది. కథ చర్చల సమయంలో విశ్వనాథ్ ఒక పరీక్ష పెట్టారు. 'కథ మొత్తం విన్నారు కదా.. ఒక సీను రాయడం మాత్రం ఈ రోజు నుంచే ప్రయత్నం చేయండి. ఇంకో నాలుగు నెలల్లో షూటింగ్ ప్రారంభం అవుతుంది కదా.. అప్పటికి కనీసం ఒక్క వెర్షన్ అయినా పూర్తి చేయగ లుగుతామేమో చూద్దాం' అన్నారు. ఎందుకిలా అన్నారా అని మదనపడ్డా. తీరా కథ విన్నాక ఆ సన్నివేశం ప్రాధాన్యత, సంభాషణలు రాయడం ఎంత కష్టమో అర్థమైంది. ఇక ఆ సన్నివేశం గురించి చెప్పాలి. హరిప్రసాద్ అప్పటికే గొప్ప సంగీత విద్వాంసుడిగా పేరు ప్రఖ్యాతులు పొందాడు. స్వగ్రామంలో అతడికి సన్మానం చేయాలన్నది మిశ్రో (విశ్వం పాత్రధారి) ఆలోచన. అందు కోసం ఓ సమావేశం ఏర్పాటు చేస్తాడు. ఆ ఊరి బస్టాండులో ఫ్లూటు ఊదుతూ గడిపిన ఓ కుర్రాడు, ఆ తరువాతి కాలంలో దేశంలోనే ప్రఖ్యాత సంగీత విద్వాంసుడిగా ఎదిగి, మళ్లీ సొంతూరికి రావడంతో సన్మానం చేయాలన్నది ఆలోచన. ఆ సమావేశంలో నిర్వాహకుడిగా మిశ్రో ఏం మాట్లాడాలన్నది సీన్. అయ్యప్పదీక్షలో ఉన్న నాకు ఓ ఆలోచన మెరిసింది. దర్శకుని వద్దకు వెళ్లి స్ఫురించిన సంభాషణలు వినిపించాను. 'మానస సరోవరంలో పుట్టిన గంగ.. శివయ్య కళ్లముందు కిందకు దిగి.. దిగివచ్చి, విశాలమైన మహాగంగగా మారిపోయి తిరిగి కాశీలో అదే విశ్వేశ్వరుని పాద సన్నిధి చేరినప్పుడు ఆ శివయ్య ఏ విధమైన అనుభూతి పొందాడో నాకు తెలియదురా.. నా కళ్లముందు పుట్టి చిన్న పాయలా పెరిగి.. పెరిగి ఇప్పుడు మహానదిలా అభివృద్ధి చెందావు' అని మిశ్రో డైలాగ్‌గా చెప్పా. ఇదేదో తపస్సులో ఉండి రాసినట్టుందంటూ విశ్వనాథ్‌గారు మెచ్చుకున్నారు. ఇదే సన్నివేశం (సన్మానసభ)లో హరిప్రసాద్ చిత్రం గీసి ఆయనకు బహూకరించాలని మిశ్రో అనుకుంటాడు. కానీ ఎవరు గీయాలన్నది ప్రశ్న. అప్పుడు హరిప్రసాద్ కల్పించుకుని నాతో వచ్చిన ఈమె (సుహాసిని) మంచి చిత్రకారిణి.. నా చిత్రం గీస్తుందని అంటాడు. కానీ ఆమె మూగది. హరిప్రసాద్ బొమ్మ వేస్తానని సైగల ద్వారా తెలియ చేస్తుంది. కానీ సాక్షి రంగారావుకు ఈమె వేయగలదా అన్నది సందేహం. అతడి అను మానాలను తేలిగ్గా తీసేస్తూ, 'ఆమె వేస్తుం దిలే.. హరి చెపుతున్నాడు కదా' అని మిశ్రో అంటాడు. ఆ తరువాత ఆమె గీసిన చిత్రాన్ని చూసి సాక్షి రంగారావు, 'ఏమిటండి ఈమె.. హరిప్రసాద్ చిత్రం గీయమంటే సూర్యుడు.. చంద్రుడు.. ఓంకారం.. మధ్యలో ఈ పద్మం.. ఏమిటండి ఈ చిత్రం' అని విసుక్కుం టాడు. నిజానికి సుహాసిని గీసిన చిత్రం అలానే ఉంది. ఆ సీన్‌లో దర్శకుడి ప్రతిభేమిటో తెలుస్తుంది. ఆమె గీసిన చిత్రం అసాధారణంగా ఉంది. తాను గీయాలనుకున్నది అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన గొప్ప వ్యక్తి చిత్రం. కళ్లు బదులు సూర్యచంద్రులు, ముక్కు బదులు ఓంకారం, పెదవులకు బదులుగా పద్మం ఉండేటట్టు చిత్రం గీసింది. అప్పటికే ఈ సన్నివేశం కోసం దాదాపు తొమ్మి వెర్షన్లు రాశా. మూడు వెర్షన్లు వినిపించాను. కానీ ఎవరికీ తృప్తి లేదు. తీరా ఆ రోజు ఉదయం షూటింగ్‌కి వెళ్లే సమయంలో కొంత స్పష్టత వచ్చింది. అదే చిత్రంలో కనిపించిన ఈ సన్నివేశం. నందిహిల్స్ షూటింగ్ స్పాట్‌లో సుహాసిని ప్రదర్శించాల్సిన హావభావాలను ఒక్కొక్కటి విశ్వనాథ్‌గారు స్వయంగా చేసి చూపెడుతుంటే యూనిట్ సభ్యులంతా చప్పట్లు కొట్టారు.



సినీసరిగమలు

తాను గీసిన హరిప్రసాద్ చిత్రంలోని విశేషాలను సుహాసిని తన హావభావాలు, సైగలతో వివరించిన తీరు అద్భుతం. ఆ సన్నివేశంలో నటన అంత సులువేం కాదుమరి.. ఈ సినిమా షూటింగ్ సమయంలో నేను గుర్తుంచుకున్న మరో సంభాషణ గురించి చెప్పాలి. 'నా మనసు సాధారణమైంది. రాగిది.. కంచుది.. కానీ నీ మనసు బంగారం' అంటూ హీరోయిన్ చెప్పడం గొప్ప అనుభూతి.



- తోటపల్లి సాయినాథ్
9394449777

మహాభారతంలో... పురుష పుంగవులు

# ధర్మరాజు-2

మాయా ద్యూతంలో ఓడి ధర్మరాజు తమ్ములతో, ద్రౌపదితో అరణ్యాలకు వెళ్లాడు. ఎందరో పౌరులు అనుసరించారు. వారిని అనునయించి వెనుకకు పంపినా కొందరు బ్రాహ్మణులు మాత్రం వెనుదిరగలేదు. మీతోనే మా బ్రతుకని భీష్మించారు.దాంతో ధర్మజుడు వారి పోషణ భారాన్ని వహింపక తప్పలేదు. ధౌమ్యపురోహితుడి సూచన మేరకు సూర్యభగవానుడిని ఆరాధించి అక్షయ పాత్రను పొంది వారందరికి రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ కాలం గడుపుతున్నాడు. దీనివలన ద్రౌపదికి కొంతకు కొంత మహాసప్రయాస తప్పింది. కామ్యకవనంలో కొంతకాలమున్నారు. ఇంతలో ధృతరాష్ట్రుడి నిష్ఠుర వాక్యాలకు అలిగిన విదురుడు పాండవుల దగ్గరకు వచ్చాడు. అయినా ఎక్కువకాలం ఉండలేదు. గ్రుడ్డిరాజు విదురుడి వియోగాన్ని సహించలేక సంజయుడిని పంపి హస్తినకు రప్పించుకున్నాడు. కామ్యక వనప్రవేశ సమయంలోనే బకాసురుడి తమ్ముడు కిమ్మీరుడుని భీముడు వధించాడు.

తర్వాత యాదవులు, పాంచాలురు పాండవుల్ని చూడవచ్చారు. శ్రీకృష్ణుడు మిక్కిలి కుపితుడై సుయోధనాదుల్ని సంహరించి ధర్మరాజుకు రాజ్యాన్ని ఇస్తానని కూడా పలికాడు. అర్జునుడి సాంత్వన వచనాలతో శాంతించాడు. తాము ఇద్దరూ నరనారాయణులమని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ద్రౌపది కృష్ణుడికి తన పరిభవాన్ని చెప్పి దుఃఖించింది. తాను సాంబుడితో యుద్ధం చేస్తున్నానని, తాను సభలో ఉంటే ఇంత జరిగేది కాదని కృష్ణుడు పలికి ఆమెను ఓదార్చాడు. తర్వాత సుభద్రను, అభిమన్యుడిని తీసుకుని యాదవులు ద్వారకకు, ప్రతివింద్యాదులైన ఉపపాండవులను తీసుకుని ధృష్టద్యుమ్నాది పాంచాలురు ద్రుపదుపురానికి వెళ్లగా పాండవులు ద్వైతవనానికి వెళ్లారు. ద్రౌపది ధర్మజుడిని యుద్ధోన్ముఖుడిని చేయసమకట్టింది. ధర్మేతరుల విషయమై ధర్మం పనికిరాదన్నది. కాలానుగుణంగా విక్రమించని రాజును అసమర్థుడని సేవకులు సహితం అవమానిస్తారన్నది. కోలోచితంగా క్షమా దండనలు రాణిస్తాయి. నీ తమ్ములు దుర్యోధనాదుల్ని వధించి నీకు రాజ్యాన్ని అప్పగిస్తారు అనుమతించమన్నది. ధర్మజుడు చలింపలేదు.

ఆతడు ధైర్యహేమాచలుడు. ధర్మం తప్పనన్నాడు. నీవు దైవాన్ని నిదించావు, అది తగదన్నాడు. ఉద్విగ్నునై దైవాన్ని దూరాను అది తప్పేనని ద్రౌపది అంగీకరించింది. భీముడు కూడా ద్రౌపదిని సమర్థించి వెంటనే కౌరవుల్ని జయించి రాజ్యాన్ని కైవశం చేసుకుందామన్నాడు. ఎంత ధీరుడైనా కాలప్రభావానికి ఒకప్పుడు లొంగవచ్చు. పరిస్థితి ప్రమాదంలో పడే విధంగా ఉంది. వెంటనే వ్యాసమహర్షి ప్రత్యక్షమై ఆ గండాన్ని గట్టెక్కించాడు. ఇది సమయం కాదు. మీరింకా ఆయుధ సంపత్తిని సమకూర్చుకోవాలి. ఇదిగో, ఇది ప్రతిస్మృతి విద్య ముందు దీనిని నీవు గ్రహించు. తర్వాత దీన్ని అర్జునుడికి ఉపదేశించు. ఆతడు దీని శక్తివల్ల ఇంద్రాది దేవతల యొక్కయు ఈశ్వరుడి యొక్కయు దివ్యాస్త్రసంపత్తిని పొందుతాడని చెప్పాడు. ధర్మజుడు వ్యాసుడి ఆదేశాన్ని పాటించాడు. అర్జునుడు ప్రతిస్మృతిని అన్నవలన పొంది ఘోరవీరంగా తపస్సు చేసి ఇంద్రాదులవలన, అనంతరం ఈశ్వరుడివలన

మారణాయుధాలు పొందడమే గాక స్వర్గానికి వెళ్లి ఇంద్రుడితో పాటు అర్ధసింహాసనా శీనుడయ్యాడు. నివాతకవచాది రాక్షసుల్ని వధించాడు. అర్జునుడి అభ్యుదయాన్ని రోమశుడనే మునివలన విని ధర్మజుడు సంతోషించాడు.

ధర్మరాజు ఉత్తమోత్తమ శ్రోత. చెప్పడం సులభం. వినడం చాలా కష్టం. వనవాసంలో బృహదశ్వుడు, మార్కండేయుడు, శౌనకుడు మున్నగు ఋషులు ఎన్నో ధర్మాల్ని, కథల్ని విన్పించారు.

**"పుడమియు రాజ్యము బంధుల/ విడిచి మృగావలుల గలసి విపినంబులలో గడుగొని మాయట్లిడుమల/ బడిన నృపులు గలరె యొరులు..."** అని అడిగేవాడు ధర్మరాజు. బృహదశ్వుడు నలోపాఖ్యానం చెప్పాడు. నలుడు బిడ్డల్ని, భార్యను వదలి ఎంతగానో కష్టించాడు. ఆతని దుర్దశతో పోలిస్తే నీదెంత? ద్రౌపది, తమ్ములు, మునులు నీవెంట ఉండి నిన్ను సేవిస్తున్నారని మేలమాడాడు. అనంతరం ఇంద్రుడు పంపిన రోమశుడనే ఋషితో కలిసి ధర్మరాజు భార్యతో, భీమనకులసహదేవులతో తీర్థసేవకై తరలివెళ్లాడు అగస్త్యమహాముని చరిత్రను అడిగి తెలుసుకున్నాడు. తర్వాత ఋశ్యశృంగుచరిత్ర విన్నాడు. పరశురామ వృత్తాంతం తెలుసుకున్నాడు. సుకన్యోపాఖ్యానం విన్నాడు. మాంధాతృ, అష్టావక్రుడు మొదలైనవారి వృత్తాంతాలు రోమశుడు తీర్థయాత్రాసమయంలో ధర్మరాజుకు విన్పించాడు. తర్వాత హిమవత్పర్వతం మీద ఒక సంవత్సరకాలమున్నారు పాండవులు. అపుడు భీముడు సర్పరూపంలో గల నహుషుడికి చిక్కాడు. నహుషుడి ప్రశ్నలకు సరి అయిన సమాధానాలు చెప్పి భీముడిని విడిపించాడు. నహుషుడిని శాపవిముక్తుడిని చేశాడు.

**"విత్తహీనుండు వెండియు వివిధ విధుల/ విత్తవంతుండుగా నేర్చు వృత్తహీను డైనవాడు విహీనుండ యండ్రుగాన/ విత్తరక్షకు గడుమేలు వృత్తరక్ష"** ధనం కన్నా నడవడిక ముఖ్యమన్నాడు. శాపవిముక్తుడైన నహుషుడివల్ల అధ్యాత్మ విద్యారహస్యాల్ని తెలుసుకున్నాడు.

తర్వాత సత్యభామతో కలిసి కృష్ణుడు పాండవుల్ని చూడవచ్చాడు. అప్పుడే మార్కండేయుడు వచ్చాడు. నారదుడి వచనం మేరకు శ్రీకృష్ణ పాండవులకు మార్కండేయుడు పలుకథలు విన్పించాడు. ధర్మరాజుకు ప్రళయ ప్రకారం, కలియుగ ధర్మాలు చెప్పాడు. నారాయణుడి గుణగరిమ ఉగ్గడించాడు. సుపుత్రలక్షణాలు, పతివ్రతామాహాత్మ్యం వివరించాడు. ధర్మవ్యాధుడి చరిత్ర చెప్పి అహింసాస్వరూపం వివరించాడు. ఇంద్రుడు కుమారస్వామిపై వజ్రాయుధం ప్రయోగించి ఓడిన విధాన్ని తెలిపాడు. కుమారుడు సురసేనా నాయకుడవడాన్ని విన్నవించాడు. మహిషాసుర వధ వృత్తాంతం చెప్పాడు. అనంతరం పాండవులు ద్వైతవనానికి వెళ్లారు. ధర్మజుడు సద్యస్కందం అనే యజ్ఞం చేస్తున్నాడు. దుర్యోధనుడు, కర్ణశకునులు ఘోషయాత్రకై అక్కడకు వచ్చి చిత్రసేన గంధర్వుడితో పోరి ఓడారు. చిత్రసేనుడు దుర్యోధనుడిని బంధించాడు. మిగిలిన గంధర్వులు వనితాజనాల్ని, దుశ్శాసనాదుల్ని బంధించారు. కొందరు కౌరవులు, పౌరులు పారిపోయి ధర్మజుడిని శరణుజొచ్చారు. దుర్యోధనాదుల్ని రక్షించమని వేడుకున్నారు. కౌరవులు తమ వైభవాన్ని ప్రకటించి పాండవుల దైన్యాన్ని ఎత్తుచూపి అవమానించడానికై వచ్చి భంగపడ్డారు. భీముడు కాగల కార్యం గంధర్వులు తీర్చారని సంబరపడ్డాడు. వారి విషయంలో దయచూపరాదన్నాడు. అందుకు ధర్మజుడు అంగీకరించలేదు. మనలో మనకు భేదం, భేదం ఉండవచ్చు. పరుల విషయంలో మనం అందరం ఒక్కటే. అపుడు మనం 05 ప్లస్ 100 ఈజికొట్టు 105. మనలో మనం అయితే 5 : 100. పైగా శరణాగత రక్షణ పరమధర్మం. నీవంటి వీరులు దానిని పరిగ్రహింపకుండటం పెద్ద తప్పు. తమ్ములు నీవు వెళ్లి వారిని రక్షించి విడిపించండి! యజ్ఞదీక్షలో ఉన్నాను. లేకుంటే నేనే వెళ్లేవాడిని. దుర్యోధనుడు మన బలపరాక్రమాలు తెలిసినవాడు. మనం ఆతడిని రక్షించగలమనే నమ్మకంతో ఉండి ఉంటాడు. ఆ నమ్మకం చెడరాదు. దీనివలన మనకు పుణ్యం, కీర్తి వస్తాయి. పెద్దలు, ప్రజలు మనల్ని మెచ్చుతారు. ఇష్టంలేకుండానే భీముడు అర్జున నకుల సహదేవులు గంధర్వుడితో పోరి, జయించి దుర్యోధనుడిని తీసుకువచ్చారు. గంధర్వుడిని ప్రియపూర్వకంగా సంభావించి దుర్యోధనుడిని విడిపింపచేశాడు. భ్రాతృ స్నేహం ముఖ్యంగా భావించాడు. ఇట్టి సాహసాలు తగవని సుయోధనుడిని మందలించాడు. విషాదాన్ని వీడి ఇంటికి వెళ్లమన్నాడు. ధర్మజుడి వ్యక్తిత్వాన్ని తాలోత్తాలంగా నిల్పిన సన్నివేశమిది.

ఇట్లే సైంధవుడిని క్షమించిన సందర్భం కూడా వ్యక్తిత్వానికి మకుటాయమానం.

**"ఎట్టి కష్టమైన నిట్టి పాపము సేయ/ నెత్తికొనునె ధరణి నీవు దక్క? నరుగుమింకనేమి యందుము నిన్నునిం/ద్రియవిలోలు నల్పు ధృతి విహీను"**

తర్వాత మార్కండేయుడి వల్ల రామకథ, సావిత్రి కథ విన్నాడు. సావిత్రి భర్తను, అత్తమామల్ని, తల్లిదండ్రుల్ని సముద్ధరించినట్లే ఈ ద్రౌపది మీవంశాన్ని సముద్ధరిస్తుందని మార్కండేయుడు చెప్పగా సంతోషించాడు. అనంతరం యక్షప్రశ్నలకు సదుత్తరాలిచ్చి, తమ్ముల్ని బ్రతికించి, యమధర్మరాజు వరాన్ని పొంది అరణ్యవాసాన్ని పూర్తిగావించి అజ్ఞాతవాసానికి వెళ్లాడు. మనిషి అతిశయముగా బుద్ధిమంతుడగు బుధసేవన్" అని పలికాడు. ఇప్పటి వరకు తాను ఆచరిం చింది అదే. అందుకే బుద్ధిమంతుడై విజయుడయ్యాడు.



కళారత్న, (హంస)
డా.సి హెచ్.బాబావలిరావు
హైదరాబాద్, 9989792247

# బెంగళూరులో అక్రమ వలసల కేంద్రం

**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూరుకు సుమారు 40కిలోమీటర్ల దూరంలో ఉన్న నెలమంగళలో దేశంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ పౌరుల కోసం నిర్బంధ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కర్ణాటకలో డిటెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం. ఎల్ ఆకారంలో హాస్టల్ భవనం మాదిరిగా నిర్మించిన ఈ భవనంలో ఇనుప తలుపులతో ఎనిమిది గదులు ఏర్పాటు చేశారు. భవనం ఎదురుగా చిన్నపాటి గార్డెన్‌ను కూడా ఏర్పాటు చేశారు. కర్ణాటక హోం మంత్రి బసవరాజ్ బొమ్మాయి తెలిపిన వివరాలను పరిశీలిస్తే దేశంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ పౌరులను ఈ కేంద్రంలో ఉంచనున్నారు. ఈ భవనం సరిపోదనిపిస్తే బెంగళూరు పోలీస్ కమిషనర్ భాస్కర్‌రావు సిఫార్సు మేరకు మరికొంత స్థలాన్ని కేటాయించనున్నారు. ఈ సందర్భంగా బొమ్మాయి గురువారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ నాగమంగళలో నిర్బంధ కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే దీన్ని ఉపయోగించనున్నామని తెలిపారు. కాగా గత ఆగస్టులో అసోంలో వివాదాస్పదమైన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ జాబితా వెల్లడించారు. సుమారు 19లక్షల మంది పేర్లు జాబితాలో గల్లంతయ్యాయి. బీజేపీ అధికారంలో ఉన్న కర్ణాటకలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై పలు ఊహాగానాలు వెలువడుతున్నాయి. కేంద్ర హోం మంత్రి ఇటీవల ఎన్ఆర్‌సీని దేశమంతా నిర్వహిస్తామని, అక్రమ వలసదారులను బయటకు నెట్టివేస్తామని ప్రకటించారు. అమిత్ షాకు మద్దతుగా కర్ణాటక బీజేపీ ఎంపీ పీసీ మోహన్ ఎన్ఆర్‌సీని తాము స్వాగతిస్తున్నామన్నారు. బంగ్లాదేశ్ వలసదారుల వల్ల ఖచ్చితంగా మన దేశానికి ముప్పు ఉందన్నారు. ముఖ్యంగా బెంగళూరులో చాలా మంది అక్రమ వలసదారులు ఉన్నారన్నారు. ప్రధానంగా బంగ్లాదేశీయులు వీరిలో కొంతమందికి ఆధార్ కార్డులు కూడా ఉన్నాయని వీరివల్ల దేశానికి ముప్పు ఉందని మోహన్ అన్నారు. ఈ అంశంపై కర్ణాటక కాంగ్రెస్ అధికార ప్రతినిధి బీఎల్ శంకర్ మాట్లాడుతూ ఈ నిర్బంధ కేంద్రాన్ని గత ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. ఈ కేంద్రాన్ని ఎన్ఆర్‌సీ ఆధారంగా నిర్మించలేదన్నారు. తమకు తెలిసిన సమాచారం ప్రకారం వీసా గడువు ముగిసినా దేశం విడిచి వెళ్లని విదేశీయులు కోసం దీన్ని నిర్మించారన్నారు.

# పొరపాటున బీఎస్ఎఫ్ జవాన్ కాల్చివేత

**కోల్‌కతా:** ఇటీవల బీఎస్ఎఫ్ జవాన్‌ను బంగ్లాదేశ్ బోర్డర్ గార్డ్ (బీజీబీ) జవాన్ హత్య చేయడం అపార్థంతో జరిగిందని బంగ్లా హోం మంత్రి అసదుజ్జామన్ ఖాన్ తెలిపారు. ఈ ఘటన ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపదన్నారు. పరిస్థితిని, ఉద్రిక్తతను తగ్గించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో తను స్వయంగా మాట్లాడనున్నట్టు ఆయన తెలిపారు. బంగ్లాదేశ్ జలాల్లోకి అక్రమంగా ప్రవేశించినందుకు అరెస్టయిన భారతీయ మత్స్యకారుడిని నిబంధనలకు అనుగుణంగా విడుదల చేస్తామని ఖాన్ తెలిపారు. ఇరుదేశాలు స్నేహపూర్వక సంబంధాన్ని పంచుకుంటాయని బీఎస్ఎఫ్, బీజీబీకి కూడా ఇది వర్తిస్తుందని బంగ్లా హోం మంత్రి ఖాన్ అన్నారు. దురదృష్టవశాత్తు జరిగిన సంఘటన గురించి ఇరు దళాల డైరెక్టర్ జనరల్స్ కూర్చుని సమస్యను పరిష్కరిస్తారని తాము ఆశిస్తున్నామని ఖాన్ తెలిపారు. షెడ్యూల్ ప్రకారం బీజీబీ, బీఎస్ఎఫ్ మధ్య చర్చలు జరుగుతాయన్నారు. సమస్యను పరిష్కరించేందుకు అవసరమైతే అమిత్ షా మాట్లాడతామని ఖాన్ అన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం సమావేశం ఉండాలని భావిస్తున్నామన్నారు.

# శ్మశానమే ఆవాసం!

**భోపాల్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తమ నివాసం కొట్టుకుపోవడంతో ఓ గిరిజనుడు, ఎనిమిదేళ్ల అతడి కుమారుడు శ్మశానాన్ని తమ నివాసంగా మార్చుకున్నారు. స్థానిక పంచాయతీ, జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో తండ్రికొడుకులు ఇరువురూ శ్మశానంలోనే నిద్రిస్తున్న సంఘటన మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో వెలుగులోకి వచ్చింది. సాగర్ సిటీలో కూలిగా పనిచేసే కుడారీగ్రామానికి చెందిన గిరిజనుడు తన కుమారుడితో కలిసి శ్మశానవాటికలో నిద్రిస్తున్నాడు. జిల్లా రాజధానికి పది కిలోమీటర్ల దూరంలోనే ఈ ఘటన జరుగుతున్నా అధికారులు మాత్రం ఉదాసీనతను వీడలేదు. స్థానిక మీడియా ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడంతో పంచాయతీ అధికారులు గిరిజనుడు రామ్‌రతన్ (35) పంచాయతీ భవనంలో పడుకునేందుకు అనుమతించారు. ఈ సందర్భంగా రామ్‌రతన్ మాట్లాడుతూ తన నివాసం కూలిపోవడంతో కుడారీ పంచాయతీ అధికారుల సాయంకోరినా పట్టించుకోలేదన్నారు. దీంతో గత్యంతరం లేక తన కుమారుడు ఎనిమిదేళ్ల హనుమత్‌తో కలిసి శ్మశానంలోనే నివసిస్తున్నట్టు తెలిపారు. పేదల కోసం ప్రభుత్వాలు చేస్తున్న ఏ సహాయం తమకు అందలేదన్నారు. నిరుపేదలకు అందించే రేషన్‌కార్డు కూడా తమకు ఇవ్వలేదన్నారు. దరఖాస్తు చేసుకున్నా తనకు ఎటువంటి సాయం అందజేయలేదని తెలిపారు. ఈ విషయంపై సాగర్ జిల్లా పంచాయతీ అడిషనల్ సీఈవో రాజేష్ పటేరియా మాట్లాడుతూ గిరిజనుడైన రామ్‌రతన్ గురించి సమాచారం అందిందన్నారు. రెండు రోజుల్లో నివాసం, ఆహారంతోపాటు జీవనోపాధి కూడా కల్పిస్తామన్నారు. ప్రభుత్వం సాయం కోరుతూ రామ్‌రతన్ చేసుకున్న దరఖాస్తును తిరస్కరించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సాగర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జనపథ్ రాహుల్ పాండే మాట్లాడుతూ రామ్‌రతన్‌కు అన్ని ఏర్పాట్లు సమకూర్చేవరకూ పంచాయతీ భవనంలో ఉండేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

# భద్రేష్ కోసం ఎఫ్‌బీఐ వేట

**న్యూయార్క్:** అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్విస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) తమ టాప్ -10 మోస్ట్‌వాంటెడ్ జాబితాలో ఉన్న ఇండియన్ కోసం నాలుగేళ్లుగా వేటాడుతోంది. భారత్‌కు చెందిన భద్రేష్‌కుమార్ పటేల్ గుజరాతీగా ఎఫ్‌బీఐ తెలిపింది. అహ్మదాబాద్‌లోని విరామ్‌గామ్‌కు చెందిన పటేల్ భారత్‌కు పారిపోయినట్టు ఎఫ్‌బీఐ భావిస్తోంది. హత్యకేసులో నిందితుడైన పటేల్‌పై లక్ష డాలర్ల రివార్డు ఉందని ఎఫ్‌బీఐ అధికారులు తెలిపారు. పటేల్ మేరీల్యాండ్‌లోని హనోవర్‌లోని డంకిన్ డోనట్స్ దుకాణంలో తన భార్యను విచిత్రమైన రీతిలో హత్యచేసిన నేరస్థుడిగా, కోల్డ్ బ్లడెడ్ హంతకుడిగా తెలిపింది. పరారీలో ఉన్న నేరస్థుల మోస్ట్‌వాంటెడ్ జాబితా ఎప్పటికప్పుడు ఆధునీకరిస్తూ మారుస్తుంటారు. అయితే భద్రేష్ పటేల్ పటేల్ ఓ ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి వెళ్లిపోతున్నప్పటికీ తాజా జాబితాలోనూ పటేల్ పేరు ఉంది. పటేల్ పేరును మొదటిసారి 2017లో ఎఫ్‌బీఐ టాప్-10 జాబితాలో చేర్చింది. కౌంటీ పోలీస్ డిటెక్టివ్ కల్లి హోర్నింగ్ మాట్లాడుతూ 24ఏళ్ల పటేల్ వయసులో చిన్నవాడైనా 21ఏళ్ల తన భార్య పలక్‌ను చాలా క్రూరంగా హత్య చేశాడని తెలిపారు. డంకిన్ డోనట్స్ స్టోర్‌లో పటేల్, పలక్ నైట్‌షిఫ్టులో పనిచేసేవారని తెలిపారు. 2015, ఏప్రిల్ 12 రాత్రి స్టోర్‌లోనే కిచెన్‌లో పలక్‌ను దారుణంగా కొట్టి, పొడిచి హత్యచేసిన తరువాత ఏమీ జరగనట్టు స్టోర్‌నుంచి బయటకు వెళ్లిపోయాడు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తే అతని బాడీలాంగ్వేజ్, ముఖ కవళికలు చాలా సాధారణంగా ఉన్నాయని ఎఫ్‌బీఐ తెలిపింది. భార్యను హత్య చేసిన అనంతరం సమీపంలోనే ఉన్న తమ అపార్టుమెంటుకు నడుచుకుని వెళ్లాడని, కొన్ని ముఖ్యమైన వస్తువులను తీసుకుని క్యాబ్‌లో న్యూయార్క్ ఎయిర్‌పోర్టు సమీపంలోని ఓ హోటల్‌కు వెళ్లి రూమ్ తీసుకుని ఆ రాత్రి పడుకుని ఉదయం వెళ్లిపోయాడని తమ దర్యాప్తులో తేలిందని డిటెక్టివ్ తెలిపారు. అప్పటినుంచి ఎఫ్‌బీఐ అధికారులు పటేల్ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

# బంద్ ముగిసింది..



బంద్‌తో నిర్మానుష్యంగా మారిన మహాత్మాగాంధీ బస్ డిపో

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. ఇమ్లిబన్ బస్టాండ్ వద్ద ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామ రెడ్డితో పాటు టీడీపీ నేతలు ఎల్. రమణ, రావుల చంద్రశేఖర్‌రెడ్డిలను అదుపులోకి తీసుకున్న పోలీసులు బేగంబజార్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. బంద్‌కు మద్దతుగా రాష్ట్రంలోని 97 బస్‌డిపోల ముందు ఆర్టీసీ కార్మికులు ధర్నాలు నిర్వహించారు. బస్సుల రాకపోకలకు ఇబ్బందులను కలిగించిన వారిని పోలీసులు ఎక్కడికక్కడే అడ్డుకుని పోలీసుస్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు, ప్రజాసంఘాల కార్యకర్తలు, రాజకీయ పార్టీల కార్యకర్తలు పోలీసులతో గొడవకు దిగారు. బంద్‌కు మద్దతుగా ఆబిడ్స్ జీపీవో ప్రాంతంలో మధ్యాహ్నం గం.12 ల ప్రాంతంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్‌తో పాటు ఎంఎల్‌సీ ఎన్. రాంచందర్‌రావు, మాజీ ఎంఎల్‌సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్ తదితరులతో వందలాది మంది కార్యకర్తలను అరెస్టు చేసి సమీపంలోనే ఉన్న అబిడ్స్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. కోఠి చౌరస్తాలో వీహెచ్‌పీ కార్యకర్తలు ధర్నాకు దిగారు. దీంతో అక్కడా కొంత సేపు ట్రాఫిక్‌కు ఆటంకం కలిగింది.

### తెగిన సీపీఐ ఎంఎల్ నేత వేలు



బంద్‌కు మద్దతుగా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు, ధర్నాలలో పాల్గొంటున్న వారిని పోలీసులు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడే అడ్డుకుని అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ ఎంఎల్ నేత పోటు రంగారావును కూడా పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారందరినీ పోలీసుస్టేషన్‌లకు తరలించేందుకు వ్యాన్‌లలో ఎక్కించారు. ఈ సందర్భంగా పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడంతో రంగారావు బొటన వేలు తెగిపోయింది. ఈ ఘటనతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రంగారావు సీఎం కేసీఆర్ నన్ను చంపమని చెప్పారా అంటూ పోలీసులతో గొడవకు దిగడంతో అక్కడ కొంత సేపు గందరగోళం ఏర్పడింది. తీవ్ర రక్తస్రావం అవుతుండటంతో పోలీసులు ప్రత్యేక వాహనంలో రంగారావును గాంధీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

### తాత్కాలిక డ్రైవర్‌పై దాడి

బంద్ సందర్భంగా నగరంలోని బండ్లగూడ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు, రాజకీయ పార్టీల నేతలు ఉదయం ధర్నాకు దిగారు. ఒక పక్క ధర్నా జరుగుతుండగానే తాత్కాలిక డ్రైవర్ డిపో నుంచి బస్సును బయటకు తీసుకు వచ్చాడు. దీంతో ఆగ్రహించిన కార్మికులు నిరసనలు తెలియజేస్తుంటే, బస్ నడిపిస్తావా అంటూ కొంత మంది కార్మికులు బస్సులో నుంచి డ్రైవర్‌ను కిందకు దించి చితకబాదారు. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు తాత్కాలిక డ్రైవర్‌ను కాపాడి అక్కడి నుంచి పంపించి వేశారు.

### జిల్లాల్లో ఇలా....

కరీంనగర్, నిజామాబాద్‌లో బంద్ సందర్భంగా కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కరీంనగర్‌లో సీపీఎం కార్యకర్తలు బస్సులపైకెక్కి నిరసన తెలిపారు. దీంతో గంట పాటు పోలీసులు, కార్యకర్తల మధ్య పెనుగులాట చోటు చేసుకుంది. నిజామాబాద్‌లో కూడా బంద్ ఉద్రిక్తతకు దారి తీసింది. నిజామాబాద్ సుజిత్ ఫ్యాక్టరీవద్ద బస్సు అద్దాలను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. జిల్లాలోని అచన్‌పల్లి, ముబారక్‌నగర్‌లలో కూడా బస్సులపై రాళ్ళు రువ్వారు. పలు చోట్ల పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట కూడా చోటు చేసుకుంది. నిజామాబాద్ జిల్లాలో నిజామాబాద్, ఆర్మూర్ డిపోల నుంచి ఉదయం పూట బస్సులు బయటకు రావడంతో ఆందోళనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో మిగతా బస్‌డిపోల నుంచి బస్సులు బయటకు రాలేదు. బంద్‌లో భాగంగా సిద్దిపేటలో ఐకాస ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్‌డిపో వద్ద ఆందోళనకారులు బైఠాయించారు. దీంతో వారందరినీ పోలీసులు అదుపులోకి తీసుకుంటున్న నేపథ్యంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. జరిగిన తోపులాటలో ఓ మహిళా కార్మికురాలు స్పృహ తప్పి పడిపోయారు. తోటి కార్మికులు ఆమెకు సపర్యలు చేసి ఆస్పత్రికి తరలించారు. తర్వాత డిపో నుంచి బస్సును బయటకు తీసుకువచ్చిన తాత్కాలిక డ్రైవర్‌పై సమ్మెలో ఉన్న ఆర్టీసీ కార్మికులు దాడికి యత్నించారు. వెంటనే పోలీసులు ఆ డ్రైవర్‌ను బస్సుతో సహా డిపోలోకి పంపించారు.

### ఓయూలో విద్యార్థుల ర్యాలీ

రాష్ట్ర బంద్‌కు మద్దతుగా ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. బైక్‌ర్యాలీతో తార్నాక తదితర ప్రాంతాలలో విద్యార్థులు తిరుగుతూ వ్యాపార సంస్థలను మూసి వేయించారు. మధ్యాహ్నం మరోసారి విద్యార్థులు ఆర్ట్స్ కళాశాలనుంచి విద్యానగర్‌వైపు వచ్చేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు.

### సచివాలయం ముందు నిరసన

బంద్‌కు మద్దతుగా సచివాలయ ఉద్యోగుల సంఘం ధర్నా నిర్వహించింది. బీఆర్‌కేఆర్ భవనం ముందు ఉద్యోగులు సాయంత్రం ఆందోళన నిర్వహించారు. ఆర్టీసీ కార్మికుల ఉద్యమానికి సంపూర్ణ మద్దతిస్తామని ప్రకటించారు. ఇదే సమయంలో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

### నల్ల బ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగులు

ఆర్టీసీ సమ్మెకు మద్దతు ప్రకటించి బంద్‌కు అనుకూలమని ప్రకటించిన రెవెన్యూ ఉద్యోగులంతా శనివారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో కార్యాలయాల ముందు నిరసన ప్రదర్శనలు చేశారు. కలెక్టరేట్ల ముందు ఆందోళన నిర్వహించారు.

### తిరిగిన బస్సులు 516

బంద్ ప్రభావం రాష్ట్రంపై స్పష్టంగా పడింది. నిత్యం వేల సంఖ్యలో తిరిగిన ఆర్టీసీ బస్సులు శనివారం బంద్ కారణంగా కేవలం 516 మాత్రమే తిరిగాయి. వీటిలో 513 ఆర్టీసీ బస్సులు కాగా ఆర్టీసీ అద్దె బస్సులు మూడు. ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా ప్రైవేట్ బస్సులు, క్యాబ్‌ల యజమానులు మద్దతు ప్రకటించడంతో ఆర్టీసీ అద్దె బస్సులు రోడ్డెక్కలేదు.

### భాగస్థులైన ఉపాధ్యాయ సంఘాలు

బంద్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులను అరెస్టు చేయడాన్ని సంఘాలు ఖండించాయి. కార్మికుల సమ్మెకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారని అందులో భాగంగా ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ, జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ నాయకులు తెలిపారు. అయితే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బంద్‌లో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులతో పాటు, ఉపాధ్యాయులను అక్రమంగా అరెస్టు చేశాయని వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టీసీ కార్మిక సంఘాలతో వెంటనే చర్చలు జరపాలని ఉపాధ్యాయ సంఘాలు శనివారం ఒక ప్రకటనలో సీఎంకు విజ్ఞప్తి చేశారు.

### అరెస్టులు అక్రమం - విద్యార్థి సంఘాలు

ఎస్ఎఫ్ఐ, ఐఏఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం నేతలు బంద్‌లో పాల్గొన్నారు. ఆర్‌టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వారికి మద్దతు తెలిపిన విద్యార్థి సంఘంనేతలను ఆరెస్టు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ, బీసీ విద్యార్థిసంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపాయి.

# ఇబ్బందేం లేదు

(మొదటిపేజీ తరువాయి)

విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినందున బంద్ ప్రభావం తీవ్రత ప్రజలపై లేదని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజా రవాణా సౌకర్యాలను అందుబాటులో ఉంచేందుకు జిల్లా కలెక్టర్ల ఆధ్వ ర్యంలో తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. రాత్రి 8 గంటలకు ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ మరోసారి ఈ అంశంపై సమీక్షించారు. సోమవారం నుంచి పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసం స్థలు పునఃప్రారంభమవుతున్నందున రవాణా వ్యవస్థ ఎక్కడా స్తంభించకుండా చూడాలని ఆదేశించారు. అదే సమయంలో కూరగాయలతో పాటు నిత్యావసర సరుకుల రవాణా స్తంభిం చకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఇప్పటికే సమ్మె ప్రభావంతో కొన్ని రాష్ట్రాల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినందున క్రమేపీ సమస్య తీవ్రతను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని సీఎం కేసీఆర్ ఈ సందర్భంగా అధికారులతో స్పష్టంచేశారు. ప్రైవేట్ డ్రైవర్లను తాత్కాలిక ప్రాతిపదికన నియమించి ఆర్టీసీ సేవలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికే సమ్మె తీవ్రత ప్రజలపై నామమా త్రంగా ఉందని, ఇంకా తగ్గించి సాధారణ పరిస్థితులను ఆవిష్కరించేందుకు రవాణాశాఖ యంత్రాంగం పూర్తిగా ఈ అంశం పైనే దృష్టి కేంద్రీకరించాలన్నారు. అదే సమయంలో సమ్మె అంశం హైకోర్టు పరిధిలో ఉన్నందున ప్రభుత్వం తరపున తీసుకుం టున్న చర్యలను, ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన సేవలను, పునరుద్ధరించిన బస్సు సర్వీసుల గురించి ఎప్పటికప్పుడు తాజా నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులకు సీఎం కేసీఆర్ సూచించారు

# సమ్మెపై పూర్తి నివేదికతో రండి

**• సీఎస్, ఆర్టీసీ ఎండీకి బీసీ కమిషన్ నోటీసులు**

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** తెలంగాణాలో ఆర్టీసీ కార్మికుల సమ్మెపై పూర్తి నివేదికతో ఈనెల 25న హాజరు కావాలని జాతీయ బీసీ కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ తెలంగాణా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఆర్టీసీ ఎండీకి నోటీసులు జారీ చేసింది. రాష్ట్రంలో వేల కుటుంబాలను రోడ్డున పడేసిన ప్రభుత్వ నిర్ణయంపై, కార్మికులు చేస్తున్న సమ్మెపై జోక్యం చేసుకోవాలని ఆర్టీసీ జేఏసీ జాతీయ బీసీ కమిషన్‌ను కోరింది. ఆర్టీసీలో 20 వేల మంది కంటే ఎక్కువ బీసీలు ఉంటారని, వారిని డిస్మిస్ చేశామని రాష్ట్ర ప్రభుత్వం అంటోందని జేఏసీ ఫిర్యాదులో పేర్కొంది. వారి విజ్ఞప్తిపై జాతీయ బీసీ కమిషన్ సభ్యులు టి. ఆచారి స్పందించారు.

# మేల్కోపోతే రాష్ట్రాన్ని అమ్మేస్తారు

**• కాంగ్రెస్ నేతలు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణ సమాజం మేల్కోవలసిన సమయం ఆసన్నమైందని, లేనిపక్షంలో రాష్ట్రాన్ని పాలకులు అమ్మేస్తారని సీఎల్‌పీ నాయకుడు మల్లు భట్టి విక్రమార్క హెచ్చరించారు. సమ్మెకు వెళ్లిన ఆర్టీసీ కార్మికులను సెల్ఫ్ డిస్మిస్ అయ్యారంటూ ఒక ప్రకటనతో బెదరగొట్టిన ప్రభుత్వం ప్రజలు మేల్కోకపోతే ప్రభుత్వ ఆస్తులను విక్రయించడానికి వెనుకాడదని ఆందోళన వ్యక్తం చేశారు. తెరాస ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యమే లేకుండా చేశారని, న్యాయస్థానాలు లేకపోతే తెలంగాణలో పరిస్థితులు మరోలా ఉండేవన్నారు. ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా చేపట్టిన రాష్ట్ర బంద్‌లో భాగంగా శనివారం, చార్మినార్‌నుంచి సీబీఎస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, అంజన్ కుమార్ యాదవ్, విక్రమ్‌గౌడ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని హైకోర్టు చెప్పినా సీఎం కేసీఆర్ లెక్కచేయకపోవడం నియంతృత్వానికి నిదర్శనమని వీహెచ్ విమర్శించారు.

# బంద్ సంపూర్ణం

**• ప్రజలు పూర్తి మద్దతిచ్చారు • చర్చలకు మంత్రులు-యాజమాన్యంతో కమిటీ వేయాలి • నేడు రాష్ట్రంలోని అన్ని కూడళ్లలో ప్రదర్శనలు: ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామరెడ్డి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కార్మిక, అఖిలపక్ష జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపి రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేశారని ఆర్టీసీ కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. బంద్ విజయవంతానికి కృషి చేసిన ఉపాధ్యాయ, కార్మిక, రాజకీయ పార్టీలతోపాటు ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ వచ్చాక ఆరేళ్లలో సంపూర్ణంగా రాష్ట్ర బంద్ జరగటం ఇదే ప్రథమమన్నారు. కోర్టు ఆదేశాలు అందలేదన్న సాకుతో చర్చలను జాప్యం చేయటం సరికాదని, వెంటనే చర్చలకు పిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా చర్చల కోసం యాజమాన్యం లేదా మంత్రులతో కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. బంద్ విజయవంతంపై ఆర్టీసీ కార్మిక జేఏసీ నేతలతో కలిసి శనివారం ఆయన టీఎంయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆర్టీసీని కాపాడాలని బంద్ ద్వారా మొత్తం దేశానికి వివరించామన్నారు. తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మద్దతు లభించిందన్నారు. ఢిల్లీతోపాటు అస్ట్రేలియా, అమెరికాల్లోనూ టీఎస్ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా ధర్నాలు జరిగాయన్నారు. హైకోర్టు తీర్పును కూడా ప్రభుత్వం పెడచెవిన పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ సమ్మె విషయంలో ప్రభుత్వం తప్పిదాలపై తప్పిదాలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఈ పోరాటం ఆర్టీసీ పరిరక్షణకే కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటమని అభివర్ణించారు. బంద్‌లో పాల్గొన్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత పోటు రంగారావు వేలును ఉద్దేశ్యపూర్వకంగానే పోలీసులు తెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలాచోట్ల ఆర్టీసీ కార్మికులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని అశ్వత్థామ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలోనూ ఇంత దారుణంగా వ్యవహరించలేదని వాపోయారు. యూనియన్లను కించపరిచే హక్కు సీఎం సీపీఆర్వోకు లేదని తేల్చి చెప్పారు.



### ఊహించని మద్దతు: రాజిరెడ్డి

కార్మిక జేఏసీ కో.కన్వీనర్ రాజిరెడ్డి మాట్లాడుతూ... ఊహించినదానికంటే ఎక్కువ స్థాయిలో బంద్ విజయవంతమైందన్నారు. జేఏసీ నేత వీఎస్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం అఫిడవిట్లలో అబద్ధాలు చెబుతూ అటు కోర్టును, ఇటు ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. నివేదికలను ప్రజల ముందు పెట్టి నిరూపించాలని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆర్టీసీ నష్టాలను రూ.4700గా కోర్టుకు విన్నవించారని, ప్రభుత్వ నివేదికల్లో మాత్రం నష్టాన్ని రూ.3400 కోట్లుగా చూపారని తప్పుబట్టారు. సమ్మె జరుగుతున్నా 73 శాతం బస్సులు నడుస్తుంటే ఆర్టీసీ అకౌంట్లో ఆదాయం ఎందుకు పెరగటం లేదు..? అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణలోనూ ఆర్టీసీపై ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. సమ్మె చేస్తున్న మహిళా కండక్టర్లు, సూపర్‌వైజర్లతో అనుచితంగా ప్రవర్తించటాన్ని జేఏసీ నేత సుధ ఖండించారు.

### నేడు అఖిలపక్షంతో కార్మిక జేఏసీ సమావేశం

ఆదివారం ఉదయం 11గంటలకు అఖిలపక్ష జేఏసీతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. ఆదివారం అన్ని డిపోల ఎదుట ప్రదర్శనలు నిర్వహించి ప్రజలను కలువాలని కార్మికులకు పిలుపునిచ్చారు. గ్రామ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని, హైకోర్టు ఆదేశాలను పాటించి కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరపాలని తదితర 5 డిమాండ్లను ప్రజలకు వివరించాలన్నారు. ఎంఐఎం పార్టీ నేతలను కూడా కలిసి మద్దతును కోరుతామని ఆయన చెప్పారు. చర్చలకు రావాలని తమకు అధికారుల నుంచి కాని, యాజమాన్యం నుంచి కాని ఎలాంటి సమాచారం అందలేదన్నారు. గవర్నర్ తమిళిసైని మరోసారి కలుస్తామని ప్రకటించారు. ఎన్నిరోజులైనా ఉద్యమాన్ని ప్రజాస్వామ్యయుతంగానే నిర్వహిస్తామన్నారు. తమ పోరాటం, సమ్మె వెనక ఏ రాజకీయ శక్తి లేదని అశ్వత్థామ స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో నిరంకుశత్వం

**• కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**కోదాడ, ప్రభ న్యూస్ :** దేశంలో ఎక్క డా లేని విధంగా రాష్ట్రంలో విచిత్రమైన పాలన నడుస్తోందని, ఇచ్చిన హామీలు అమలు చేయమని సమ్మె నోటీసు ఇచ్చిన 50వేల మంది ఆర్టీసీ కార్మికులను డిస్మిస్ చేశామనడం కేసీఆర్ నిరంకుశత్వ పాల నకు నిదర్శనమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్ రెడ్డి విమర్శించారు. శనివారం హుజూర్‌నగర్‌లో ప్రచారానికి వెళ్తూ కోదాడలో బీజేపీ సీనియర్ నాయకులు యాదా రమేష్ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణకోసం పోరాడిన రాష్ట్ర ఉద్యోగులను, ప్రజా ప్రతినిధులను, ఉద్యమకారులను నేడు కేసీఆర్ అణిచివేసే ప్రయత్నం చేస్తు న్నారని అన్నారు. కేసీఆర్, ఒవైసీ కుటుంబాల నుండి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసం ఏర్పడిందని, ప్రస్తుతం రాష్ట్రం లో టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నయంగా బీజేపీ ఎదుగుతోందని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ కుంగికృశించి పోయిందని, ఆ పార్టీ దుస్థితిని చూడలేక మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారన్నారు. తెలంగాణ ప్రజల ఆశ యాలకు అనుగుణంగా బీజేపీ మాత్రమే పనిచేస్తుందని, హుజూర్‌నగర్‌లో ఉప ఎన్నికలో బీజేపీ గెలుపునకే అనుకూల పవనాలు ఉన్నాయని, ప్రజలంతా ప్రధాన మంత్రి మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం 25వేల మంది హోంగార్డులను ఒకేసారి తొలగించింది కదా అని ప్రభన్యూస్ అడిగిన ప్రశ్నకు అక్కడ హోంగార్డుల తొలగింపునకు, తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల తొలగింపునకు తేడా ఉందని అన్నారు. ఆర్టీసీ కార్మికుల తమ రక్తాన్ని చెమటగా మార్చి రోజంతా పని చేస్తున్నారని యూపీలో హోంగార్డులు అదనపు సేవ కోసం మాత్రమే ఆనాటి ముఖ్యమంత్రి మూలాయన్‌సింగ్ యాదవ్ అవసరం లేకున్నా వారిని తాత్కాలికంగా నియమించారని, వారు రోజుకు రెండు గంటలు మాత్రమే పని చేస్తున్నారని, అందుకే తొలగించారని వివరణ ఇచ్చారు.

ఢిల్లీ తెలంగాణ భవన్ వద్ద

# ఏఐటీయూసీ ధర్నా



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** తెలంగాణాలో జరుగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు పలికింది. కార్మికుల న్యాయపరమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమ ర్‌జీత్ కౌర్ డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, ఇతర పార్టీ నాయకులతో కలిసి ఏఐటీయూసీ నాయకులు ఢిల్లీ తెలంగాణా భవన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం తెలంగాణ భవన్ అదనపు రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన డిమాం డ్లపై ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించాలని కోరారు. పరిస్థితులు ఇలాగే ఉంటే ఆం దోళనను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

# ప్రతి అంశాన్ని కేంద్రానికి చెబుతున్నాం

**• బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్**



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కోర్టులు మొట్టికాయలు వేసినా తెలంగాణ ప్రభుత్వానికి చలనం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్ర బంద్ సందర్భంగా బీజేపీ నేతలు లక్ష్మణ్, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, ఎన్వీ సుభాష్, తదితరులను అబిడ్స్‌లో అరెస్టు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న ప్రతి అప్రజాస్వామిక విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నట్లు వివరించారు. గవర్నర్ సీరియస్ అయినా కేసీఆర్‌కు చీమ కుట్టినట్లు లేదన్నారు. ఇది నియంతృత్వానికి, ప్రజాస్వామ్యానికి జరుగుతున్న పోరు అని అన్నారు. హరీష్‌రావు, ఈటల రాజేందర్‌కు పదవులు శాశ్వతం కాదనే విషయం తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వారిని అప్పుడు ద్రోహులుగా చిత్రీకరించామని, ఇప్పుడు ఆర్టీసీ సమ్మెకు మద్దతు తెలుపని వారని ఏమనాలో టీఆర్ఎస్ నేతలే చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పుడు మంత్రులు హరీష్‌రావు, ఈటల రాజేందర్ కూడా ద్రోహులేనని ఆయన ఆరోపించారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రజలు ముఖ్యమా..? పదవులు ముఖ్యమా..? తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ సమ్మె కేవలం ఆర్టీసీ కార్మికులదే కాదని, సకల జనుల సమ్మె అంటూ ఆయన తెలిపారు.

# కార్మిక సమస్యలు తెలియవా?

**ఎన్.ఇంద్రసేనారెడ్డి**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ప్రభుత్వాన్ని నడిపే సోయి సీఎం కేసీఆర్‌కు లేదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లు ఇంద్రసేనారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బస్సులు నడవకపోవడంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

గతంలో కార్మిక మంత్రిగా పని చేసిన సీఎం కేసీఆర్‌కు కార్మికులు సమస్యలు తెలియవా..? అంటూ ఆయన ప్రశ్నించారు. ఆర్టీసీ భవిష్యత్, కార్మికుల భవిష్యత్ ప్రయోజనాల కన్నా కేసీఆర్‌కు తన ఇగోనే ముఖ్యమన్నారు. ఆర్టీసీని రక్షించుకోవాలన్నదే ప్రజలు, బీజేపీ ఉద్దేశ్యమన్నారు. ఆర్టీసీని ప్రయివేట్ పరం చేసి తన కుటుంబానికి లబ్ది చేయాలని కేసీఆర్ ఆలోచన ఉందన్నారు.

# సమ్మె వద్దు!

**• క్యాబ్ డ్రైవర్ల జేఏసీ నేతలకు గవర్నర్ సలహా**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సమ్మె విరమించాలని, ఆర్టీసీ సమ్మెను దృష్టిలో పెట్టుకుని సహకరించాలని గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ క్యాబ్ డ్రైవర్ల సంఘాలకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర టాక్సీ, క్యాబ్ డ్రైవర్ల జేఏసీతో శనివారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ చర్చలు జరిపారు. తెలంగాణ క్యాబ్ డ్రైవర్లు నేటినుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. అదేవిధంగా ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా శనివారంనాటి రాష్ట్ర బంద్‌లో కూడా డ్రైవర్ల జేఏసీ పాల్గొంది. ఈ మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా 50వేలకుపైగా టాక్సీ, క్యాబ్ డ్రైవర్లు సమ్మెలో పాల్గొన్నారు. శనివారంనాటి తొలిరోజు సమ్మె విజయవంతం కావడం, ఆర్టీసీ బంద్‌కు మద్దతు నేపథ్యంలో గవర్నర్ స్పందదించారు. క్యాబ్ డ్రైవర్లు ఆందోళణ విరమించాలని ఆమె సూచించారు., వారి సమస్యలను ప్రభుత్వానికి వివరించేలా చర్యలు తీసుకుంటానని ఆమె హామీనిచ్చారు. ఈ సందర్భంగా క్యాబ్ డ్రైవర్ల నేతలు ఇచ్చిన వినతిపత్రాన్ని ప్రభుత్వానికి పంపించి తగు చర్యలు తీసుకుంటానని హామీ నిచ్చారు.





తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెకు మద్దతుగా విజయవాడలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఏపీ ఎన్జీవో ఉద్యోగులు

# పసిడి పరుగు ఎంత వరకు?

• దీపావళికి రూ. 40వేలు అనుమానమే! • సామాన్యుడికి అందుబాటులో లేని ధరలు • అమ్మకాలపై ప్రభావం

**బంగారం వ్యాపారులు ప్రతి ఏడాది దీపావళికి పెద్ద ఎత్తున అమ్మకాలు జరుపుకుంటారు. దీపావళికి రెండు రోజుల ముందు వచ్చే ధనత్రయోదశి రోజు బంగారం కొంటే శుభసూచకమనే సెంటిమెంట్ తోడు కావడంతో వ్యాపారులు తమ వ్యాపారాన్ని రెట్టింపు చేసుకుంటారు. ఈ ఏడాది ధనత్రయోదశి అక్టోబర్ 25న, దీపావళి ఈ నెల 27న జరుపుకోనున్నారు. ఈ ఏడాది బంగారం ధరలు అమాంతం పెరిగిపోవడంతో బంగారం అమ్మకాలు 50 శాతం తగ్గే అవకాశాలున్నాయని అఖిల భారత బులియన్ జువెలరీ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి సరేంద్ర మెహతా చెప్పారు. ప్రతి ఏడాది బంగారం ధనత్రయోదశి రోజు 40 టన్నుల వరకు అమ్ముడవుతోందని.. ఈ ఏడాది ధరలు పెరగడంతో అమ్మకాలు గత ఏడాదితో పోల్చుకుంటే సగానికి సగం తగ్గే అవకాశాలున్నాయని మెహతా చెప్పారు. సాధారణంగా పండుగ సీజన్‌లో బంగారానికి డిమాండ్ ఉంటుందని.. అంతర్జాతీయ మార్కెట్లో ద్రవ్య సంక్షోభం కారణం వల్ల బంగారం ధరలు పెరగాయి.. దీంతో అమ్మకాలు తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని నగల వ్యాపారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం ఢిల్లీ బులియన్ మార్కెట్లో పది గ్రాముల బంగారం 24 కెరెట్ల బంగారం రూ.38,500 పలికింది.**



**న్యూఢిల్లీ:** బంగారానికి గత రెండు నెలల నుంచి డిమాండ్ కాస్తా తగ్గింది. దీనికి ప్రధాన కారణం.. ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకపోవడమేనని ఈ రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వచ్చే దీపావళి దంతేరస్‌కు బంగారం అమ్మకాలు పుంజుకుంటాయని భావిస్తున్నారు. ధరలు అందుబాటులో లేకపోవడంతో గత కొన్ని నెలల నుంచి పసిడి అమ్మకాలు బాగా తగ్గుముఖం పట్టాయి. పండుగ సీజన్‌తో పాటు దేశ వ్యాప్తంగా రాబోయే పెళ్లిళ్ల సీజన్ మొదలుకాబోతున్నా పసిడి అమ్మకాలు మాత్రం ఊపందుకోవడం లేదు. ధరలు పెరగడానికి ప్రధాన కారణం సురక్షితమైన పెట్టుబడులకు బంగారమే శ్రీరామ రక్ష అని పెట్టుబడులన్నీ బంగారంపై మరలుతున్నాయి.

### 2018 నాటి ధర

### 2019 నాటి ధరల్లో వ్యత్యాసం

బంగారం ధరలు 2018 పండుగ సీజన్‌లో పది గ్రాములు రూ.32వేల నుంచి రూ.33వేలమధ్య పలికినట్లు బులియన్ మార్కెట్ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గత ఏడాది అక్టోబర్ 22న పది గ్రాముల బంగారం రూ.32,220 కోట్‌గా కాగా.. గత ఏడాది ఇదే దంతేరస్ రోజున ఇదే స్థాయిలో కొనసాగింది.

### 2019 నాటి ధరలు

ఈ ఏడాదిలో బంగారం ధరలు గతంలో ఎన్నడూలేని విధం గా ఆకాశమే హద్దుగా దూసుకుపోయాయి. తాజాగా బులియన్ మార్కెట్ గణాంకాల ప్రకారం పది గ్రాములు సుమారు 40వేల వరకు కోట్ కాగా.. అక్టోబర్ 11న ఢిల్లీలో పది గ్రాములు రూ. 39,160 వద్ద కోట్ అయ్యింది. ఈ ఏడాది దంతేరస్ అక్టోబర్ 25న దేశ వ్యాప్తంగా జరుపుకోనున్నారు.

### ధరలు పెరగడానికి కారణం...

వివిధ రకాల కార ణాలు చెబుతు న్నారు. వాటిలో ఒకటి అమెరికా - చైనాల మధ్య టారిఫ్ వార్ ఒకటి కాగా, చమురు మార్కెట్ ఒడిదుడకులకు గురవుతోం దన్న వాదన మరోటి. దీంతో పాటు ప్రపంచవ్యాప్తంగా 2008 నాటి ఆర్థిక మాంద్యం మళ్లీ ఈ ఏడాది చవిచూస్తామన్న వార్తలు రావడం.. ఇవన్నీ కలిసి పెట్టుబడులకు బంగారామే శ్రీరామరక్ష అనే స్థాయికి వచ్చి పసిడి ధరలు అమాంతం పెరిగిపోతాయి. సంక్షోభం తలెత్తినప్పుడు మాత్రం బంగారం ధరలు చుక్కలనంటుతుంటాయి. ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే సమీప భవిష్యత్తులో ధరలు తగ్గే అవకాశాలు కనిపించడం లేదు. కమాడిటీ మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం తదుపరి వచ్చే బుల్‌రన్‌లో స్పాట్‌గోల్డ్ అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ ప్రస్తుతం కోట్ అవుతున్న 1,528.10 డాలర్ల నుంచి 1,950 డాలర్లు ఔన్స్‌పలుకుతుందని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా పసిడి ధరలను బట్టి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందో ఇట్టే చెప్పవచ్చు. గత రెండు సంవత్స రాల నుంచి ప్రపంచవ్యాప్తంగా ఎక్కడో ఒక మారుమూల ప్రాంతంలో ఏదో ఒక సంక్షోభం కనిపిస్తోంది. కాబట్టి సమీప భవిష్యత్తులో కూడా బంగారం ధరలు తగ్గే అవకాశాలుమాత్రం లేవు.

### అమెరికా - చైనాల వాణిజ్యయుద్ధం ప్రభావం

పసిడి ధరలు అమాంతం పెరిగిపోవడానికి ప్రధాన కారణం.. అమెరికా - చైనాల మధ్య వాణిజ్యం ముదరడమే. గత ఏడాది నుంచి చూస్తే ధరలు క్రమంగా పెరుగుతూ వసున్నాయి. ఔన్స్ ధర ప్రస్తుతం సుమారు 1,500 డాలర్ల వద్ద పలుకుతుండగా.. క్రితం ఏడాది ఇదే సమయంలో 1,222 డాలర్ల వద్ద తచ్చాడింది. దీపావళికి ఇంకా కేవలం 11 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. దీపావళికి ముందు వచ్చే దంతేరస్‌పై నగల వ్యాపారులు ఎంతో ఆశలు పెట్టుకుంటారు. దంతేరస్ రోజు బంగారం కొనుగోలు చేస్తే శుభం కలుగుతుందన్న సెంటిమెం ట్‌తో భారతీయ మహిళలు ఎంతోకొంత బంగారం కొనుగోలు చేయడం రివాజు.



### బంగారం పెట్టుబడులే మేలు




వాస్తవానికి చూస్తే ఈ ఏడాది బంగారంపై పెట్టుబడులు పెట్టిన వారికి బాగా కలిసొచ్చింది. ఇతర పెట్టుబడులతో పోల్చితే చూస్తే బంగారంపైనే ఆదాయం ఎక్కువ వచ్చింది. ఉదాహరణకు మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ మార్కెట్లు, రియల్ ఎస్టేట్, ఫిక్స్‌డ్ డిపా జిట్లతో పోల్చుకుంటే పసిడిపై పెట్టుబడులు పెట్టిన వారే ఎక్కువ సంపాదించారని చెప్పవచ్చు.

### రూపాయి ప్రభావం



డలర్ మారకంతో రూపాయి సుమారు 72 మార్కుకు దిగివస్తోంది. గత 9 నెలల నుంచి చూస్తే ఇదే అత్యధి కం. ఇరు అగ్రరాజ్యాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం ప్రభావం కాస్తా గ్లోబల్ కరెన్సీలపై ప్రభావం చూపు తోంది. గతవారం అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చల్లో కాస్తా పురో గతి కనిపించ డంతో గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లు పరుగులు తీశాయి. దీని ప్రభావం ఫారెక్స్ మార్కెట్‌పై కూడా కనిపిం చింది. ఇప్పుడి ప్పుడు రూపాయి కాస్తా నిలదొక్కుకుం టోంది. రూపాయి బలహీపడితే దాని ప్రభావంతో బంగా రం ధరలు పెరుగు తాయి.ముడి చమురు ధరలు పెరిగినా.. విదేశీ పెట్టుబడులు తరలిపోయినా దాని ప్రభావం బంగా రంపై కనిపిస్తుంది.

### గ్లోబల్ జీడీపీ బలహీనం

ఈ ఏడాది ప్రపంచ ఆర్థికవ్య వస్థబలహీనంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఈ ఏడాది గ్లోబల్ జీడీపీ వృద్ధిరేటు 3.2 శాతంగాను 2020కి 3.5 శాతానికి ఎగ బాక వచ్చునని జులైలో వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్ రిపోర్టు (డబ్ల్యుఈవో)లో వెల్లడించింది. ప్రపంచం లోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు ఉదాహరణకు బ్రిటన్, జర్మనీ, రష్యా, సింగపూర్, బ్రెజి ల్‌లు ఇప్పటికే ఆర్థిక మాంద్యం కొట్టుమిట్టాడుతున్నాయి. మార్కెట్లో వస్తున్న ఊహాగానాలను పరిగణనలోకి తీసు కుంటే అమెరికాకూడా త్వర లోనే

### విదేశీ పెట్టుబడుల ప్రభావం

స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడులు తరలి పోతే దాని ప్రభావం బంగారంపై పడు తోంది. ఈ ఏడాది జులైలో విదేశీ ఇన్వెస్టర్లు మార్కెట్ల నుంచి అత్యధికంగా రూ.11వేల వరకు తరలించుకుపోయారు. ఈక్విటీ మార్కెట్ నుంచే ఆగస్టు మొదటివారంలో సుమారు రూ.9వేల కోట్ల వరకు తరలిపోయాయి. సంపన్నులతో పాటు విదేశీ ఇన్వెస్టర్లపై పెద్దమొత్తంలో పన్నులు రద్దడంతో విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను తరలించుకుపోవాల్సి వచ్చింది. పరిస్థితులను గమనించిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈ నిర్ణయాన్ని మార్చారు. అయినా విదేశీ ఇన్వెస్టర్లు మాత్రం తమ పెట్టుబడులను తరలించుకుపోతూనే ఉన్నారు. బంగారం ధరలు పెరుగుతూనే పోతున్నాయి.



మాంద్యం కోరల్లో చిక్కుకొనే అవకాశాలున్నాయని ఊహాగానాలు చెలరేగు తున్నాయి. కాబట్టి భవిష్యత్తులో బంగారానికి డిమాండ్ పెగరతుందని, ధరలు కూడా పెరుగుతాయని ఈ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు.

### దేశీయ పరిణామాలు

దేశీయ పరిణామాల విషయానికి వస్తే వృద్ధి రేటు క్రమంగా తిరోగమన బాట పడుతోంది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు ఆరేళ్ల కనిష్ఠానికి దిగివచ్చింది. భారత్‌లో కూడా ఆర్థికమాంద్యం చాయలు కనిపిస్తున్నాయి కాబట్టి పెట్టుబడులకు బంగారమే మెరుగనే స్థాయికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### అమెరికాలో పసిడి నిల్వలు

ఈ ఏడాది జులై చివరి నాటికి ఫోర్ట్ నాక్స్ (యునైటెడ్‌స్టేట్ బులియన్ డిపాజిటరీ) వద్ద 4,583 మెట్రిక్ టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి. వాటి విలువ 210.8 బిలియన్ డాలర్లు. అమెరికాలో ఉన్న మొత్తం నిల్వల్లో ఇవి 56.35 శాతం ఉన్నట్లు లెక్క. 2017లో అమెరికాలో మొత్తం బంగారం నిల్వలు 8,133.5 మెట్రలిక్ టన్నులుగా రికార్డులుచెబుతున్నాయి. మూడు దేశాల్లో ఉన్న బంగారం నిల్వలతో ఇది సమానం.

### భారత్ వద్ద..

ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి భారత్‌లో బంగారం నిల్వలు 618.16 టన్నులున్నాయి. రెండవ త్రైమాసికంలో కూడా 618.16 టన్నుల్లో ఎలాంటి మార్పులేదని ప్రాథమిక గణాంకాలను బట్టి తెలుస్తోంది. దేశంలో 2000నుంచి 2019 వరకు బంగారం నిల్వలు 462.29 టన్నులుండగా.. ఈ ఏడాది రెండవత్రైమాసికంలో రికార్డుస్థాయిలో 616.16 టన్నులకుచేరింది. అయితే 2001 రెండవ త్రైమాసికంలో 357.75 టన్నుల అత్యంత కనిష్ఠానికి దిగివచ్చింది.



## వాణిజ్య యుద్ధాలతో మూలధనం ఇబ్బందులు



**న్యూఢిల్లీ :** అగ్రదేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం, కొన్ని దేశాలు అవలంబిస్తున్న వ్యాపార రక్షణాత్మక ధోరణులతో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. దీంతో మూలధనం ఇబ్బందులతో పాటు వస్తు, సేవలపై ప్రభావం చూపుతోందన్నారు. మందగమనం నుంచి బయటపడ్డానికి, గ్లోబల్ వృద్ధిరేటును దృష్టిలో ఉంచుకొని పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలను సీతారామన్ కోరినట్లు ఆర్థికమంత్రిత్వశాఖ శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. మాంద్యం కాస్తా సంక్షోభంలోకి మారే వరకు వేచి చూడకుండా సత్వర చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు వార్షిక ప్లీనరీ సమావేశాల్లో పాల్గొనడానికి సీతారామన్ భారత్ బృం దంతో కలిసి వాషింగ్టన్‌కు వచ్చారు. ఈ సమావేశాలు శుక్రవా రం జరిగాయి. ప్రస్తుతం వాణిజ్య సమైక్యత, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, పెరిగిపోతున్న అప్పుల కారణంగా ప్రపంచ దేశాలన్ని కలిసి పటిష్ఠమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఆర్థికమంత్రులు, గవర్నర్లు జీ20 డిప్యూటీల సమావేశంలో పాల్గొన్నారు. డిజిటైజేషన్ కారణంగా పన్ను సమస్యలను పరిష్కరించడానికి ఏకాభిప్రాయం ద్వారానే సాధించవచ్చునని ఆమె అన్నారు. ఈ సమావేశాల్లోనే రష్యా డిప్యూటీ ప్రధాన మంత్రి, ఆర్థికమంత్రులతో ఆమె ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

## రిలయన్స్ బోర్డులోకి కేవీ చౌదరి

• అవినీతి నిరోధక శాఖ మాజీ చీఫ్



**న్యూఢిల్లీ :** మాజీ అవినీతి నిరోధక శాఖ చీఫ్‌తో పాటు మోడీ ప్రభుత్వంలో పన్ను శాఖచీఫ్‌గా పనిచేసిన కెవి చౌదరి రిలయన్స్ ఇండస్ట్రీస్ బోర్డులో ఇండిపెండెంట్ డైరె క్టర్‌గా చేరారు. 1978 బ్యాచ్‌కు చెందిన ఇండి యన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ ఎస్) అధికారి ఆగస్టు 2014లో ప్రత్యక్షపన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటి) లో చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆదాయపు పన్ను శాఖలో విధానాలను సీబీడీటి రూపుదిద్దు తుంది. పదవి విరమణ చేసిన తర్వాత ఆయనను నల్లధనం వెలికి తీయడానికి రెవెన్యూశాఖకు సలహాదారుగా ప్రభు త్వం నియమించింది. అంతకు ముందు ఆయన సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ)గా జూన్ 2015లో బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం జరిగిన రిలయన్స్ బోర్డు సమావే శంలో నాన్ ఎగ్జిక్యూటివ్‌గా చౌదరిని అదనపు డైరెక్టర్‌గా నియమించినట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. ప్రస్తుతం చౌదరి ఏ కంపెనీలోనూ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వ హించడం లేదని రిల యన్స్ తెలిపింది. సీవీసీ కమిషనర్‌గా ఆయన జూన్ 2015 నుంచి జూన్ 2019 వరకు బాధ్యతలు నిర్వర్తించారని రిల యన్స్ పేర్కొంది. ఇంటర్నేషన్ అసోసియేషన్ ఆఫ్ యాంటీ కరప్షన్ ఏజెన్సీలకు ఆయన ఎగ్జిక్యూ టివ్ కమిటీగా ఎన్నిక య్యారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా సలహాబోర్డులో కూడా సభ్యుడని రిలయన్స్ తెలిపింది.

---

## ఫేస్‌బుక్ ఔట్

• ఆపిల్ నెంబర్ వన్ • గ్లోబల్ టాప్ 10 బ్రాండ్‌ల నుంచి వెనక్కి • ఇంటర్ బ్రాండ్ వెల్లడి



**శాన్‌ఫ్రాన్సిస్కో :** ప్రపంచంలోని అత్యంత విలువైన టాప్ 10 బ్రాండ్‌లలో ఫేస్‌బుక్ స్థానం నిలుపుకోలేకపోయింది. ప్రైవసీ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిందన్న ఆరోపణలపై ఏడాది నుంచి విచార ణను ఎదుర్కొంటోంది. గ్లోబల్ బ్రాండ్ కన్సెల్టెన్సీ సంస్థ ఇంటర్‌బ్రాండ్ వార్షిక అత్యుత్తమ టాప్ 100 బ్రాండ్‌లను ప్రకటించింది. ఫేస్‌బుక్ 14వ స్థానానికి పడిపోయింది. రెండేళ్ల క్రితం సోషల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం జాబితాలో ఎనిమిద స్థానం ఆక్రమించింది. అటు తర్వాత నుంచి బ్రాండ్‌కు మంచి ఆదరణ లభించి అటు నుంచి తగ్గిపోవడం కనిపించింది.



టాప్ 100 బ్రాండ్‌లలో ఆపిల్ నెంబర్ వన్ స్థానం సాధించగా.. గూగుల్, అమెజాన్, మైక్రోసాఫ్ట్ కోకాకోలాలు వరుసగా రెండు నుంచి ఐదు స్థానాలు ఆక్రమించాయి. శ్యాంసగ్ ఆరవ స్థానంలో నిలిచింది. టయోటా ఏడవ స్థానం, మెర్సిడెంజ్ బెంజ్ ఎనిమిది, మెక్‌డొనాల్డ్ తొమ్మిది, డిస్నీ పదవ స్థానాన్ని ఆక్రమించింది.

ఫేస్‌బుక్ ర్యాంకులో వెనుకబడిపోవడానికి గల కారణాల గురించి అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ దిగ్గజం సేల్స్ ఫోర్స్ సీఈవో మార్క్ బెనోఫ్ మాట్లాడుతూ.. ఫేస్‌బుక్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫాం 'కొత్త సిగరెట్' లాంటిదని.. చిన్న పిల్లలు దాని వ్యసనానికి గురవుతారని పోల్చారు. కంపెనీ దానికి బాధ్యత వహించాలన్నారు. అమెరికాకు చెందిన సెనెటర్లు కమలా హారీస్, ఎలిజబెత్ వారెన్‌లు కూడా ఫెస్‌బుక్‌తో తెగతెంపులు చేసుకోవాలని కోరారు. వ్యాపారంలో అనైతిక చర్యలు పాల్పడిందని అమెరికాలో సుమారు 40 మంది అటార్నీలు కూడా ఫేస్‌బుక్‌పై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. ప్రైవసీ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఫేస్‌బుక్ యుఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ (ఎఫ్‌టీసీ)లో 500 కోట్ల డాలర్లు చెల్లించి సెటిల్మింట్ చేసుకోవడానికి ఆమోదం తెలిపింది. ఇదిలా ఉండగా గత ఏడాది స్వతంత్ర పరిశోధనా సంస్థ పోనెమన్ ఇన్‌స్టిట్యూట్ ఫేస్‌బుక్‌పై యూజర్ల నమ్మకం 66 శాతం క్షీణించిందని పేర్కొంది. ఫేస్‌బుక్ యూజర్లలో కేవలం28 శాతం మంది మాత్రం ప్రైవసీకి కంపెనీ కట్టుబడి ఉందని భావిస్తుండగా.. ఏడాది క్రితం 79 శాతం మంది అనుకూలంగా ఓటు వేశారు. కాగా ఫేస్‌బుక్ మెగా డెటా ఉల్లంఘనలకు పాల్పడిన తర్వాత ప్రజల్లో ఆందోళన నెలకొందని చాలా మంది ఫేస్‌బుక్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారని పోనెమన్ ఒక ప్రకటనలో పేర్కొంది.

## కన్స్యూమర్ డ్యూరబుల్ అమ్మకాల్లో 9-12 శాతం వృద్ధి

### దీపావళి సీజన్‌పై ఆశలు పెంచుకున్న కంపెనీలు

• గత ఏడాది దీపావళి అమ్మకాలు అంతంత మాత్రమే



**న్యూఢిల్లీ :** వినియోగం తగ్గి మాంద్యం చాయలు కనిపిస్తున్నా, కన్సూమర్ ఎలక్ట్రానిక్స్ అమ్మకాలపై పెద్దగా ప్రభావం ఉండదని కన్సూమర్ ఎలక్ట్రానిక్స్ రంగానికి చెందిన సీఈవోలు చెబుతున్నారు. ఈ ఏడాది దీపావళికి రిటైల్ చెయిన్‌ల ద్వారా తమ బ్రాండ్‌ల అమ్మకాలు 9-12 శాతానికి పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. క్రితం ఏడాది దీపావళికి అమ్మ కాలు ఫ్లాట్‌గా ముగిశాయి. దేశంలోని అతి పెద్ద స్మార్ట్‌ఫోన్, కన్సూమర్ ఎలక్ట్రానిక్స్ రిటైల్ చెయిన్, రిలయన్స్ డిజిటల్ సీఈవో బ్రియాన్ బాడే మాట్లాడుతూ.. ఇప్పటి కిప్పుడే చెప్పలేం కానీ.. మొత్తానికి ఈ ఏడాది అమ్మకాలు మాత్రం గత ఏడాది కంటే మెరుగ్గా ఉంటాయని భావిస్తున్నామన్నారు.

స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ఈ ఏడాది మంచి వృద్ధిని సాధించాయని బాడే అన్నారు. ముఖ్యంగా ఐ-ఫోన్, వన్ ప్లస్‌తో పాటు ఇతర స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ప్రోత్సాహకరంగా ఉన్నా యని ఆయన వివరించారు.

ముంబైలోని అతి పెద్ద ఎలక్ట్రా నిక్స్ చెయిన్ కోహినూర్ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ విశాల్ మెవాని మాట్లాడుతూ.. ఈ ఏడాది దీపావళి అమ్మకాలు 10-11 శాతం వృద్ధినిసాధించవచ్చునని, గత ఏడాది దీపావళి అమ్మకాలు ఫ్లాట్‌గా జరిగాయన్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది 8-10 శాతం వరకు ఎక్కువ సరకు నిల్వ ఉంచామన్నారు.



### ఈ-కామర్స్ ప్రభావం ఉండదు..

గత ఏడాది మాదిరిగా ఈ - కామర్స్ కంపెనీలు ఈ ఏడాది కూడా పెద్దగా ప్రభావం చూపిం చవని, అన్నీ ఆఫ్‌లైన్‌అమ్మకాలపై అన్నీ బ్రాండ్‌లపై డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నామన్నారు. డిస్కౌంట్లే కాకుండా వినియోగదారుల సెంటిమెంట్ గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది మెరుగ్గా ఉందన్నారు.




### ఓనంతో పండుగ సీజన్ మొదలు..

పండుగ సీజన్ కేరళలో ఓనంతో మొదలై, తర్వాత నవరాత్రి దుర్గాపూజ దసరా, కార్వ చౌత, దంతే రస్, అటు తర్వాత దీపావళి పండుగ సీజన్‌తో ముగస్తుంది. ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఉత్పత్తి చేసే కంపెనీలు తమ వార్షిక అమ్మ కాల్లో 35-40 శాతం అమ్మకాలు ఈ పండుగ సీజన్‌లోనే అమ్మ కుంటాయి. కాబట్టి ఎలక్ట్రానిక్ కన్సూమర్ కంపెనీలు ఈ పండుగ సీజన్‌పై ప్రత్యేక దృష్టిసారించి అమ్మకాలు జరుపుకుంటాయి. టెలివిజన్ అమ్మకాల విషయానికి వస్తే ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఫ్లాట్‌గా ముగిశాయి. దీనికి వ్యతిరేకంగా హోం అప్లియెన్సెస్ అమ్మకాలు మాత్రం మెరుగ్గా ఉన్నా సింగిల్ డిజిట్ దాటడం లేదు.



ప్రీమియం, మిడ్ ప్రీమియం ప్రొడక్టుల అమ్మకాలు జోరందుకున్నాయని.. రోజు రోజుకు డిమాండ్ పెరుగుతోందని.. దీపావళి నాటికి అమ్మకాలు మరింత జోరందుకొని, అదే జోరు నవంబర్ వరకు కొనసాగుతుందని కన్సూ మర్ ఎలక్ట్రానిక్స్ రంగానికి చెందిన డీలర్లు కూడా ఆశిస్తున్నారు.

ఎయిర్ కండిషన్ల అమ్మకాలపై ఆర్థిక మాంద్యం ప్రభావం లేదని జాన్ సన్‌కు చెందిన హిటాచీ ఎయిర్ కండి షనింగ్ ఇం డియా సీఎండీ గురుమిత్ సింగ్ చెప్పారు. ఇటీవల



పండుగ సీజన్‌లో కూడా అమ్మకాలు తగ్గలే దని, ప్రీమియం ఇన్వర్టర్ ఎయిర్ కండిష నర్స్ అమ్మకాలు పెరిగాయని చెప్పారు. ఈ ఏడాది పం డుగ సీజన్ మొద లైనప్పటి నుంచి అమ్మకాలు జోరందుకో వడమే కానీ తగ్గిన దాఖ లాల్లేవని అన్నారు. వినియోగదా రులఅభిరుచుల్లో మార్పులుకనిపిస్తున్నా యని, ముఖ్యంగా కన్సూమర్ ఎల క్ట్రానిక్స్ విభా గంలో కస్టమర్లు ముఖ్యంగా టెక్నాలజీ, ఫీచర్లు, నాణ్యత, ప్రొడక్ట్ వారంటీలపై ఫోకస్ పెట్టి కొనుగోలు చేస్తున్నారని, డిస్కౌంట్లను పెద్దగా పట్టించుకోవడం లేదని సింగ్ అన్నారు.



## 22 నుంచి మశూచి టీకాలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఈనెల 22 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా గొర్రెలకు మసూచి వ్యాధి టీకాలను వేయనున్నట్లు పశు సంవర్ధకశాఖ తెలిపింది. రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలకు ప్రత్యక్ష జీవనోపాధి చూపుతున్న గొర్రెల పెంపకం, వాటి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించి శనివారం ఆ శాఖ డైరెక్టర్ లక్ష్మారెడ్డి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల్లో గొర్రెలకు బొబ్బ రోగం వచ్చే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నా మన్నారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలోనూ ఈ టీకాల కార్యక్ర మం కొనసాగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- మహిళలకు ద.మ.రైల్వే సంఘం పిలుపు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** దక్షిణ మధ్యరైల్వే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం మహిళల కోసం ఆరోగ్యం, పరిశుభ్రతలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షురాలు జయంతి మాల్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. రైల్వే స్టేషన్‌లో పనిచేసే వందమంది మహిళా కాంట్రాక్టు ఉద్యోగినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్త్రీ కుటుంబ జీవనంలో కీలకపాత్ర పోషిస్తుందని, నేటి కుటుంబం కోసం తమ శక్తి సామర్థ్యాలను త్యాగం చేస్తున్న ఈ పరిస్థితుల్లో తమ సొంత పనుల కోసం ఎంతమంది స్త్రీలు సమయం కేటాయించుకుంటున్నారనేది అనుమానమేనన్నారు.మహిళలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తప్పకుండా కొంత సమయం కేటాయించుకొని తగిన జాగ్రత్త వహించాలని ఆమె సలహా ఇచ్చారు. మహిళలందరూ సమతుల్యమైన, పుష్టికరమైన ఆహారం తీసుకోవడం ద్వారా అనేక రోగాలను దూరంగా ఉంచడం సాధ్యపడుతుందని పేర్కొన్నారు.

## నేర చరిత్ర ఉంటే ఉద్యోగానికి నో



**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** పోలీసు శాఖలో కానిస్టేబుల్ గా భర్తీ కావాలనుకునే అభ్యర్థి ఎలాంటి నేర చరిత్రలేని మచ్చలేని ఉన్నత స్థాయి ప్రవర్తన కలిగిన వ్యక్తి అయి ఉండాలి. ఒక సారి క్రిమినల్ కేసులో చిక్కు కున్న వ్యక్తి, అనంతరం నిర్దోషిగా బయటప డినప్పటికీ గౌరవనీయమైన వ్యక్తిగా పరిగ ణించలేమని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డు నిర్ణయాన్ని సమర్థించింది.పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థి గతంలో ఓ క్రిమినల్ కేసులో చిక్కి అనంతరం నిర్దోషిగా బయటపడినట్లు కనుగొన్న పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డు సదరు అభ్యర్థి ఎంపికను రద్దు చేసింది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని చల్లిగడ్డతండాకు చెందిన కర్ర కృష్ణకుమార్ స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అనంతరం పిటిషనర్‌పై నారాయణఖేడ్ పోలీసు ఠాణాలో (క్రైమ్ నంబర్ 140/2016) క్రిమినల్ కేసు నమోదైనట్లు పోలీసుల పరిశీలనలో తేలింది. దీంతో పిటిషనర్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చిన పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డు పిటిషనర్ ఎంపికను రద్దు చేసింది. అయితే అనంతరం పిటిషనర్‌ను నిర్దోషిగా పేర్కొంటూ నారాయణఖేడ్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ 12-10-2018నతీర్పును వెలువరించారు. దీంతో తనను శిక్షణకు పంపాలని అభ్యర్థిస్తూ 06-11-2018న పోలీసు రిక్రూట్ మెంట్ బోర్డుకు వినతిపత్రం సమర్పించాడు. దీంతో పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారు.

## మతోన్మాద శక్తులతో జాగ్రత్త



**హైదరాబాద్ (చార్మినార్), (ప్రభ న్యూస్) :** దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న శక్తులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జి కుంతియా సూచించారు. 29వ రాజీవ్ సద్భావన దినోత్సవాన్ని పురస్కరిం చుకుని రాజీవ్ స్మారక కమిటీ ఆధ్వర్యంలో శనివారం చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా రాజీవ్ స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సద్భావన అవార్డుకు ఎంపిక చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు గోపాలకృష్ణ దంపతులకు శాలువా కప్పి మోమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల్లో ఐకమత్యాన్ని పెంపొందించడంతోపాటు సోదరభావాన్ని పెంచేందుకై ఆనాడు స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సద్భావన యాత్రను ప్రారంభించారని గుర్తుచేశారు.

## విద్యాశాఖలో వివిధ పథకాలకు రూ.202 కోట్లు విడుదల

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** విద్య శాఖలో వివిధ పథకాలను కొనసాగించడం కోసం నిధులను విడుదల చేస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. వివిధ పథకాలకు రూ. 202.48 కోట్లను విడుదల చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ బి జనార్ధన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధుల ద్వారా స్కూల్ గ్రాంట్లతోపాటు ఇతర ఎస్ఎస్ఏ కార్యక్రమాలు ఆగకుండా అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

### మరోసారి ఎస్ఏ-1 పరీక్షలు వాయిదా

రాష్ట్రంలో 2019-20 విద్యా సంవత్సరంకు సంబంధించి పాఠశాల విద్యార్థులకు నిర్వహించనున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్(ఎస్ఏ)-1 పరీక్షలు మరోసారి వాయిదా పడ్డాయి. గతంలో 21 నుంచి ప్రారంభం కావల్సి ఉండగా 20 వరకు సెలవులను పొడిగించిన నేపథ్యంలో 23 నుంచి ప్రారంభించనున్నట్టు పాఠశాల విద్య కమిషనర్ టి విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే 23 నుంచి కూడా కాకుండా మరోసారి వాయిదా వేసి 25 నుంచి ప్రారంభించనున్నట్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ సమ్మె కారణంగా ఎస్ఏ-1 పరీక్షలను వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

### జూ. లైన్‌మెన్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

విద్యుత్ శాఖలో ప్రకటించిన జూనియర్ లైన్‌మెన్, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు డైరెక్టర్ ఎన్ బాలాచారి తెలిపారు. అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ మొదటి వారం నుంచి క్లాసులను ప్రారంభించనున్నట్టు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖలో 3025 జూనియర్ లైన్‌మెన్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల కోసం నోటిఫికేషన్‌ను జారీ చేసిన సంగతి తెలిసిందే.

## ఏపీలోనూ పాగావేస్తాం

**అమరావతి, ఆంధ్రప్రభ:** 'భవిష్యత్‌పై భయంతోనే తప్పు చేశామనే భావన చంద్రబాబు నాయుడులో వ్యక్తమవుతున్నట్లు కనిపిస్తోంది. గతంలో తప్పు చేస్తున్నావంటూ మాపై ఎదురుదాడి చేశారు. ఇప్పుడేమో తప్పు చేశా నని అంటున్నారు. తెదేపా అవస రం, చంద్రబాబు నాయుడుని ఉద్ధరించా ల్సిన అవసరం మాకు లేదు. గతంలో రెండుసార్లు ఆక్సిజన్ ఇచ్చి అధికార పగ్గాలు అప్పగిం చా ము' అంటూ బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు సంచనల వ్యాఖ్యలు చేశారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో ప్రెస్‌క్లబ్ నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్ర మంలో జీవీఎల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి వస్తున్న నేతలు తమ భవిష్యత్ కోసమే తప్ప మాపై అభిమానంతో కాద న్నారు. నిజంగా వాళ్లు సమర్థులైతే ఆ పార్టీల్లోనే గెలిచేవారు కదా? అంటూ ప్రశ్నించారు. అయితే వాళ్ల అనుభవం తమ పార్టీ విస్తరణకు కొంత దోహదపడుతుందనే తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగని ఎవరినీ బతిమిలాడి తీసుకోవాల్సిన అవసరం లేదని జీవీఎల్ స్పష్టం చేశారు.



# అడవుల సంరక్షణకు యాప్!

- మరింత పకడ్బందీగా పర్యవేక్షణ
- ప్రగతి ప్రణాళిక అమలుకు విధానాలు
- ఫారెస్టు అకాడమీ సదస్సు తీర్మానం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** రాష్ట్రంలో అడవుల అభివృద్ధికి వ్యూహాత్మక ప్రణాళికను అమలు చేయాలని రాష్ట్ర అటవీశాఖ నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో ఇన్నోవేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్ అన్న నినాదంతో కొత్త విధానాల అమలు, ప్రజల భాగస్వామ్యంపై విస్తృత ప్రచారం నిర్వహించేందుకు అటవీ అధికారుల సదస్సు తీర్మానించింది. శనివారం దూలపల్లిలోని ఫారెస్టు అకాడమీలో జరిగిన రెండవరోజు సదస్సులో ఈ నిర్ణయం తీసుకున్నారు. వినూత్నమైన ఆవిష్కరణలు, వాటి అమలుకు సంబంధించి తొమ్మిది కొత్త విధానాలను ఈ సందర్భంగా ప్రకటించారు. అడవులు, అటవీ భూముల సమగ్రస్థితి, ములుగులో అటవీ భూ రక్షణపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ప్రభుత్వం చేసే కార్యక్రమాల్లో జవాబుదారీతనం, అధికార యంత్రాంగం విధుల్లో పారదర్శకత ఉండేవిధంగా ముందడుగు వేయాలని అధికారులు నిర్ణయించారు. ఆ ప్రకారం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గూగుల్ మొబైల్ అప్లికేషన్ ద్వారా అటవీ ప్రాంతాల పర్యవేక్షణ, పరిపాలనను చేపట్టనున్నారు. జిన్నా రంలో వన్య ప్రాణుల సంరక్షణ, నిర్వహణ కోసం కెమెరా ట్రాప్స్ వాడకాన్ని ప్రారంభించనున్నారు. ఎం- స్ట్రిప్స్ ద్వారా కవ్వాల్ పరిధిలోని జిన్నారంలో పెట్రోలింగ్, వన్యప్రాణుల నిర్వహణకు ప్రత్యేక వాహనా లను ఏర్పాటు చేయను న్నారు. అలాగే అటవీ రక్షణ, కోర్టు కేసుల సత్వర పరిష్కా రం కోసం చొరవ చూపను న్నారు. ములుగులో గడ్డి భూముల అభివృద్ధి, పాల్వం చలో కృత్రిమ పద్ధతుల ద్వారా సహజ అటవీకరణ, చికిత్స పద్ధతుల ప్రభావం, ఖమ్మంలో ప్రత్యామ్నాయ పరిహారం భూముల్లో తోటల పెంపకం, వరంగల్ అర్బన్ ప్రాంతంలో బోడిగుట్టలపై అడవులను పెంచడం కార్యక్రమాలను అమలు చేయాలని అటవీ అధికారుల సదస్సులో తీర్మానించారు. ఇప్పటి వరకు క్షేత్రస్థా యిలో విజయవంతమవుతున్న సంరక్షణ చర్యలపై అటవీ ముఖ్య సంరక్షణాధికారి ఆర్.శోభ ప్రశంసిం చారు. వీలైనన్నీ ప్రాంతాల్లో కార్యక్రమాలను ప్రారం భించాలని సూచించారు.

### కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌కు ఐఎస్‌వో ధృవీకరణ

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆసక్తితో అభివృద్ధి చేస్తున్న కొత్తగూడ బొటానికల్ గార్డెన్‌కు ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌వో) ధృవీకరణ లభించింది. ఐటీ కారిడార్‌లో అర్బన్ లంగ్ స్పేస్ కోసం ఎకో టూరిజం పేరుతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల కుగానూ ఈ ఘనత దక్కింది.రాష్ట్రంలో అడవుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని సంబంధితశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఇందుకు సంబంధించి బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అటవీ అభివృద్ధి సంస్థ అధికారులకు ఐఎస్‌వో ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అర్బన్ ఫారెస్ట్ పార్కులకు అంతర్జాతీయ గుర్తింపు రావడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేస్తోందని, బొటానికల్ గార్డెన్‌కు ఐఎస్‌వో గుర్తింపు దక్కడం వెనక వారి కృషి ఎంతో ఉందని కితాబిచ్చారు. రెండేళ్ళ క్రితం గార్డన్‌లో నాటిన మొక్కలన్నీ చెట్లుగా మారాయని, దాంతో ఈ ప్రాంతం సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర తివారీ, అటవీ అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రఘువీర్ పాల్గొన్నారు.

### తెలంగాణ భక్తులకు సముచిత ప్రాధాన్యం ఇవ్వండి

ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన విధంగానే ఇప్పుడు కూడా తెలంగాణ ప్రాంత భక్తులకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో సముచిత ప్రాధా న్యం కల్పించాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్ర కరణ్‌రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగాహైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పిం చారు. తెలంగాణ ప్రతిరోజూ వేలాది మంది భక్తులు తిరుమలేశుని దర్శనం కోసం వస్తుంటారని, ఇక్కడి భక్తులకు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించాలని కోరారు.

## రిటైర్డ్ ప్రభుత్వ వైద్యుడి ఇంట్లో ఎన్ఐఏ సోదాలు

**మంచిర్యాల ప్రతినిధి, (ప్రభన్యూస్) :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ప్రభుత్వ వైద్యుడి ఇంట్లో ముంబాయికి చెందిన ఎన్ఐఏ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) పోలీసుల బృందం శనివారం సోదాలు నిర్వహించింది. గతంలో మావోయిస్టు సానుభూతి పరుడిగా ఉన్న డాక్టర్ చంద్రశేఖర్ పదవి విరమణ అనంతరం కూడా వారికి సహకరిస్తున్నాడనే అనుమానంతో సోదాలు నిర్వహించినట్లు సమాచారం. ముంబాయికి చెందిన ఎన్ఐఏ బృంధం సెర్చ్ వారెంట్ ద్వారా డాక్టర్ ఇంటికి వచ్చి అతనికి ఆర్డర్ చూపించి ఇంట్లో సోదాలు నిర్వహించారు. సెల్‌ఫోన్‌తో పాటు, కంప్యూటర్‌లోని హార్డ్ డిస్క్‌ను, విప్లవ సాహిత్యాన్ని స్వాధీనం చేసుకొని డాక్టర్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు.

ఈ విషయమై ఆంధ్రప్రభ డాక్టర్ చంద్రశేఖర్‌ను సంప్రదించగా తమ అనుమానాలను నివృత్తి చేసుకునే ఉద్దేశ్యంతో ఎన్ఐఏ బృందం సెర్చ్ వారెంట్‌తో తన ఇంట్లో సోదాలు నిర్వహించిందని, వారుతనను ఏ మాత్రం ఇబ్బంది పెట్టలేదని,అవసరమైతే కోర్టుకు రావాల్సి ఉంటుందని చెప్పారని తెలిపారు. నిర్మల కుమారి అరెస్ట్ మూలంగా తన పేరు బయటకు వచ్చినట్లు వారు పేర్కొన్నారని, తాను గత చాలా సంవత్సరాల నుండి ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం లేదని, ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నానని, పాత కాలం నాటి సాహిత్యం వారికి దొరికిందని, దాంతో పాటు తన సెల్‌ఫోన్‌ను, కంప్యూటర్‌లోని హార్డ్ డిస్క్‌ను తీసుకువెళ్లారని పేర్కొన్నారు.

## చంచల్‌గూడ జైల్లో ఈఎస్ఐ నిందితురాలు పద్మ ఆత్మహత్యాయత్నం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఈఎస్ఐ మందుల స్కామ్ నిందితుల్లో ఒకరైన పద్మ జైల్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.మాత్రలను ఎక్కు వగా వేసుకుని బలవన్మరనానికి యత్నించారు. తోటి ఖైదీల ద్వారా విషయాన్ని తెలు సుకున్న జైలు అధికారులు ఆమెకు వెంటనే ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది లేదని జైలు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పద్మ కుటుంబసభ్యులు శనివారం మధ్యాహ్నం జైలుకు వచ్చి కలిసి వెళ్లారు. రెండ్రోజుల క్రితం ఆమె అస్వస్థతకు లోనవ్వడంతో చంచల్‌గూడ జైలు వైద్యులు ఆమెకు టాబ్లెట్స్ ఇచ్చారు. శనివారం సాయంత్రం ఆమె తన వద్ద ఉన్న ట్యాబెట్లు(మాత్రలు) ఒకేసారి మింగినట్లు జైలు అధికారులు గుర్తించారు. ఈఎస్ఐ స్కాంలో పద్మ నిందితురాలిగా ఉన్నారు. గత నెల 27న పద్మను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి చంచల్‌గూడ మహిళా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

# విషాదసాగరం

- సాగర్ ఎడమకాల్వలో పడిపోయిన స్కార్పియో
- కారులోనే ఆరు మృతదేహాలు
- 18 గంటల పాటు శ్రమించి బయటకు తీసిన ఎన్డీఆర్ఎఫ్





**కోదాడ, (ప్రభన్యూస్) :** సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం చాకిరాల సమీపంలో శుక్రవారం రాత్రి సాగర్ ఎడమకాల్వలో పడిపోయిన స్కార్పియో వాహనాన్ని ఎట్టకేలకు శనివారం మధ్యాహ్నానికి బయటకు తీశారు. మూడుసార్లు విఫలమైన తరువాత నాలుగో ప్రయత్నంలో బయటకు తీయగలిగారు. కారులో చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయిన ఆరుగురి మృతదేహాలను చూసి అందరూ విచలితులైనారు. మృతులను అబ్దుల్ అజీజ్, నాగేశ్వరరావు, రాజేష్, జాన్సన్, సంతోష్, పవన్‌లుగా గుర్తించారు. చాకిరాలకు చెందిన మహేష్ వివాహానికి హైదరాబాద్‌నుంచి వచ్చిన సహోద్యోగులు మూడు కార్లలో తిరిగి వెడుతూండగా వీరు ప్రయాణిస్తున్న వాహనం కాల్వలోకి పడిపోయిన విషయం తెలిసిందే. కాగా చాకిరాల ప్రమాదం, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా కచ్చులూరువద్ద గోదావరిలో పడవ మునిగిపోయిన ఘటనను తలపించింది. సాగర్ ఎడమకాల్వలో మునిగిన సుమారు 250 మీటర్ల దూరం వరకు కొట్టుకుపోయి కాలువలో అడుగు భాగాన మట్టిలో కూరకుపోయినట్లు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వాటర్ స్కానర్ సహాయంతో శనివారం గుర్తించారు. కారును వెలికితీసేందుకు ఉదయం ఆరు గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు శ్రమించాల్సి వచ్చింది. దాదాపు 18గంటల పాటు కాలువ అడుగుభాగంలో కారు ఉండిపోయింది. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వాహనానికి తాళ్లు కట్టి క్రేన్ సహాయంతో బయటికి లాగడానికి ప్రయత్నించారు. నీటిలోని వాహనం రాడ్డుకు తాడు కట్టి బయటికి లాగుతుండా రాడ్డు ఊడి రావడంతో మొదటి ప్రయత్నం విఫలమయింది. ఆ తరహాలోనే మరో రెండు ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాలువ నిండుగా ప్రవహిస్తుండడంతో వాహనాన్ని బయటికి తీసేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు చాకిరాల భరాఖాత్‌గూడెం నుండి గజ ఈతగాళ్లను రప్పించి వాహనాన్ని అతి కష్టం మీద క్రేన్ సహాయంతో బయటికి తీశారు. కాగా వాహనంలోనే ఉన్న ఆరుగురు మృతదేహాలను చూసి మృతుల కుటుం సభ్యులు సన్నిహితులు పెట్టిన రోదనలు ఘటనా స్థలానికి వచ్చిన వందలాది మందని కంటతడి పెట్టించాయి. పోలీసులు వాహనం నుండి మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం రాత్రి మృతదేహాలను వారి బంధువులకు అప్పగించారు. మృతులంతా హైద్రాబాద్‌లోని అకురా ఆసుపత్రి సిబ్బంది కావడంతో ఆ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, మేనేజ్‌మెంట్ వారు తరలివచ్చారు. మృతదేహాలను వెలికితీసే వరకు కలెక్టర్ అమయ్‌కుమార్, ఎస్పీ భాస్కరన్,ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్‌లు దగ్గరుండి పర్యవేక్షించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సానుభూతి తెలిపారు.

## సైనిక స్కూల్స్‌లో బాలికలకు ప్రవేశం

**న్యూఢిల్లీ:** 2021-22 నుంచి సైనిక పాఠశాలల్లో దశలవారీగా బాలికలను చేర్చే ప్రతిపాదనను రక్షణమంత్రి రాజ్‌నాథ్ ఆమోదించారు. రెండేళ్లక్రితం మిజోరాంలోని సైనిక్ స్కూలులో బాలికల ప్రవేశం కోసం ప్రారంభించిన పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయం లింగసమానత్వం, సాయుధ దళాల్లో మహిళా ప్రాధాన్యం కల్పించడంతోపాటు ప్రధాని మోడీ ప్రచారం చేసిన బేటీ బచావో బేటీ పడావో నినాదం బలోపేతం చేసేవిధంగా ఉందని మంత్రిత్వశాఖ తెలిపింది. కాగా దేశవ్యాప్తంగా 33సైనిక పాఠశాలలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పైలట్ ప్రాజెక్టుకు అనుగుణంగా 2017లో సైనిక్ స్కూలులో ఆరుగురు బాలికలకు ప్రవేశం కల్పించడంతో విద్యార్థినుల ప్రవేశం ప్రారంభమైంది. బాలికలను సైనిక పాఠశాలల్లో చేర్పించడం మహిళా క్యాడెట్లను నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేర్చే మొదటిదశగా భావిస్తారు. గతేడాది ఏప్రిల్‌లో 2018 విద్యాసంవత్సరానికి సంబంధించి 9వ తరగతిలో కెప్టెన్ మనోజ్‌కుమార్ పాండే యూపీ సైనిక్ పాఠశాల (రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోకి రాని ఏకైక పాఠశాల)లో 15మంది బాలికలకు ప్రవేశం కల్పించారు.

# ఏపీకి కొత్త రాజధాని?

- శివరామకృష్ణ కమిటీ నివేదిక.. అమలు దిశగా అడుగులు
- 13 జిల్లాలకు సమాన భాగస్వామ్యం కల్పించేలా నిర్ణయాలు
- విశాఖలో హైకోర్టు... రాయలసీమకు బెంచ్
- క్యాపిటల్ నిర్మాణానికి కేంద్రం సాయం

**అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో:** నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అంశం కొత్త మలుపు తీసుకుంటోంది. ముఖ్యమంత్రిగా జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాజధాని అంశంపై అనేక ఊహాగానాలు వచ్చాయి. మంత్రి బొత్స సత్యనారాయణ లీకుల వ్యాఖ్యలతో మొదలైన రాజధాని మార్పు అంశం ఏపీ ప్రజలను అయోమయంలో పడేసింది. తాజా పరిణామాలతో బొత్స వ్యాఖ్యలు నిజమేనని, రాజధాని మార్పు తథ్యమని తెలుస్తోంది. అమరావతి నుంచి వేరొక ప్రాంతానికి మార్చనున్నట్లు అధికార పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఇందుకు కేంద్రం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్న ప్రచారం జరుగుతోంది. జగన్ సర్కార్ తీసుకుంటున్న నిర్ణయాలను బట్టి చూస్తుంటే వీలైనంత త్వరలోనే ఆ ప్రక్రియను పూర్తి చేసేలా, కొత్త రాజధాని నగరం అన్వేషణను మరింత వేగవంతం చేసినట్లు స్పష్టంగా అర్ధమవుతోంది. కేంద్ర హోంశాఖ వద్ద ఉన్న ఓ రహస్య నివేదిక ఆధారంగా కొత్త రాజధాని ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. ఇదే అంశం కొత్త రాజధాని ఏర్పాటులో కీలక మారబోతుంది. ఆంధ్రప్రదేశ్ రాజధానిపై శివరామకృష్ణ కమిటీ తయారు చేసిన 187 పేజీల నివేదిక ప్రస్తుతం కేంద్రం వద్ద ఉంది. ఆ నివేదికలో పొందుపర్చిన పలు కీలకమైన అంశాల మేరకు కేంద్రం అడుగులు వేస్తుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 2014లో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో పర్యటించిన కమిటీ 187 పేజీల నివేదికను కేంద్ర హోంశాఖకు 2 రకాల నివేదికలు సమర్పించింది. ఒక నివేదికను బహిరంగంగా సమర్పిం చగా, మరొకటి రహస్యంగా అందజేసింది. రెండవ నివేదికపై కేంద్ర హోంశాఖతో కమిటీ సుదీర్ఘంగా చర్చించి సమర్పించింది. ఆ నివేదికలో కీలకమైన అంశాలను ప్రస్తావించింది. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అత్యవసరమని సూచించింది. ఒకవేళ అది సాధ్యంకాని పక్షంలో ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వడం మంచిదని చెప్పింది.అలాగే విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో రాజధాని ఏర్పాటు ఆర్థికంగా, పర్యావరణ పరంగా నష్టమని స్పష్టం చేసింది. రాజధాని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1536 కోట్లు అవసరమని సూచించింది. శాసనసభ, సచివాలయం ఉన్న చోటే హైకోర్టు ఉండాల్సిన అవసరం లేదని తెలిపింది. అనేక రాష్ట్రాల్లో హైకోర్టులు రాజధానిలో లేవని ఉదహరించింది.

## నిజామాబాద్ జిల్లాలో బంద్ సక్సెస్

- బంద్‌లో పాల్గొన్న రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు
- నల్లబ్యాడ్జీలతో పలు ఉద్యోగ సంఘాల నిరసన
- రెండు చోట్ల బస్సులపై రాళ్ళు రువ్విన నిరసనకారులు
- తాత్కాలిక డ్రైవర్లకు గాయాలు

**నిజామాబాద్ బ్యూరో , ప్రభన్యూస్:** నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ జేఏసీ తలపెట్టిన బంద్ విజయవంతమైంది. చెదురు ముదురు ఘటనలు మినహా బంద్ ప్రశాంతంగా ముగిసింది. సినిమా థియేటర్లు, హోటళ్ళు తెరుచుకోలేదు. మధ్యాహ్నం వరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వ్యాపార సంస్థలు తెరుచుకపోవడంతో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. మండల కేంద్రాల్లో కూడా బంద్ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఆర్టీసీ జేఏసీ పిలుపు అందుకున్న కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీజేఎస్ పార్టీలతో పాటు సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, వామపక్ష పార్టీలు కూడా బంద్‌కు ప్రత్యక్షంగా మద్దతు పలికాయి. ఎమ్మార్పీఎస్‌తో పాటు పలు ప్రజా సంఘాలు ఆందోళనలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. జర్నలిస్టు సంఘాలు కూడా బంద్‌కు మద్దతుగా ర్యాలీలు నిర్వహించి తమ వంతు బాధ్యతను నెరవేర్చారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి, బోధన్, బాన్సువాడ, ఆర్మూర్‌లతో పాటు నిజామాబాద్ నగరంలో రాజకీయ పార్టీలు, వామపక్ష పార్టీలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, వివిధ కుల సంఘాలు ఐక్యంగా బంద్‌లో పాల్గొన్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఆద్యాంతం నినాదాలు చేశారు. సాయంత్రం 5 గంటల వరకు బంద్ కొనసాగింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జరిగిన బంద్‌లో పలు చోట్ల స్వల్ప ఘటనలు చోటు చేసుకున్నాయి. కంఠేశ్వర్ సమీపంలో ఆర్టీసీ బస్సుపై నిరసనకారులు రాళ్ళు రువ్వడంతో తాత్కాలిక డ్రైవర్ తలకు గాయమైంది. బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఆర్మూర్‌లోని పెర్కిట్ సమీపంలో ఆర్టీసీ బస్సుపై నిరసనకారులు రాళ్ళు రువ్విన ఘటనలో బస్సు అద్దాలు పగిలిపోయాయి. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల కేసీఆర్ శవయాత్రలను చేపట్టి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కామారెడ్డిలో కేసీఆర్‌కు పిండప్రదానం చేసి మహిళలు ఏడ్చారు.




నిరసనకారులు రాళ్లు రువ్వడంతో ధ్వంసమైన నిజామాబాద్-2 డిపోకి చెందిన బస్సు అద్దాలు

# 'బ్రెగ్జిట్' మరింత ఆలస్యం!

**లండన్ :** బ్రెగ్జిట్ ఒప్పందం విషయంలో బ్రిటన్ ప్రధాన మంత్రి బోరిస్ జాన్సన్‌కు చివరి నిమిషంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. యూరోపియన్ యూనియన్ నుంచి యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) వేరుపడటానికి ఉద్దేశించిందే బ్రెగ్జిట్ ఒప్పందం. పార్లమెంట్‌లో శనివారం ఈ బిల్లును బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రవేశపెట్టగా మద్దతు లభించలేదు. సుమారు మూడేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నా... పార్లమెంట్‌లో సభ్యుల నుంచి మద్దతు లభించడం లేదు. దీంతో బ్రిటన్ పార్లమెంట్‌లో హైడ్రామా కొనసాగింది. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ బయటికి వచ్చే విషయంలో మరింత లోతైన అధ్యయనం అవసరం అని ఎంపీలు అభిప్రాయపడ్డారు. బ్రెగ్జిట్‌పై ఓటింగ్ నేపథ్యంలో వ్యతిరేకిస్తున్న వారంతా పెద్ద సంఖ్యలో పార్లమెంట్ ముందుకొచ్చి నిరసన తెలిపారు. దీనిపై తొలుత పార్లమెంట్‌లో శనివారం చర్చ జరిగింది. యూకే పార్లమెంట్‌లో శనివారం జరిగిన ఓటింగ్‌లో ఈ నిర్ణయాన్ని వాయిదా వేయడానికి అనుకూలంగా ఓట్లు పోలయ్యాయి. బ్రెగ్జిట్ జరగడాన్ని నిరోధించాలని కోరుతూ సర్ ఓలివర్ లెట్విన్ ప్రతిపాదించిన సవరణకు ఎక్కువ మంది ఎంపీలు మద్దతు పలికారు. ఈసవరణకు అనుకూలంగా 322 మంది ఓటేయగా.. వ్యతిరేకంగా 306 మంది ఓటేశారు. బ్రెగ్జిట్ ఒప్పందం విషయంలో ఆమోదం పొందడానికి అవసరమైన అన్ని చట్టాలు ఆమోదం పొందాల్సి ఉంటుంది. అక్టోబర్ 31 వరకు బ్రెగ్జిట్ ఒప్పందం ఎలాగైనా సాధించొచ్చని జాన్సన్ భావిస్తున్నారు. కానీ టెక్నికల్‌గా కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పుడు తప్పనిసరిగా బ్రెగ్జిట్ గడువును వచ్చే జనవరి వరకు పొడగించాలని కోరాల్సి ఉంటుంది. ఈ ఒప్పందం అమలు గురించి చర్చించేందుకు ప్రతిపాదిత దేశీయ చట్టాన్ని పరిశీలించే వరకు గడువు కోరాల్సి ఉంటుంది. శనివారం నాటికి ఆమోదం లభించాల్సి ఉండగా.. ఎదురు దెబ్బ తగలడంతో యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ విడిపోవడానికి మరో మూడు నెలలు గడువు కావాలని యూరోపియన్ యూనియన్‌ను బ్రిటన్ ప్రభుత్వం కోరాలి. అయితే తాను యూరోపియన్ యూనియన్‌తో ఎటువంటి చర్చలు జరపబోనని ప్రధాని జాన్సన్ తెగేసి చెప్పడం గమనార్హం.




# జగత్తు..

మార్పు సాధించేందుకు, అసంతృప్తి తెలిపేందుకు ఆందోళనలు లేదా నిరసనలు శక్తివంతమైన మార్గాలు. ఉద్యోగాల సాధనకు వాషింగ్టన్‌లో మొదలైన పౌరహక్కుల ఉద్యమం నుంచి భారత స్వాతంత్ర్య పోరాటం దాకా అనేక ఆందోళనలు ప్రపంచ చరిత్రలో తమదైన ముద్రను వేశాయి. భావి తరాలకు ఆదర్శనీయంగా నిలిచాయి. నాటితో పోల్చితే ఇప్పటి నిరసనలు శక్తివంతంగా మారాయి. కొత్త పంథాలో సాగుతున్నాయి. సాంకేతికతను అందిపుచ్చుకుని సామాజిక మాధ్యమాలతో మరింత ప్రభావాన్ని చూపుతున్నాయి. దీంతో ఆధునిక ఉద్యమాల సామర్థ్యం పెరిగింది. తక్కువ వ్యవధిలో ఎక్కువ ప్రభావా న్ని చూపుతున్నాయి. విస్తృతంగా వ్యాప్తి చెందగలుగుతున్నాయి. సాధారణంగా మైనారిటీ గ్రూపులు తమ హక్కులు, డిమాండ్ల సాధనకు ఉద్యమిస్తుంటాయి. న్యూయార్క్ స్టోన్‌వాల్ అల్లర్లు ఈ కోవలోనివే. ఇటీవలి ఆధునిక ఉద్యమాల్లో ఎల్‌జీబీటీక్యూ శక్తిమంతమైనది. శాంతియుతంగా సుదీర్ఘకాల నిరసనలతో ఎల్‌జీబీటీక్యూలు తమ పోరాటాన్ని విజయవంతం చేసుకోగలిగారు. పరివర్తనవైపు పరుగు లు తీస్తున్న ప్రపంచం అనేక రకాల నిరసనలను ఎదుర్కొంటోంది. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ ఉద్యమం అంతర్జాతీయ సమాజాన్ని కుదిపేస్తోంది. దీనితోపాటు హాంకాంగ్ ఆందోళన, పారిస్‌లో ఎల్లో ఉద్యమం, ఇండోనేషియాలో క్రిమినల్ కోడ్ వ్యతిరేక ఉద్యమం వరకూ అనేక పోరాటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ప్రభుత్వాలను కుదిపేస్తున్నాయి. ఇలాంటి ఉద్యమాల్లో ప్రధానమైన కొన్ని ఆందోళనల గురించి ప్రత్యేక కథనం.

# ఉద్యమాల విపత్తు..!!

## ప్రపంచ వ్యాప్తంగా నిరసన హోరు

- వేర్వేరు అంశాలపై ప్రజా ఉద్యమాలు
- ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరుబాట
- హాంకాంగ్ నుంచి చికాగో వరకు ఆందోళన

### హాంకాంగ్

స్థానిక ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన అప్పగింత చట్టం తీవ్ర ఆందోళనకు దారితీసింది. జూన్‌లో మొదలైన ఉద్యమం లో లక్షలాది మందిని వీధుల్లోకి తీసుకొచ్చింది. ఉద్యణాన్ని అణచివేస్తున్న పోలీసులపైకి ఆందోళనకారులు పెట్రో బాంబులు, రాళ్లు, యాసిడ్ బాటిళ్లు విసిరారు. ప్రతిగా పోలీసులు బాష్పవాయువు గోళాలు ప్రయోగించారు. దాంతో పరస్పర ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. హింసాత్మక ఘటనలతో ఉద్యమం కొత్త మలుపు తిరిగింది. నేటికీ ఈ నిరసనలు కొనసాగుతున్నాయి. మంగళవారం పీపుల్స్ రిపబ్లిక్ చైనా 70వ వార్షికోత్సవం సందర్భంగా, నల్ల చొక్కాలతో వినూత్న నిరసనలు తెలిపారు. జాతీయ సంతాప దినం పాటించారు.





### నెదర్లాండ్

డచ్ రైతులు ప్రభుత్వం మీద కన్నెర్ర చేశారు. అక్టోబర్ 1న వేలాది మంది రైతులు ట్రాక్టర్లతో జాతీయ రహదారులపైకి వచ్చారు. మెగా నిరసన ర్యాలీ చేపట్టారు. దీంతో దాదాపు 700 కి.మీ పొడవునా ట్రాఫిక్ స్తంభించింది. వాతావ రణ కాలుష్యానికి రైతులే కారణమంటూ పార్ల మెంటు సభ్యులు వ్యాఖ్యానించడం అన్నదాతలను ఆగ్రహోదగ్రులను చేసింది. పైగా కర్బన ఉద్గారాలుకు హేతువు అవుతున్న కొన్ని పశు క్షేత్రాలను తక్షణమే మూసివేయాలని పాలకులు నిర్ణయించడం ఆందోళనకు కారణమైంది. మమ్మల్నే ఎందుకు తప్పుబడతారు. విమానాల వల్ల అత్యంత కాలుష్యం వెలువడుతోంది. మరి దానిపై ఎందుకు చర్యలు తీసుకోరు? పౌర విమానయాన శాఖ గురించి ఎందుకు మాట్లాడరు? అంటూ రైతులు ప్రభుత్వాన్ని నిలదీశారు.

### ఇండోనేషియా

క్రూరమైన చట్టాలకు వ్యతిరేకంగా ఇండోనేషియాలో వేలాది మంది నిరసనబాట పట్టారు. కొత్తగా అమల్లోకి తెచ్చిన క్రిమినల్ కోడ్ ప్రజలను ఆగ్రహానికి గురిచేసింది. వివాహానికి ముందు యువతీయువకులు లైంగికచర్యకు పాల్పడటం లేదా కలిసి జీవించడాన్ని తీవ్రంగా నేరంగా పరిగణిస్తూ కొత్త చట్టం చేశారు. చట్ట ఉల్లంఘునులకు ఆరు నెలల జైలు శిక్ష విధించేలా కఠిన నిబంధనలు పొందుపరిచారు. దీంతో ప్రజలు తిరుగుబావుటా ఎగరేశారు. ఈ పరిణామంతో నూతన చట్టాన్ని ఆమోదించే పార్లమెంట్ ఓటింగ్ ప్రక్రియను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇండోనేషియా అధ్యక్షుడికి వ్యతిరేకంగా 1998లో జరిగిన ఉద్యమ రికార్డును ఇది తిరగరాసింది.

### ఫ్రాన్స్

మిగతా దేశాల కంటే ఫ్రాన్స్‌లో భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఒకేసారి పలు ఉద్యమాలతో ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబావుటా ఎగరేశారు. డచ్ రైతుల మాదిరిగానే ఫ్రెంచ్ రైతులు కూడా దేశ వ్యవసాయ విధానంపై ఆగ్రహం చెందారు. జాతీయ రహదారుల దిగ్బంధనానికి దిగారు. ఇప్పటికే ఒకవైపు 45 వారాలుగా ఎల్లోవెస్ట్ ఆందోళన ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ఇంధన చార్జీలకు వ్యతిరేకంగా పట్టణాల్లో నిరసనలు చెలరేగుతున్నాయి. ఎల్లోవెస్ట్ ఆందోళనకారులు, వారి ప్రత్యర్థులైన అరాచకవాద ప్రతిరూపాలైన బ్లాక్ బ్లోక్ నిరసనకారులు పరస్పరం హింసకు దిగారు. పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు 7500 మంది పోలీసులు చెమటోడ్చాల్సి వచ్చింది. ఇక గతనెలలో పర్యావరణ పరిరక్షణ ఉద్యమం ఎగసిపడింది. లక్షలాది మంది పర్యావరణ కార్యకర్తలు పారిస్ వీధుల్లో ర్యాలీ తీశారు.

### రష్యా

గత వేసవిలో జరిగిన ఆందోళనల్లో అరెస్టయిన వారిపై విచారణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పౌరులు ఆందోళనకు దిగారు. సుమారు 25వేల మంది ర్యాలీలో పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ విధానాలను నిరసిస్తూ గత వేసవిలో 60000 మంది నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆ సందర్భంలో పోలీసులపై తిరగబడ్డారు. ఈ కారణంగా వారిపై కేసులు నమోదయ్యాయి. విచారణ పేరుతో ఇప్పటికీ వేధింపులు సాగుతున్నాయి. ప్రతిపక్షాలు కూడా నిరసన కారులకు మద్దతు ప్రకటించాయి. తక్షణమే బాధితులపై కేసులు కొట్టివేసి, విడుదల చేయాలని డిమాండ్ చేశాయి. 2012లో పుతిన్ తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత జరిగిన ఆందోళన కార్యక్రమాల్లో ఇదే అతిపెద్దది.

### పెరూ

దేశ అధ్యక్షుడు మార్టిన్ విజ్‌కార్రా కాంగ్రెస్‌ను రద్దు చేయడాన్ని ఖండిస్తూ చట్టసభ్యులు గత సోమవారం ఆందోళనకు దిగారు. అధ్యక్ష పదవి నుంచి వైదొలగాలంటూ రైట్‌వింగ్ చట్టసభ్యులు డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు మెర్సెడెస్ ఆరారోజ్‌ను పగ్గాలు చేపట్టాలని కోరారు. ఆందోళనలు తీవ్రస్థాయికి చేరాయి. అయితే, అధ్యక్షుడు పదవినుంచి తప్పుకున్నారా? లేదా? అన్నదానిపై నేటికీ స్పష్టత రాలేదు. పెరూ పౌరులు రాజధాని నగరం లిమా నడివీధుల్లో ర్యాలీలు చేపట్టారు. అయితే ఈ క్రమంలో పోలీసులు మాత్రం అధ్యక్షుడు విజ్‌కార్రాకే విధేయులుగా వ్యవహరించారు. తిరుగుబాటును అణచేసేందుకు ప్రయత్నించారు.

### హైతి

పలురకాల అల్లర్లతో అట్టుడుకుతున్న హైతీ మరింత హింసాత్మకంగా మారింది. సెప్టెంబర్‌లో ఆందోళనకారులు అధ్యక్షుడి రాజీనామా కోసం పట్టుబట్టారు. తాను రాజీనామా చేసే ప్రసక్తేలేదని జోవెనెల్ మైస్ భీష్మించారు. దీంతో పెద్దసంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. ఈ సంఘటన తర్వాత మైస్ అజ్ఞాతంలోకి వెళ్లారు. మీడియాకు దూరంగా ఉండిపోయారు. ఇదే సమయంలో దేశం ఆహారం, చమురు, విద్యుత్ సమస్యలతో సతమతం అవుతుండటం ప్రజల్లో అసహనాన్ని పెంచుతోంది. ప్రస్తుత ఆందోళనకు 2018 జులైలో బీజం పడింది. ఇంధన సబ్సిడీలు ఎత్తేయాలని నిర్ణయించడం జనాగ్రహానికి కారణమైంది.





పైగా వెనిజులా ఆయిల్ సబ్సిడీ కార్యక్రమంలో మైస్ అవినీతికి పాల్పడ్డారన్న అభియోగాలు కూడా ఉన్నాయి.

### ఈజిప్టు

అధ్యక్షుడు అబ్దుల్ ఫట్టా ఇల్-సిసి అధికార పీఠం దిగాలన్న డిమాండ్ మరోసారి ఉవ్వెత్తున ఎగసిపడింది. సెప్టెంబర్‌లో ఆందోళన మొదలైంది. దేశంలో మూడోవంతు ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. ఆందోళనలకు మద్దతిస్తున్న ప్రతిపక్ష నేతలను అరెస్టుచేశారు. మీడియాపై ఆంక్షలు విధించారు. 2000 మంది నిరసన కారులను జైళ్లలో బంధించారు. ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలను నిషేధించారు. వార్తా సంస్థలను, వెబ్‌సైట్లను నిలిపివేశారు.

### లెబనాన్:

దేశంలో ఆర్థిక సంక్షోభ పరిస్థితులపై ప్రజలు అసంతృప్తితో రగిలిపోయారు. 1977 నుంచి మొన్నటిదాకా డాలర్ మారక విలువతో లెబనీస్ పౌండ్ స్థిరంగా ఉండేది. ఇటీవల కాలంలో పరిస్థితి దిగజారింది. దేశంలో ఒక్కసారిగా కరెన్సీ కొరత ఏర్పడింది. ప్రస్తుత ఆర్థిక దుస్థితికి పాలకులే కారణమంటూ నిరసనకారులు ఆరోపించారు. క్యాపిటలిజం డౌన్ డౌన్ అంటూ వీధుల్లో ర్యాలీ తీశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పార్లమెంటు దాకా పాదయాత్ర చేశారు. ప్రపంచంలో అత్యధిక అప్పుల్లో మునిగిన దేశాల్లో ఒకటిగా లెబనాన్ మారింది.

### సిరియా

కుర్దుల పోరాటం ఏళ్లకేళ్లు కొనసాగుతూనే ఉంది. స్వతంత్ర దేశం కోసం ఉద్యమిస్తూనే ఉన్నారు. తాజాగా ఐరాస కమిటీ నుంచి వారిని తప్పించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేసారు. సిరియా రాజ్యాంగాన్ని తిరిగి లిఖించాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఇస్లామిక్ తీవ్రవాదానికి వ్యతిరేక పోరాటం నేపథ్యంలో నిన్నటిదాకా అగ్రరాజ్యం అమెరికా కుర్దులకు మద్దతుగా నిలిచింది. ఇటీవల ఈశాన్య సిరియా నుంచి బలగాలను వెనక్కి రప్పించిన అగ్రరాజ్యం కుర్దులకు మరోసారి మొండిచెయ్యి చూపింది. దీంతో టర్కీ ప్రభుత్వం వీరిపై అణచివేత చర్యలను మొదలుపెట్టింది. అస్థిత్వం కోసం దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం కుర్దుల పోరాటం ఎప్పటికి కొలిక్కి వస్తుందో అంతుబట్టని అంశం గా మారింది. అమెరికా నిర్ణయం వీరిని మరిన్ని కష్టాల్లోకి నెట్టింది.

### ఇరాక్

అక్టోబర్ 11న ప్రధానమంత్రి అదెల్ అబ్దుల్ మహ్దీకి వ్యతిరేకంగా ఆందోళన మొదలైంది. ఇప్పటికే ఇద్దరు మరణించారు. అబ్దుల్ మహ్దీ ఏడాది పాలనకు విరక్తి చెందిన పౌరులు తిరుగుబావుటా ఎగరేస్తున్నారు. నిరుద్యోగం, పౌర సేవల అభివృద్ధి అంశంలో ప్రభుత్వ అసమర్థతపై వీరు ఆగ్రహిస్తున్నారు. దీనికితోడు తీవ్రవాద నిరోధక సంస్థ చీఫ్‌గా ఉన్న లెఫ్టినెంట్ జనరల్ అబ్దుల్ వాహబ్ అల్-సాది తొలగింపు పైనా ప్రజలు మండిపడుతున్నారు. బాగ్దాద్ వీధుల్లో జరిగిన నిరసన ర్యాలీపై పోలీసులు జులుం ప్రదర్శించారు. దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో ఇద్దరు పౌరులు మరణించారు. 286 మంది గాయపడ్డారు. వీరిలో 40 మంది పోలీసులు కూడా ఉన్నారు.

### జెరూసలెం

పాలస్తీనా పౌరులు జెరూసలెంలో ఆందోళనకు దిగారు. ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్ వద్ద జరిగిన బాంబు దాడిలో 17 ఏళ్ల టీనేజర్ మరణించింది. అల్-అర్బిడ్‌ను అనుమానాస్పద నిందితుడిగా అరెస్టు చేసిన పోలీసులు, పాలస్తీయునుడిని నిర్బంధించారు. దీన్ని ఖండిస్తూ పాలస్తీనా పౌరులు భారీ నిరసన చేపట్టారు. నిందితుడిని విచారించే సమయంలో పోలీసులు తీవ్రంగా గాయపరిచి ఆసుపత్రిలో చేర్చారు. దీంతో వారు మరింత రెచ్చిపోయారు. అయితే, అతను అనారోగ్యానికి గురయ్యాడని, తాము ఎలాంటి వేధింపులకు పాల్పడలేదని ఇజ్రాయిల్ భద్రత అధికారి చెబుతున్నారు. ఈ వివాదం ఇలా ఉండగానే, మరొకవైపు అరబ్‌లపై దాడులను ఖండిస్తూ, అరబ్-ఇజ్రాయిలీ విద్యార్థులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. 2019లో సుమారు 60 మంది అరబ్ కమ్యూనిటీ పౌరులు హత్యకు గురవడంపై వీరు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### చిలీ

మెట్రో టికెట్ ధరల పెంపును నిరసిస్తూ ఆందోళన కారులు హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. పరిస్థితి చేయి దాటడంతో దేశవ్యాప్తంగా అత్యయిక పరిస్థితిని విధిస్తున్నట్లు చిలీ అధ్యక్షుడు సెబాస్టియన్ ప్రకటన చేశారు. మిలటరీకి శాంతిభద్రతల అధికారాలు అప్పగించారు. శుక్రవారం పలుచోట్ల సబ్‌వేలను నిరసన కారులు ధ్వంసం చేశారు. అనేక మెట్రో స్టేషన్లకు నిప్పంటించారు. రద్దీ సమయాల్లో టిక్కెట్ ధరలను 800-850 పెసోలకు పెంచడం జనాగ్రహానికి దారితీసింది. జనవరిలో 20



పెసోలు పెంచిన ప్రభుత్వం, ఇంతలోనే మరోదఫా భారీ వడ్డనకు పాల్పడటంపై ప్రజలు తిరుగుబాటు చేశారు. స్టేషన్లను ధ్వంసం చేశారన్న కారణంగా గురువారం 133 మందిని అరెస్టు చేశారు. తాజా విధ్వంస చర్యల వల్ల దాదాపు 500 మిలియన్ల పెసోల ఆర్థిక నష్టం వాటిల్లినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

### చికాగో

ఉపాధ్యాయులు ఉద్యమ బాట పట్టారు. పాతిక వేల మంది ఉపాధ్యాయులు తరగతి గదుల నుంచి బయటకొచ్చారు. ఆందోళన పథంలో అడుగులు వేస్తున్నారు. వీరికి సహాయసిబ్బంది మద్దతు పలికారు. వారూ నిరసనలో భాగస్వాములయ్యారు. డిమాండ్ల సాధనలో అధికార వర్గాలతో సంప్రదింపులు కుదరలేదు. పరిస్థితి మరింత తీవ్రమైంది. వేతనాల పెంపు, పబ్లిక్ ఎడ్యుకేషన్ సిస్టమ్‌లో పారదర్శక పెట్టుబడుల విధానం, అనుకూల హౌసింగ్ స్కీం, సిబ్బంది పెంపు వంటి ప్రధాన డిమాండ్లతో ఆందోళనకు దిగారు. మౌలిక వసతుల్లో అసమానతలు తొలగా లన్నదే మా న్యాయబద్ధమైన కోరిక అని చికాగొ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు డేవిస్ గేట్స్ చెప్పారు. ఇది ఇన్‌కమ్‌కు సంబంధించిన సమస్య కాదు.. ఔట్ కమ్‌కు సంబంధించిన అంశమని చెప్పారు.

### ద.కొరియా (సియోల్)

న్యాయశాఖ మంత్రి చోకుక్ పై అవినీతి కుంభకోణాలు సంక్షోభానికి దారితీశాయి. అటు రాజకీయ పక్షాలు, ఇటు పౌర సంఘాలు రోడ్డెక్కాయి. రాజధానిన నగరంలో కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ తీశారు. తక్షణమే మంత్రి కుటుంబ సభ్యుల అవినీతి పై దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్లు తీవ్రం అయ్యాయి. అధ్యక్షు డు మూన్ హామీ ఇచ్చిన సంస్కరణలు అమలు చేయాలని ప్రభు త్వంపై ఒత్తిడి తెస్తున్నారు. 2016-17 లోనూ ఇదే తరహా ఆందోళనలు జరిగాయి.



## పర్యావరణ ఉద్యమం

మిగతా ఆందోళనలు, అల్లర్ల సంగతి అటుంచితే, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా యువతరం ఉద్యమిస్తోంది. ఆయా దేశాల్లో ప్రభుత్వాల మీద ఒత్తిడితీసుకొస్తున్నాయి. ఈ తరహా ఆందోళనల తీవ్రత యూరప్‌లో ఎక్కువగా ఉంది. విద్యార్థులు పెద్దసంఖ్యలో పర్యావరణ సంరక్షణ పోరాటం చేస్తున్నారు. స్వీడన్‌కు చెందిన పర్యావరణ కార్యకర్త గ్రెటా థంబెర్గ్ యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గతేడాది కాలంనుంచి ఈమె పదునైన ప్రసంగాలతో ప్రజలను, సమాజాన్ని చైతన్యం చేస్తోంది. మరోవైపు ఉద్గారాల నియంత్రణ చర్యలు చేపట్టాలంటూ ప్రభుత్వాలను డిమాండ్ చేస్తోంది. ఈ ఏడాది 15 మార్చిన 80 దేశాల్లో విద్యార్థుల పర్యావరణ ఆందోళన చేపట్టారు. ప్రధాన నగరాల్లోని వీధుల్లో ర్యాలీ తీశారు. ఫ్రైడే ఫర్ ఫ్యూచర్ నినాదంతో కదంతొక్కారు. వాతావరణ మార్పులపై తక్షణమే స్పందించకుంటే భావి తరాలకు మనుగడలేదంటూ లండన్‌లో ఎక్స్టింక్షన్ రెబెలియన్ (ఎక్స్ఆర్) గ్రూపు భారీస్థాయిలో నిరసనద్యోమానికి దిగింది. అంతర్జాతీయంగా 6 కోట్ల మంది రోడ్డెక్కారు. నిరసన గళం వినిపిస్తున్నారు. వాతావరణ మార్పులపై ఈ తరహా ఉద్యమం ప్రపంచంలో ఇదే అతిపెద్దది.





## చారిత్రక తప్పిదాన్ని సరిచేశాం!

**రేవరి (హర్యానా):** కాంగ్రెస్‌పై ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370 ఆర్టికల్‌ను రద్దు చేసి చారిత్రాత్మక తప్పిదాన్ని సరి చేశామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 1964లో పార్లమెంట్ వేదికగా ఆర్టికల్ 370ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దాన్ని అమలు చేయడంలో దశాబ్దాలు గడిచినా.. సఫలం కాలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రేవరిలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో నరేంద్ర మోడీ మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దు చేయాలనే డిమాండ్‌పై పార్లమెంట్ వేదికగా చర్చ జరగగా.. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీ నెరవేర్చకుండా దేశ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు. చేతులు ముడుచుకుని కూర్చొని, మీ డిమాండ్‌ను ఏడాది కాలంలో నెరవేరుస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మళ్లీ ఈ విషయమై కాంగ్రెస్ ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. దేశ ప్రజలతో, వారి మనోభావాలతో కాంగ్రెస్ ఆడుకుందని విమర్శించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జవాన్లు, పోలీసుల జ్ఞాపకార్థం స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పిందని, 70 ఏళ్లు గడుస్తున్నా నెరవేర్చలేదని, తమ ప్రభుత్వం మాత్రమే దీన్ని నిజం చేసిందని అన్నారు. దేశ ప్రయోజనం కోసం ఆర్టికల్ 370ను రద్దు చేస్తే.. కాంగ్రెస్ నేతలు మాత్రం స్వలాభం కోసం భాజపా ఈ విధంగా వ్యవహరించిందని ఆరోపించడం సరికాదన్నారు. వన్ ర్యాంక్.. వన్ పెన్షన్ స్కీంను కూడా తమ ప్రభుత్వమే తీసుకొచ్చిందని, కేవలం హర్యానాలో సుమారు 2 లక్షల మంది మాజీ జవాన్లకు రూ.900 కోట్లు అందిస్తోందని అన్నారు.

### పాకిస్తాన్‌తో ఏం సంబంధం..?

కాంగ్రెస్ పాలనలో రైతులు, జవాన్లు, క్రీడాకారులకు భద్రత లేకుండా పోయిందని, అసలు పాకిస్తాన్‌తో కాంగ్రెస్‌కు ఉన్న సంబంధం ఏంటో చెప్పాలని మోడీ డిమాండ్ చేశారు. ఆర్టికల్ 370ను రద్దు చేస్తే పాకిస్తాన్‌కు మద్దతుగా మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. బాలాకోట్‌లో భారత్ జవాన్లు ప్రాణాలకు తెగించి మెరుపు దాడులు చేస్తే సాక్షాధారాలు అడగడం ఏంటని విమర్శించారు. కాంగ్రెస్ చేసిన ప్రకటనలను పాకిస్తాన్ ఐక్యరాజ్య సమితి నివేదికలో పొందుపర్చి అందించిందని, ఇది భారత్‌కు వ్యతిరేకం అని అన్నారు. స్వచ్ఛభారత్, సర్జికల్ స్ట్రయిక్ గురించి మాట్లాడినప్పుడల్లా కాంగ్రెస్‌కు కడుపులో మంట పుడుతోందని ఎద్దేవా చేశారు. బాలాకోట్ దాడులు చేస్తే కాంగ్రెస్‌కు కడుపు నొప్పితో గెంతులు వేసిందని, అసలు చారిత్రాత్మకమైన పార్టీ పాకిస్తాన్‌కు మద్దతుగా ఉందా..? భారత్‌కా..? చెప్పాలన్నారు.



## జోరు వానలో.. పవార్ ప్రచారం

**సతారా (మహారాష్ట్ర):** ఓ వైపు భారీ వర్షం.. ఉరుములు మెరుపులతో ఆకాశం దద్దరిల్లుతోంది.. ఆ ప్రాంతం అంతా చీకటి అలుముకుంది.. దీనికి తోడు ప్రచారానికి చివరి రోజు.. వేలాది మంది ప్రజలు ర్యాలీలో భాగస్వాములై ముందుకు కదులుతున్నారు... అంతటి భయానక వాతావరణంలో వేరే రాజకీయ నేత అయితే బయటికి వచ్చి ప్రచారం చేయడం కాదు.. కదా... కాలు పెట్టడానికి సాహసించడు. అలాంటిది నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ అధినేత శరద్ పవార్ అన్నింటిని ధీటుగా ఎదుర్కొని ముందుకు కదిలారు. తన ప్రసంగం కోసం ఎదురు చూస్తున్న వారిని నిరుత్సాహపర్చకుండా జోరు వానలో కూడా తనేం చెప్పాలనుకున్నారో.. చెప్పారు. భారీ వర్షంలో శరద్ పవార్ ప్రసంగిస్తున్న వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. ఇది మహారాష్ట్రలోని సతారాలో చోటు చేసుకుంది. ఉరుములు, మెరుపులకు భయపడకుండా ఎంత ధైర్యంగా పవార్ ప్రసంగించారో... అంతే శ్రద్ధగా ఆ ర్యాలీకి హాజరైన వాళ్లు విన్నారు. ఎన్నికల ప్రచారానికి చివరి రోజు ఇంత భారీ వర్షం కురవడం శుభసూచకమని అంటూనే మధ్య మధ్యలో ప్రజలకు క్షమాపణలు చెబుతూ ప్రసంగాన్ని కొనసాగించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో అభ్యర్థిని ఎంపిక చేయడంలో తప్పు చేశానంటూ అందరి ముందు క్షమాపణలు చెప్పారు. దీన్ని తాను ఒప్పుకుంటున్నా అని, చేసిన తప్పును సరిదిద్దుకుంటున్నందుకు ఇప్పుడు సంతోషంగా ఉందని శరద్ పవార్ చెప్పుకొచ్చారు. పవార్ సంకల్పం, వయస్సు ముందు వర్షం కూడా చిన్నబోయిందంటూ ప్రసంగాన్ని చూసిన వారంతా పొగడ్తలతో ముంచెత్తారు. ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది.

## సర్కస్ ఫీట్లు మానేయండి..!



**న్యూఢిల్లీ :** రైల్వే, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌పై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం మానేసి కామెడీ సర్కస్ చేయడంలో పీయూష్ గోయల్ బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ తమ కర్తవ్యాలు సమర్థవంతంగా నిర్వర్తించకుండా.. ఇతరుల విజయాలను అణగదొక్కేలా మాట్లాటం తగదని విమర్శించారు. ఎంతో నిజాయితీగా, ప్రపంచం కోసం అభిజిత్ బెనర్జీ పని చేశారని, అందుకే నోబెల్ బహుమతి వచ్చిందని చెప్పుకొచ్చారు. కానీ బీజేపీ ప్రభుత్వం మాత్రం దేశాన్ని ఆర్థిక మందగమనం నుంచి బయటపడే దారులు వెతకకుండా ఇష్టం వచ్చినట్టు విమర్శలు చేస్తోం దని మండిపడ్డారు. ఆటో రంగం కుదేలైందని, పరిశ్రమలు మూతపడ్డాయని, వాహనాలపై భారీ డిస్కౌంట్లు కంపెనీలు ఇస్తున్నాయని, దానికి సంబంధించిన ప్రకటనను ఆమె చూపించారు.

## ప్రచారం పరిసమాప్తం

**ముంబై:** మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. మహారాష్ట్రలో 8,98,39,600 మంది ఓటర్లు పాల్గొననున్నారు. 288 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 18-25 ఏళ్ల మధ్య ఓటర్లు మహారాష్ట్రలో 1,06,76,013 మంది ఉన్నారు. బీజేపీ 164 స్థానాల్లో, సేన 126 స్థానాల్లో పోటీ చేయనుంది. కాంగ్రెస్ 147, ఎన్‌సీపీ 121 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. మహారాష్ట్రనవ నిర్మాణ్‌సేన 101, సీపీఐ 16, సీపీఎం 8, బీఎస్‌పీ 262, స్వతంత్రులు 1400 మంది ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. అత్యధికంగా నాందేడ్ సౌత్ నుంచి 38 మంది పోటీ చేస్తున్నారు. రత్నగిరి జిల్లా చిప్లున్ నుంచి అతి తక్కువగా 3పోటీ చేస్తున్నారు. హర్యానాలో 90 స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. బీజేపీ 90, కాంగ్రెస్ 90, బీఎస్‌పీ 87, ఐఎన్ఎల్‌డీ 81 స్థానాల్లో పోటీ చేస్తున్నారు. 375 మంది స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల ప్రకారం.. హర్యానాలో వికలాంగులు 1,04,000 మంది ఉన్నారు. హర్యానాలో గ్రామీణ ప్రాంతంలో 13,837 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు.

| | మహారాష్ట్ర | హర్యానా |
|---|---|---|
| ఓటర్లు | 8,98,39,600 | 1,83,90,525 |
| మహిళలు | 4,28,43,635 | 85,12,231 |
| పురుషులు | 4,68,75,750 | 98,78,042 |
| అభ్యర్థులు | 3,237 | 1169 |
| మహిళా అభ్యర్థులు | 235 | 105 |
| పోలింగ్ కేంద్రాలు | 96,661 | 19,578 |

# మోడీయే బెస్ట్ ప్రధాని..!

- హర్యానా, మహారాష్ట్ర ఓటర్లు మనోగతం
- మహారాష్ట్రలో 65 శాతం అనుకూలం
- హర్యానాలో 71.8 శాతం సంతృప్తి
- సోనియాకు 0.9 శాతం, రాహుల్ కు 7.6 మొగ్గు

**న్యూఢిల్లీ :** అక్టోబర్ 21న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ముందే హర్యానా, మహారాష్ట్రలో నిర్వహించిన ఐఏఎన్ఎస్-సీ ఓటర్ సర్వే ప్రకారం.. దేశ ప్రధాని ఎంపిక విషయానికి వస్తే నరేంద్ర మోడీకి దగ్గరగా ఎవరూ లేరనేది స్పష్టం అవుతోంది. హర్యానాలో 71.6 శాతం మంది ప్రజలు దేశ ప్రధాని అభ్యర్థిగా మోడీయే సరైన వ్యక్తి అని, మహారాష్ట్రలో 65 శాతం ప్రజలు కూడా ఇదే అభిప్రాయాన్ని రిపీట్ చేశారు. కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీ, ఆమె కుమారుడు రాహుల్ గాంధీ, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ కంటే మోడీ ఎన్నో రెట్లు బెటర్ అనే అభిప్రాయం హర్యానా, మహారాష్ట్రలో వినిపిస్తోంది. సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 16 మధ్య ఈ సర్వే నిర్వహించడం జరిగింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయని సర్వేలో వెల్లడైంది.

- ప్రధానిగా రాహుల్ గాంధీ ఉంటే బాగుంటుందని హర్యానాలో 7.6 శాతం ప్రజలు, మహారాష్ట్రలో 8.5 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారు.
- సోనియాగాంధీ ప్రధాన మంత్రిగా ఉండాలని హర్యానాలో 0.9 శాతం మంది, మహారాష్ట్రలో 1.2 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- ఇక మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విషయంలో... హర్యానాలో 6.3 శాతం మంది, మహారాష్ట్రలో 5.2 శాతం మంది అనుకూలంగా ఉన్నారు.
- జనతాదల్ (యూనైటెడ్) జేడీ(యూ) అధినేత, బిహార్ సీఎం నితీష్ కుమార్ విషయంలో హర్యానాలో 0.4 శాతం, మహారాష్ట్రలో 0.2 శాతం కోరుకున్నారు.
- హర్యానాలో.. వీరితో పాటు మిగిలిన నేతలైన సమాజ్‌వాది పార్టీ నేత ములాయం సింగ్ కాడా ప్రధానిగా ఉంటే బాగుంటుందని 0.1 శాతం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి అనుకూలంగా 0.3 శాతం, బీఎస్‌పీ చీఫ్ మాయావతికి 2.7 శాతం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ వైపు 2.2 శాతం ప్రజలు మొగ్గు చూపారు.
- మహారాష్ట్రలో ఎన్‌సీపీ నేత శరద్ పవార్‌కు 7.6 శాతం, మమతా బెనర్జీకి 0.3 శాతం, మాయావతికి 0.9 శాతం, కేజ్రీవాల్‌కు 1.1 శాతం ప్రజలు ఓటేశారు.
- ఇక భాజపా నేతల్లో మోడీ కాకుండా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు 0.3 శాతం, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి 0.1 శాతం ఓట్లు పడ్డాయి.
- లోక్‌సభ ఎన్నికల ప్రభావం రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఉందని హర్యానాలో 64.7 శాతం మంది, మహారాష్ట్రలో 64.4 శాతం మంది ఒప్పుకున్నారు.
- లోక్‌సభ ఎన్నికల ప్రభావం అసెంబ్లీ ఎలక్షన్‌లపై లేదని హర్యానాలో 28.7 శాతం, మహారాష్ట్రలో 30.5 శాతం మంది అభిప్రాయపడుతున్నారు.
- హర్యానాలో 6.6 శాతం మంది, మహారాష్ట్రలో 5 శాతం మంది ఏమీ చెప్పలేకపోయారు.
- సర్వేలో భాగంగా హర్యానాలో 10,061 మందిని, మహారాష్ట్రలో 19,489 మందిని ఐఏఎన్ఎస్-సీ ఓటర్ సర్వే బృందం కలుసుకోవడం జరిగింది.



## సమస్యల పరిష్కారంలో..
# భాజపా బెటర్..!

**న్యూఢిల్లీ:** పాలనా పరమైన సమస్యలు లేదా మెరుగైన పద్ధతిలో పరిష్కరించగల పార్టీలపై ప్రజలకు ఎంత నమ్మకం ఉందని ఐఏఎన్ఎస్ - సీ ఓటర్ ఓ సర్వే నిర్వహించింది. అయితే ఇందులో మహారాష్ట్ర, హర్యానా ఓటర్లు భాజపాకే పట్టం కట్టినట్టు తేలింది. ఈ రెండు రాష్ట్రాల్ల ప్రధానమైన సమస్యలు పరిశీలిస్తే.. స్థానికుల ఉపాధి లేకపోవడం, వ్యాపారం లేకపోవడం, నీటి సరఫరా, రోడ్లు సరిగా లేకపోవడం, మెరుగైన విద్యుత్ సరఫరా చేయకపోవడం, వైద్య సదుపాయాలు బాగా లేకపోవడం, లోకల్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వ్యవస్థ సరిగా లేకపోవడం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, లా అండ్ ఆర్డర్, మహిళల భద్రతతో పాటు అవినీతి నిర్మూలన అనేవి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి.

- పైన తెలిపిన అన్నీ సమస్యలను భాజపా పరిష్కరించిందని హర్యానాలో 29.1 శాతం ఓటర్లు నమ్ముతున్నారు. ఇక కాంగ్రెస్ విషయంలో 17.8 శాతం మంది మాత్రమే అనుకూలంగా ఓటు వేశారు.
- ఏ పార్టీ ఈ సమస్యలను పరిష్కరించలేదని 15.9 శాతం మంది, ఏం చెపలేమంటూ 20.7 శాతం మంది ఓటర్లు అభిప్రాయపడ్డారు.
- భాజపా, కాంగ్రెస్ కాకుండా ఇతర పార్టీల విషయంలో బీఎస్‌పీకి 2.1 శాతం, ఐఎన్ఎల్‌డీకి 1.7 శాతం హర్యానాలో ఓట్లు పడ్డాయి.
- మహారాష్ట్ర విషయానికొస్తే.. భాజపాపైన తెలిపిన అన్నీ సమస్యలు సమర్థవంతంగా పరిష్కరించిందని 28.9 శాతం మంది ఓటర్లు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌కు 13.9 శాతం ఓట్లు మాత్రమే పడ్డాయి.
- భాజపా మిత్రపక్షం శివసేనకు 6.6 శాతం, కాంగ్రెస్ మిత్రపక్షం ఎన్‌సీపీకి 11.7 శాతం, మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్)కు 2 శాతం ఓట్లు పడ్డాయి.
- ఏ పార్టీ పైన తెలిపిన సమస్యలపై సరిగా స్పందించదని 14.8 శాతం మంది చెప్పుకొచ్చారు. సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 16 వరకు ఈ సర్వే నిర్వహించడం జరిగింది.
- పైన చెప్పిన అన్నీ సమస్యలకు ప్రధాన కారణం ఎవరు అని హర్యానాలోని ఓటర్లను ప్రశ్నించగా.. 28.1 శాతం మంది రాష్ట్ర ప్రభుత్వంపై, 11.9 శాతం మంది కేంద్ర ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఓటు వేశారు. 9.9 శాతం మంది సీఎం మనోహర్ లాల్ కట్టర్‌పై 9.8 శాతం మంది స్థానిక ఎమ్మెల్యేలు అని, 2.9 శాతం మంది మున్సిపల్ లేదా పంచాయతీ శాఖ అని అభిప్రాయపడ్డారు.
- హర్యానాలో ఈ సమస్యలకు ప్రధాని మోడీయే కారణమంటూ 3.6 శాతం మంది ఓటర్లు అభిప్రాయపడ్డారు. 'ఇతరులు, ఏం చెప్పలేం' అని 30.5 శాతం మంది ఓటర్లు చెప్పారు.
- సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్రప్రభుత్వమే కారణమని మహారాష్ట్రలో 22.5 శాతం మంది ఓటర్లు అభిప్రాయపడ్డారు. కాదు సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ అంటూ 10 శాతం మంది ఓటర్లు తెలిపారు.
- స్థానిక ఎమ్మెల్యేలు అంటూ 8.6 శాతం మంది, కేంద్ర ప్రభుత్వం అని 11.6 శాతం మంది, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అని 5.1 శాతం మంది ఓటర్లు అభిప్రాయపడ్డారు.
- స్థానిక ఎంపీలు కారణమని 2.2 శాతం మంది, మున్సిపాల్టీలు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అని 5.6 శాతం మంది ఓటర్లు చెప్పుకొచ్చారు. హర్యానాలో 10,061 మందిని, మహారాష్ట్రలో 19,489 మంది ఓటర్లను ఐఏఎన్ఎస్-సీ ఓటర్ బృందం కలుసుకుంది.



## పటేల్ వర్సెస్ టిప్పు సుల్తాన్...!

**ముంబై:** 'ఐరెన్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను, 'టైగర్ ఆఫ్ మైసూర్'గా టిప్పు సుల్తాన్‌ను పిలుస్తారు. మహారాష్ట్రలో ఎన్నికలు వచ్చినప్పుడల్లా వీరిద్దరి పేర్లు కచ్చితంగా వినిపిస్తాయి. ఇద్దరూ హిస్టారిక్ లీడర్లే. ఇద్దరు నేతల పేర్లపై పార్టీలు కూడా ఉన్నాయి. ఆ పార్టీ అభ్యర్థులంతా అక్టోబర్ 21న నిర్వహించే ఎన్నికల్లో పాల్గొంటున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పటేల్, టిప్పు సుల్తాన్ పేరు చెప్పుకుని ప్రచారం చేసే వాళ్లు ఉన్నారంటే వారెంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. సర్దార్ వల్లభాయ్ పటేల్ పార్టీ (ఎస్‌వీపీపీ) యవత్‌మాల్, దేవోలి, ఔరంగాబాద్ ఈస్ట్, ముంబైలోని బోరివలి, చార్కోప్, ముంబాదేవి, అనుష్కటి నగర్, విక్రోలి నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దించింది. వీరికి ఎన్నికల సంఘం 'మైక్' గుర్తును కేటాయించింది. తమది చిన్న పార్టీయే అయినా.. గ్రేట్ సర్దార్ వల్లభాయ్ పటేల్ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తామని, రాజకీయాల్లో కీలక మార్పులు తీసుకురావడమే తమ లక్ష్యం అని, దీనికి ప్రజల మద్దతు ఎంతో అవసరం అని ఆ పార్టీ ముంబైలోని సభ్యుడు రోహిత్ షేట్ తెలిపారు. అవకాశాలు, వనరులు తక్కువగా ఉన్నా.. పార్టీ అభ్యర్థులు చిన్న బృందాలుగా ఏర్పడి తమ తమ నియోజకవర్గాల్లో ఓట్లను అభ్యర్థించారు.

### 10 స్థానాల్లో టిప్పు పార్టీ పోటీ

మరో పార్టీ 'టిప్పు సుల్తాన్ పార్టీ' ఉంది. ఈ పార్టీకి ఎన్నికల సంఘం 'కేటిల్' గుర్తును కేటాయించింది. మహారాష్ట్రలో 10 నియోజకవర్గాలైన పుసద్, ఖమ్‌గావ్, ఉస్మనాబాద్, ఔరంగాబాద్ ఈస్ట్, ఔరంగాబాద్ సెంట్రల్, మాజల్‌గావ్, బీడ్, కైజ్, పర్లీతో పాటు తుల్జాపూర్‌లో అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. మరో కొత్త పార్టీ అయిన 'డిజిటల్ ఆర్గనైజేషన్ ఆఫ్ నేషన్ పార్టీ' ఉంది. కేవలం ఒకే ఒక అభ్యర్థి అనిల్ రాథోడ్ పుసద్ నుంచి పోటీ చేస్తున్నాడు. ఈ పార్టీకి 'ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తున్న రైతు' గుర్తును ఈసీ కేటాయించింది. మరో 'నైతిక్ పార్టీ' కూడా మహారాష్ట్ర ఎన్నికల బరిలో ఉంది. థానే నుంచి మీరా-భయేందర్ పోటీ చేస్తున్నారు. ఈ పార్టీకి 'ట్యూబ్‌లైట్' గుర్తు ను కేటాయించడం జరిగింది. మరో అభ్యర్థి ముంబైలోని మగథానే నుంచి పోటీ చేస్తుండగా.. అతనికి ఆటో రిక్షా గుర్తు కేటాయించడం జరిగింది. అభివృద్ధే లక్ష్యంగా 'వికాస్ ఇండియా పార్టీ' ఎన్నికల బరిలో ఉంది. ఎంఎల్ పవార్ నేతృత్వంలోని ఈ పార్టీకి బ్యాటరీ టార్చ్ గుర్తు కేటాయించారు. కరంజా నియోజకవర్గం నుంచి పవార్ పోటీ చేస్తున్నారు.

## హర్యానా, మహారాష్ట్రలో
# మళ్లీ కమల వికాసం..!

- మహాలో 182-206 స్థానాలు కైవసం..!
- హర్యానాలో 79-87 సీట్లు పక్కా..!
- మహాలో కాంగ్రెస్‌కు 72-98 స్థానాలు..!
- హర్యానాలో కేవలం 1-7 సీట్లే..!
- ఐఏఎన్ఎస్-సీ ఓటర్ సర్వేలో వెల్లడి

**న్యూఢిల్లీ:** హర్యానా, మహారాష్ట్రలో భాజపా మళ్లీ అధికారంలోకి వస్తుందని ఐఏఎన్ఎస్-సీ ఓటర్ ప్రీ పోల్ సర్వే ద్వారా స్పష్టమైంది. మహారాష్ట్రలో గతంలో కంటే భాజపాకి అత్యధిక సీట్లు వస్తాయని ఐఏఎన్ఎస్-సీ ఓటర్ చెప్పుకొచ్చింది. రేపు ఈ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఐఏఎన్ఎస్ - సీ ఓటర్ సర్వే ప్రకారం.. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాల్లో భాజపాకి 182-206 సీట్లు వస్తున్నట్టు పేర్కొంది. కాంగ్రెస్ నేతృత్వం వహిస్తున్న యూపీఏ కూటమికి 72-98 స్థానాల్లో మాత్రమే విజయం సాధిస్తుందని వివరించింది. సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 16 మధ్య కాలంలో ఈ సర్వే నిర్వహించడం జరిగింది. రేపు ఎన్నిక ఉండగా.. 24న ఫలితాలు వెల్లడి అవుతాయి.

- మహారాష్ట్రలో రీజియన్‌ల పరంగా చూసుకుంటే.. ముంబైలో ఎన్‌డీఏకి 30-34 స్థానాలు, కొంకణ్ రీజియన్‌లో 32-36 స్థానాలు, మరాఠ్వాడాలో 23-27 స్థానాలు, నార్త్ మహారాష్ట్రలో 19-23 స్థానాలు, విదర్భాలో 37-41 స్థానాలు, వెస్ట్ మహారాష్ట్రలో 41-45 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించే అవకాశం ఉంది.
- ఇక యూపీఏ కూటమి ముంబై రీజియన్‌లో 0-6 సీట్లు, కొంకణ్ రీజియన్‌లో 2-6, మరాఠ్వాడాలో 18-22, నార్త్ మహారాష్ట్ర రీజియన్‌లో 12-16, విదర్భ రీజియన్‌లో 16-20 స్థానాలు, వెస్ట్ మహారాష్ట్ర రీజియన్‌లో 24-28 అసెంబ్లీ స్థానాల్లో గెలిచే అవకాశం ఉంది.
- ఇక ఓట్ల షేరింగ్‌లో ఎన్‌డీఏకి 47.3 శాతం, యూపీఏకి 38.5 శాతం, ఇతరులకు 14.3 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.
- 2014 ఎన్నికల్లో భాజపాకి 122 స్థానాలు, శివసేనకు 63, కాంగ్రెస్‌కు 42, ఎన్‌సీపీకి 41 సీట్లు వచ్చాయి. భాజపాకి 31.15 శాతం ఓట్లు పడగా, శివసేనకు 19.3 శాతం, కాంగ్రెస్‌కు 18 శాతం ఓట్లు పోలయ్యాయి.
- ఇక హర్యానాలో భాజపా 79-87 స్థానాల్లో గెలిచి అవకాశం ఉంది. కాంగ్రెస్ కేవలం 1 లేదా 7 స్థానాల్లో మాత్రమే విజయం సాధిస్తుందని ఐఏఎన్ఎస్- సీ ఓటర్ సర్వే ద్వారా వెల్లడైంది.
- ఇక రీజియన్ వారీగా చూసుకుంటే భాజపాకి ఆహిర్‌వాల్ నుంచి 25 సీట్లు, బగర్ నుంచి 16, జట్లాండ్ నుంచి 16, కురుక్షేత్ర నుంచి 26 సీట్లు వచ్చే అవకాశం ఉంది.
- కాంగ్రెస్‌కు కేవలం ఆహిర్‌వాల్ రీజియన్ నుంచి 2 స్థానాలు, జట్లాండ్ నుంచి ఒక స్థానంలో గెలిచే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.
- హర్యానాలో ఓట్ల షేరింగ్‌ను పరిశీలిస్తే.. భాజపాకి 47.5 శాతం, కాంగ్రెస్‌కు 21.4 శాతం, జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ)కి 9.3 శాతం, ఇతరులకు 21.4 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.
- 2014 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాకి 47 సీట్లు, ఐఎన్ఎల్‌డీకి 19 సీట్లు, కాంగ్రెస్‌కు 15 సీట్లు వచ్చాయి. ఓట్ల షేరింగ్ పరంగా భాజపాకి 33.2 శాతం, ఐఎన్ఎల్‌డీకి 24.1 శాతం, కాంగ్రెస్‌కు 20.6 శాతం ఓట్లు పడ్డాయి.

## నిరుద్యోగమే అసలు సమస్య..!

- రెండు రాష్ట్రాల్లో భాజపాపై వ్యతిరేకత
- వ్యాపారం విషయంలో కూడా అంతే..!
- హర్యానాలో 28 శాతం, మహారాష్ట్రలో 23.1 శాతం గుస్సా

**న్యూఢిల్లీ :** జమ్మూ కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు విషయంలో మహారాష్ట్ర, హర్యానాలో భాజపాకి అనుకూలంగా లేనట్టు ఐఏఎన్ఎస్ - సీ ఓటర్ సర్వే ద్వారా వెల్లడైంది. రెండు రాష్ట్రాల్లో నిరుద్యోగం, బిజినెస్ అంశాలు ప్రధాన సమస్యలుగా ఉన్నట్టు సర్వేలో తేలింది. సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 16 మధ్యలో నిర్వహించిన సర్వేలో చాలా మంది ఓటర్లు 'ఇతరులు /ఏం చెప్పలేం' కేటగిరిలో ఉన్నారు. హర్యానా, మహారాష్ట్ర రెండు రాష్ట్రాల్లో భాజపా ప్రభుత్వం అధికారంలో ఉంది.




- హర్యానాలో 'ప్రస్తుతం మీ ముందు ఉన్న అతిపెద్ద సమస్య ఏంటి..?' అనేదానికి 'ఉపాధి/వ్యాపారం' అని 28 శాతం మంది సమాధానం ఇచ్చారు. మహారాష్ట్రలో 23.1 శాతం మంది ఉన్నారు.
- ఇక రెండో అతిపెద్ద సమస్యగా నీటి సరఫరా ఉందని హర్యానాలో 12.4 శాతం మంది, మహారాష్ట్రలో 18.4 శాతం మంది చెప్పుకొచ్చారు.
- మూడో సమస్యగా రోడ్ల పరిస్థితి ఉంది. రోడ్లు అస్సలు బాగా లేవని హర్యానాలో 8.6 శాతం మంది, మహారాష్ట్రలో 14.1 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- ఈ సర్వేలో 'సామాజిక/కులం/మత సామరస్యం పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఈ సమస్యపై మహారాష్ట్ర, హర్యానా నుంచి 0.9 శాతం మంది ఓటర్లు గళం విప్పారు.
- మహిళలకు భద్రత లేకుండా పోయిందని మహారాష్ట్రలో 0.3 శాతం మంది, హర్యానాలో 0.4 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- ఆర్థిక పరిస్థితి విషయానికొస్తే.. దీన్ని ప్రతిపక్షాలు ఈ ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రంగా వాడుకున్నాయి. హర్యానాలో 0.3 శాతం, మహారాష్ట్రలో 0.2 శాతం మంది ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ బాగా లేదని చెప్పుకొచ్చారు.
- ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని ఈ రెండు రాష్ట్రాల్లోని ఓటర్లు పెద్ద పట్టించుకోలేదు. భాజపాకి ఈ అంశం ప్రచారంలో అంతగా కలిసిరాలేదనేది స్పష్టమైంది. ఈ అభిప్రాయాలు తెలుసుకునేందుకు హర్యానాలో 10,061 మందిని, మహారాష్ట్రలో 19,489 మంది ఓటర్లను కదిలించింది.

## పత్తాలేని 'స్టార్ క్యాంపెయినర్స్'

- సోనియా, ప్రియాంక దూరం
- రెండు రాష్ట్రాలు.. 7 ర్యాలీల్లో రాహుల్ ప్రచారం
- యూపీకే పరిమితమైన ప్రియాంక

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల ఫలితాల తరువాత దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా మారింది. మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కూడా లోక్‌సభ ఎన్నికల తరహా ఫలితాలే కాంగ్రెస్‌కి వస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌లు చాలా మంది అసలు ప్రచారంలోనే పాల్గొనలేదు. ప్రధానంగా ప్రియాంకగాంధీ అసలు మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారానికే రాలేదు. స్టార్ క్యాంపెయినర్‌గా రెండు రాష్ట్రాల్లో ఏదో ఒకదానిలో అయినా ప్రియాంక ప్రచారానికి వస్తారని భావించారు. కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు కూడా అంతగా ఆసక్తి చూపించలేదు. ఒకే ఒక ర్యాలీలో ఆమె పాల్గొనాల్సి ఉండగా.. చివరి సమయంలో అనారోగ్యం కారణంగా రద్దయ్యింది. ఆమె స్థానంలో రాహుల్ ప్రచారానికి వెళ్లారు. అయితే రాహుల్ మొత్తం ఏడు ర్యాలీల్లో పాల్గొన్నారు. హర్యానాలో మూడు, మహారాష్ట్రలో నాలుగింటికి హాజరయ్యారు.

### 25 ర్యాలీల్లో మోడీ ముందంజ

కాంగ్రెస్ ప్రచారానికి, భాజపా ప్రచారానికి చాలా తేడా ఉంది. ప్రధాని 25 ర్యాలీల్లో పాల్గొన్నారు. అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా కొన్ని ర్యాలీల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్, గాంధీ కుటుం బాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రధాని విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ మాజీ అధ్యక్షుడిపై ఎలాంటి విమర్శలు ప్రధాని గుప్పించలేదు. అయితే రాహుల్ మాత్రం ప్రచారంలో అంతగా ఆకట్టుకోలేకపోయారు. రెండు రోజుల క్రితం మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, ఆర్థిక మందగమనం ఉద్దేశించి భాజపాపై ధ్వజమెత్తారు. వీర్ సావర్కర్, ఆర్టికల్ 370 రద్దు అంశంపై కూడా మన్మోహన్ స్పందించారు. ప్రియాంకగాంధీ ఉత్తర్‌ప్రదేశ్‌పై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టిన ట్టు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో యూపీ బయట ఆమె ప్రచారం చేశారు. కానీ ఈ సారి మాత్రం యూపీలో కాంగ్రెస్‌ను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. జాతీయ సమస్యలను ప్రధానం గా భాజపా ప్రచార అస్త్రంగా వాడుకుంది. మెడిటేషన్ కోసం రాహుల్ గాంధీ కంబోడియా వెళ్లిపోయారని, కానీ ప్రచారం చేయాల్సిందిగా సోనియా గాంధీ కోరడంతో తిరిగి వచ్చినట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి కేవలం రాహుల్ అత్యధిక ర్యాలీల్లో పాల్గొన్నారు.రాహుల్ గాంధీ, హర్యానా మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడాతో వేదికను పంచుకోలేదు. ఇక ముంబైలో రాహుల్ గాంధీ పాల్గొన్న రెండు ర్యాలీల్లో కాంగ్రెస్ నేతలు సంజయ్ నిరుపమ్, మిలింద్ డియోరా పాల్గొనకపోవడం గమనార్హం.



# కోహ్లీకి విశ్రాంతి!



**న్యూఢిల్లీ :** నవంబర్ 3నుంచి బంగ్లాదేశ్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌నుంచి కెప్టెన్ విరాట్ కోహ్లీకి విశ్రాంతి కల్పించనున్నట్టు సమాచారం. గత ఏడాది అక్టోబర్ నుంచి కోహ్లీ దాదాపు అన్ని మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. భారత్ ఆడిన గత 56 మ్యాచ్‌లలో కోహ్లీ 48 మ్యాచ్‌లలో పాల్గొన్నాడు. బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు ఈనెల 24న జట్టును ఎంపిక చేయనున్నారు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టు ముగిసిన అనంతరం సెలెక్టర్లు కోహ్లీ ఎంపికపై నిర్ణయం తీసుకుంటారని బోర్డు సన్నిహిత వర్గాలు తెలిపాయి. కోహ్లీకూడా ఈ విషయమై తన సంసిద్ధతపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటాడని ఆ వర్గాలు పేర్కొన్నాయి. బంగ్లాదేశ్‌తో నవంబర్ 7-10 తేదీల మధ్య ఢిల్లీ, రాజ్‌కోట్, నాగపూర్‌లలో మూడు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. అనంతరం నవంబర్ 14నుంచి ఇండోర్‌లో తొలి టెస్టు, నవంబర్ 22నుంచి కోల్‌కతాలో రెండో టెస్టు జరుగుతాయి. డిసెంబర్‌లో వెస్టిండీస్‌తో ఇండియా స్వదేశంలో మూడు టి20, మూడు వన్డేలలో తలపడనున్నది.

## పొమ్మన్నారు.. కాదన్నాడు

**కరాచి :** కెప్టెన్సీనుంచి గౌరవంగా తప్పుకునే అవకాశాన్ని పాక్ కీపర్ బ్యాట్స్‌మన్ సర్ఫరాజ్ అహ్మద్ కోల్పోయాడు. శుక్రవారం అతనిని పదవికి రాజీనామా చేయమని బోర్డు సీఈవో వాసిం ఖాన్ సూచించినపుడు అందుకు సర్ఫరాజ్ నిరాకరించాడని సమాచారం. అందుకే బోర్డు అతనిపై వేటు వేసింది. 2017నుంచి మూడు ఫార్మాట్లలో కెప్టెన్‌గా విఫలమైన సర్ఫరాజ్ ఇటీవలి శ్రీలంక జట్టు చేతిలో సిరీస్ ఓడిపోవడం అతనిపై తీవ్రస్థాయిలో విమర్శలు చెలరేగాయి. దీనితో బోర్డు నాయకత్వంనుంచి అతనిని తప్పించింది. అంతేగాక త్వరలో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనున్న పాక్ టి20, టెస్టు జట్టులోనూ అతనికి స్థానం కల్పించలేదు. అతని స్థానంలో కీపర్ బ్యాట్స్‌మెన్ మహ్మద్ రిజ్వాన్‌కు జట్టులో చేర్చారు. కాగా సర్ఫరాజ్ తిరిగి ఫామ్‌ను అందిపుచ్చుకుంటే జట్టులో చోటు దక్కించుకునే అవకాశం ఉందని పాక్ బోర్డు వర్గాలు తెలిపాయి. సర్ఫరాజ్‌ను కెప్టెన్సీనుంచి, జట్టునుంచి తప్పించడం బాధాకరమైనా పాక్ క్రికెట్ ప్రయోజనాలకోసం కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదని పాక్ బోర్డు ఛైర్మన్ ఇహసాన్ మణి వ్యాఖ్యానించారు.

## సెమీస్‌లో ముర్రే

**ఆంట్వెర్ప్ :** ప్రపంచ మాజీ నంబర్‌వన్ ఆండీ ముర్రే ఇక్కడ జరుగుతున్న ఏటీపీ టెన్నిస్ టోర్నీలో సెమీఫైనల్స్ కు చేరుకున్నాడు. 2017 ఫ్రెంచ్ ఓపెన్ తరువాత ముర్రే ఒక టోర్నీలో సెమస్‌కు చేరుకోవడం ఇదే ప్రథమం. ఈ ఏడాది శస్త్ర చికిత్స అనంతరం తిరిగి పుంజుకునేందుకు ప్రయ త్నిస్తున్న 32 ఏళ్ల ముర్రే క్వార్టర్‌ఫైనల్లో క్వాలిఫయర్ మారియస్ కోపిల్ (రొమేనియా)పై 6-3, 6-7(7), 6-4తో విజయం సాధించాడు. 2017 మార్చి తరువాత టైటిల్ సాధించేందుకు ముర్రే మరో రెండు విజయాల దూరంలో నిలిచాడు. ప్రస్తుతం 243వ ర్యాంక్‌లో ఉన్న ముర్రే సెమీస్‌లో 70వ ర్యాంకర్ యుగో హంబర్ట్‌ను ఎదుర్కొంటాడు. హంబర్ట్ క్వార్టర్స్‌లో 5-7, 6-4, 6-4తో 5వ సీడ్ గుయిడొ పెల్లాను ఓడించాడు.

## రొనాల్డోసింగ్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ :** ఆసియన్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్ లో భారత క్రీడాకారుడు రొనాల్డో సింగ్ స్వర్ణం సాధించాడు. దక్షిణ కొరియాలోని ఇంచియాన్ నగరంలో జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో జూనియర్ పురుషుల కీరన్ విభాగంలో రొనాల్డో స్వర్ణం గెలుచుకోగా మరో భారత ఆటగాడు జేమ్స్ సింగ్ కాంస్యం గెలుచుకుంటాడు. వీరితోపాటు జూనియర్ పురుషుల, మహిళల స్ప్రింట్ విభాగంలో రెండు కాంస్యాలు భారత్‌కు దక్కాయి. పతక విజేతలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(శాయ్) అభినందనలు తెలిపింది.

### 1

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి బ్యాట్స్‌మన్‌గా అంపైర్ నిర్ణయ పునః సమీక్ష పద్ధతి (డీఆర్ఎస్) కలిసి రావడంలేదు. గత రెండేళ్లుగా టెస్టుల్లో సమీక్ష కోరిన ప్రతిసారి విఫలమవుతున్నాడు. శనివారం సౌతాఫ్రికాతో జరిగిన చివరి టెస్టులో బ్యాటింగ్‌కు దిగిన కోహ్లీ 12 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యాడు. సఫారీ పేసర్ ఆన్రిచ్ వేసిన బంతికి కోహ్లీ ఎల్బీడబ్ల్యూగా వికెట్ల ముందు దొరికిపోయాడు. దీంతో కోహ్లీ క్రీజులో ఉన్న రోహిత్ శర్మతో చర్చించి అంపైర్ నిర్ణయంపై సమీక్ష కోరాడు. అయితే బంతి స్వల్పంగా లెగ్ వికెట్ బెయిల్‌ను తాకుతున్నట్లు రిప్లేలో కనిపించింది. దీంతో కోహ్లీ మరోసారి నిరాశగా వెనుదిరిగాడు. అయితే 2017 నుంచి ఇప్పటివరకు కోహ్లీ తన వ్యక్తిగత ఔట్లపై 9 సార్లు డీఆర్ఎస్‌కు వెళ్లగా అతనికి ప్రతిసారి నిరాశే ఎదురైంది.

### 2

ఓపెనర్‌గా అరంగేట్రం చేసిన టెస్టు సిరీస్‌లోనే రోహిత్ శర్మ ఎన్నో రికార్డులను తిరగ రాస్తున్నాడు. ఓపెనర్‌గా తొలి టెస్టులోనే రెండు ఇన్నింగ్స్‌లలో వరుసగా శతకాలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మన్‌గా చరిత్ర సృష్టించిన రోహిత్ ఇప్పుడు మూడో టెస్టులో మళ్లీ సెంచరీ సాధించి ఈ సిరీస్ మూడో శతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఫలితంగా టీమిండియా తరఫున ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన ఓపెనర్లలో రోహిత్ రెండో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో టీమిండియా దిగ్గజ మాజీ ఓపెనర్ సునీల్ గవాస్కర్ (4 సెంచరీలు) మొదటి స్థానంలో ఉన్నాడు. గవాస్కర్ రెండుసార్లు ఈ ఫీట్‌ను సాధించాడు. మరోసారి ఓపెనర్‌గా సిరీస్‌లో మూడు శతకాలు నమోదు చేశాడు. ఇప్పుడు రోహిత్ (3 సెంచరీలు) అతని తర్వాత స్థానాన్ని ఆక్రమించాడు.

### 4

సౌతాఫ్రికాతో శనివారం జరిగిన చివరి టెస్టులో మొదటి రోజు అద్భుతమైన బ్యాటింగ్‌తో రాణించిన రోహిత్ శర్మ, అజింక్య రహానెల జోడీ కొత్త రికార్డును నెలకొల్పింది. తొలి రోజు అజేయంగా 185 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన రోహిత్-రహానెలు సఫారీలపై 4వ వికెట్‌కు అత్యధిక పరుగులు సాధించిన భారత జంటగా నయా రికార్డు సృష్టించారు. పుణె టెస్టులో నాలుగోవికెట్‌కు విరాట్ కోహ్లీ-రహానెలు నెల కొల్పిన 178 పరుగుల రికార్డును తాజాగా వీరు బద్దలు కొట్టారు. 1996/97 సిరీస్‌లో 145 పరుగులు చేసిన రాహుల్ ద్రవిడ్-సౌరభ్ గంగూలీ జోడీ మూడో స్థానంలో ఉంది.

### 58

భారత్, సౌతాఫ్రికా జట్ల మధ్య శనివారం మొదలైన చివరి టెస్టుకు తొలి రోజు వర్షం దెబ్బతోపాటు వెలుతురులేమి తోడైంది. దీంతో తొలి రోజు 58 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలినా తర్వాత రోహిత్ శర్మ, రహానెలు చిరస్మరణీయ బ్యాటింగ్‌తో జట్టును పటిష్ట స్థితికి చేర్చారు. ఈ క్రమంలోనే టీమిండియా 58 ఓవర్లలో 224/3 పరుగులు చేసింది. కానీ ఆదే సమయంలో ఎంట్రీ ఇచ్చిన వరుణుడు మ్యాచ్‌కు ఆటంకం కలిగించాడు. దానికి తోడు వెలుతురేమి కారణంగా మ్యాచ్ చాలా సేపు నిలిచిపోయింది. చివరికి అంపైర్లు తొలి రోజు ఆటను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో 32 ఓవర్లు మిగిలి ఉండగానే శనివారం ఆట ముగిసింది. ఇక నేడు కూడా వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉందని, వెలుతురులేమి ప్రభావం కూడా ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది.





## సిక్సర్ల రికార్డు..

సఫారీలతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో టీమిండియా నయా టెస్టు ఓపెనర్ రోహిత్ శర్మ మరో కొత్త ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. రాంచీ వేదికగా శనివారం ప్రారంభమైన చివరి టెస్టులో ఓపెనర్‌గా బరిలోకి దిగిన రోహిత్ శర్మ అజేయ శతకంతో మెరిశాడు. ఈ క్రమంలోనే ఒక టెస్టు సిరీస్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాట్స్‌మన్‌గా రోహిత్ కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఈ మ్యాచ్‌లో మూడో సిక్సు కొట్టిన రోహిత్ ప్రస్తుత సిరీస్‌లో 16వ సిక్స్‌ను నమోదు చేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ ఇప్పటివరకు మొత్తం 4 సిక్స్‌లు సాధించాడు. ఫలితంగా వెస్టిండీస్ బ్యాట్స్‌మన్ హెయిట్మేర్ పేరిట ఉన్న ఒకే సిరీస్‌లో అత్యధిక సిక్సర్ల(15) రికార్డును రోహిత్ బ్రేక్ చేశాడు.

# రోహిత్ శతకొట్టాడు

**అండగా నిలిచిన రహానె**

**తొలి రోజు వరుణుడు, వెలుతురు లేమి అడ్డంకి**

**32 ఓవర్ల ముందే ఆట నిలిపివేత**

**సౌతాఫ్రికాతో చివరి టెస్టు : భారత్ 224/3**

**రాంచీ:** సౌతాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులో టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ మరోసారి అద్భుతమైన బ్యాటింగ్‌తో సత్తా చాటుకున్నాడు. ఈ సిరీస్‌లో మంచి ఫామ్‌ను ప్రదర్శిస్తున్న హిట్‌మ్యాన్ రోహిత్ దూకుడైన బ్యాటింగ్‌తో మరోసారి సఫారీ బౌలర్ల భరతం పట్టాడు. ఇతనికి వైస్ కెప్టెన్ అజింక్య రహానె తోడవడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 224/3 స్కోరు చేసింది. 39 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన టీమిండియాను ఓపెనర్ రోహిత్ శర్మ (117 బ్యాటింగ్; 164 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సులు), అజింక్య రహానె (83 బ్యాటింగ్; 135 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) సూపర్బ్ బ్యాటింగ్‌తో ఆదుకున్నారు. బాధ్యతగా ఆడిన రోహిత్.. మయాంక్, పుజారా, కోహ్లీలు విఫలమైనా రహానెతో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు అజేయంగా 185 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అనంతరం వర్షం, వెలుతురులేమితో తొలి రోజు ఆట 32 ఓవర్ల ముందే నిలిచిపోయింది. 58 ఓవర్లలో భారత్ 3 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది.

### ఆదిలోనే ఎదురుదెబ్బలు..

రాంచీ వేదికగా శనివారం మొదలైన చివరి టెస్టులో టాస్ గెలిచిన భారత్ ముందు బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ సారి టీమిండియాకు ఆరంభం కలిసి రాలేదు. గత మ్యాచుల్లో చెలరేగి ఆడిన ఓపెనింగ్ జోడీ ఈమ్యాచ్‌లో భారీ భాగస్వామ్యం నమోదు చేయడంలో విఫలమైంది. రెండు ఫోర్లతో ధాటిగా ఇన్నింగ్స్ ఆరంభించిన మయాంక్ 10 పరుగులకే రబాడ బౌలింగ్‌లో ఎల్గర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో 12 పరుగులకే టీమిండియా తొలి వికెట్‌ను చేజార్చుకుంది. అనంతరం క్రీజులోకి వచ్చిన మిస్టర్ డిపెండబుల్ చతేశ్వర్ పుజారా (0) 9 బంతులు ఆడినా ఖాతా తెరవకుండానే వెనుతిరిగాడు. సఫారీ పేసర్ రబాడ మరో అద్భుతమైన బంతితో ఎల్బీడబ్ల్యూగా వికెట్ దక్కించుకున్నాడు. తర్వాత వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లీ (12) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేక పోయాడు. పేసర్ నోర్జే బౌలింగ్‌లో కోహ్లీ ఎల్బీగా వెను దిరిగాడు. రివ్యూ కోరినా లాభంలేకుండా పోయింది. దీంతో టీమిండియా 39 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

### స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: మయాంక్ అగర్వాల్ (సి) ఎల్గర్ (బి) రబాడ 10, రోహిత్ శర్మ (బ్యాటింగ్) 117, పుజారా (ఎల్బీ) రబాడ 0, విరాట్ కోహ్లీ (ఎల్బీ) నోర్జే 12, రహానే (బ్యాటింగ్) 83; ఎక్స్‌ట్రాలు: 2, మొత్తం (58 ఓవర్లలో) 224/3.

వికెట్ల పతనం: 1-12, 2-16, 3-39.

బౌలింగ్: కగిసో రబాడా 14-5-54-2, లుంగి ఎంగిడి 11-4-36-0, ఆన్రిచ్ నోర్జే 16-3-50-1, జార్జ్ లిండే 11-1-40-0, డేన్ పీడ్ 6-0-43-0.

### ఆదుకున్న రోహిత్, రహానె..

ఈ దశలో రోహిత్ శర్మ, అజింక్య రహానెలు చిరస్మరణీయ బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు. సఫారీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ సింగిల్స్, డబుల్స్‌తో స్కోరుబోర్డును ముందుకు నడిపించారు. పిచ్‌పై నిలదొక్కున్నతర్వాత పరుగుల వేగాన్ని పెంచి బౌండరీల వర్షం మొదలెట్టారు. ఈ క్రమంలోనే వీరు నాలుగో వికెట్‌కు 128 బంతుల్లో 100 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. అనంతరం మరింత చెలరేగిన రోహిత్ ఫోర్లు, సిక్సర్లతో సఫారీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలోనే స్పిన్నర్ పీడ్ బౌలింగ్‌లో రోహిత్ కళ్లు చెదిరే సిక్సర్‌తో టెస్టుల్లో ఆరో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. రోహిత్ 130 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్సుల సహాయంతో ఈ సిరీస్‌లో మూడో సెంచరీని నమోదు చేసుకున్నాడు. మరోవైపు ధాటిగా ఆడుతున్న వైస్ కెప్టెన్ రహానె కూడా 70 బంతుల్లో 8 ఫోర్లతో హాఫ్ సెంచరీ సాధించాడు. ఈ జోడీని విడదీయడానికి సఫారీ బౌలర్లు ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. ఈ దశలోనే టీమిండియా 48.4 ఓవర్లలో 200 పరుగుల మైలురాయిని అందుకుంది. తర్వాత వర్షం, వెలుతురులేమి కారణంగా 58 ఓవర్ల వద్ద ఆటను నిలిపివేశారు. అప్పటికి భారత్ 224/3 స్కోరు చేసింది. అనంతరం తొలి రోజు ఆటను నిలిపివేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. రోహిత్ శర్మ (117 బ్యాటింగ్), రహానె (83 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. సఫారీ బౌలర్లలో రబాడ రెండు వికెట్లు తీయగా.. ఆన్రిచ్ నోర్జేకు ఒక వికెట్ దక్కింది.

# జరీన్‌తో పోరుకు నేను రెడీ

**ఎవరికీ భయపడను : మేరీకోమ్**



**న్యూఢిల్లీ :** తన ఎంపికను ప్రశ్నిస్తున్న నిఖత్ జరీన్‌తో పోరుకు ఎంతమాత్రం భయపడేది లేదని స్టార్ బాక్సర్ మేరీ కోమ్ బదులిచ్చింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతక విజేతలను నేరుగా ఒలింపిక్స్ క్వాలిఫయర్ టోర్నీకి ఎంపిక చేయడంపై వివాదం చెలరేగింది. మహిళల 51 కిలోల విభాగంలో మేరీ కోమ్‌కు పోటీగా ఉన్న నిఖత్ గతంలోనూ తనకు అన్యాయం జరిగిందని, ఒలింపిక్‌క్వాలిఫయర్స్‌టోర్నీకి సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించేలా ఆదేశించాలని కేంద్ర క్రీడా మంత్రికి విజ్ఞప్తి చేసింది. అయితే కేంద్ర మంత్రి ఇందులో జోక్యం చేసుకునేందుకు ఆసక్తి చూపక ఆ విషయంలో భారత బాక్సింగ్ సమాఖ్యదే తుది నిర్ణయమని తేల్చి చెప్పారు. శనివారం మేరీ కోమ్‌కూడా ఇదే విషయాన్ని ధృవీకరిస్తూ సమాఖ్య నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, ట్రయల్స్ నిర్వహిస్తే పాల్గొంటానని తెలిపింది. తాను ఎవరికీ భయపడేది లేదన్నది. పతకాలు సాధించి ప్రతిభను నిరూపించుకోవాలని, విమర్శలతో కాదని మేరీ కోమ్ నిఖత్‌కు పరోక్షంగా సూచించింది. నిఖత్‌కు తాను వ్యతిరేకం కాదని, సమాఖ్య నిబంధనలకు కట్టుబడి ఉంటానని తేల్చిచెప్పింది.

## ఫైనల్లో భారత్ ఓటమి

**జొహార్ బహ్రు(మలేసియా) :** సుల్తాన్ జొహార్ కప్ హకీ టోర్నీ ఫైనల్లో భారత్ ఓటమిపాలై రన్నర్ స్థానంతో సరిపెట్టుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో భారత్ 1-2 తేడాతో బ్రిటన్ చేతిలో ఓడిపోయింది. మూడు క్వార్టర్స్ వరకు ఇరు జట్లు గోల్ సాధించడంలో విఫలమయ్యాయి. గోల్స్ అన్నీ చివరి క్వార్టర్లోనే నమోదయ్యాయి. 49వ నిమిషంలో ఇండియాకు లభించిన ఏడో పెనాల్టీ కార్నర్‌ను గురుసాహిబ్‌జిత్ సింగ్ గోల్‌గా మలిచి ఇండియాకు ఆధిక్యం అందించాడు. అయితే ఆ ఆనందం ఎంతోసేపు నిలువలేదు. మరో2 నిమిషాలకే బ్రిటన్‌కు స్టూవర్ట్ రష్మీర్ తొలి గోల్‌తో స్కోరును సమం చేసి చివరి క్షణాల్లో మరో గోల్‌తో జట్టును గెలిపించాడు.

## అమిత్ శుభారంభం

**వుహాన్(చైనా) :** శనివారం ఇక్కడ ప్రారంభమైన 7వ ప్రపంచ మిలటరీ క్రీడల్లో భారత బాక్సర్ అమిత్ పంగల్ (52కి.గ్రా.) శుభారంభం చేశాడు. ప్రపంచ చాంపియన్‌షిప్ రజత పతక విజేత పంగల్ తొలి బౌట్‌లో బ్రెజిల్‌కు చెందిన డగ్లస్ ఆండ్రేడ్‌ను 5-0 తేడాతో ఓడించాడు. ఇతర భాతర బాక్సర్లు దీపక్ (49కి.గ్రా.) ఇరాన్‌కు చెందిన అబాస్‌జాదె అలిపై, చిరాగ్(56కి.గ్రా.) జాంబియాకు చెందిన కటంగ క్రిస్టాఫర్‌పై, సతీష్ కుమార్(91ప్లస్) బ్రెజిల్‌కు చెందిన నసిమెంటొ కొస్మెపై తొలి రౌండ్ విజయాలు నమోదు చేసుకున్నారు. కాగా సందీప్ కుమార్(64కి.గ్రా.) ఉజ్బెక్ బాక్సర్‌రసులొవ్ జకొంగిర్ చేతిలో ఓడిపోయాడు. ఈ క్రీడల్లో 54మంది భారత క్రీడాకారులు 9 క్రీడాంశాల్లో పోటీపడుతున్నారు. గత చాంపియన్‌షిప్‌లో ఇండియా ఆరు పతకాలు సొంతం చేసుకుంది.

# కార్ట్ ఫైట్ విజేత రిధాఫ్

**జాతీయ కార్టింగ్ చాంపియన్‌షిప్-2019**



రిధాఫ్‌కు అబుదాబి గ్రాండ్‌ప్రి బోర్డింగ్ పాస్‌ను అందజేస్తున్న రెడ్‌బుల్ అథ్లెట్ రేసర్ మీరా ఎర్డా. విజేతలతో మీరా ఎర్డా

**హైదరాబాద్:** నగర శివార్లలోని శామీర్‌పేటలో జరిగిన జాతీ య కార్టింగ్ చాంపియన్‌షిప్‌లో కొచ్చికి చెందిన మహమ్మద్ రిధాఫ్ విజేతగా నిలిచాడు. బెంగళూరు, చెన్నై, బరోడా లెగ్ పోటీలలో ఫైనల్స్‌కు అర్హత సాధించిన 23మంది ఫైనలిస్టులతో పోటీపడి రిధాఫ్ అగ్రస్థానం సొంతం చేసుకు న్నాడు.

12 లాప్‌లపాటు సాగిన ఫైనల్స్ పోరులో రిధాఫ్ 9ని.14.336 సెకండ్లతో ప్రథమ స్థానం పొందాడు. నిరుటి విజేత, ఢిల్లీకి చెందిన రచిత్ సింఘాల్ కేవలం 1.154 సెకండ్ల తేడాతో రెండో స్థానంలో నిలవగా, బెంగళూరు రేసర్ ప్రేమిల్ సింగ్ 9ని.16.887సె.తో మూడో స్థానంలో నిలిచాడు. విజేతగా నిలిచిన రిధాఫ్ రెడ్‌బుల్ స్పాన్సర్ చేసే అబుధాబి గ్రాండ్‌ప్రి రేస్‌ను వీక్షించే అవకాశం సొంతం చేసుకున్నాడు. అందుకు సంబంధించిన బోర్డింగ్ పాస్‌ను రెడ్‌బుల్ అథ్లెట్ రేసర్ మీరా ఎర్డా రిధాఫ్‌కు అందజేశారు. మీరా ఎర్డా ఫార్ములా4 బీఎండబ్ల్యు యూరోపా రేస్‌లో పాల్గొన్న ఏకైక భారత మహిళా రేసర్. ఈ సందర్భంగా విజేతలను మీరా ఎర్డా అభినందించారు.



# వారియర్స్.. కొత్త చాంపియన్

**ప్రొ కబడ్డీ సీజన్-7 ఫైనల్స్**

**అహ్మదాబాద్ :** ప్రొ కబడ్డీ ఏడో సీజన్‌లో బెంగాల్ వారియర్స్ నూతన విజేతగా అవతరించింది. శనివారం జరిగిన ఫైనల్లో వారియర్స్ 39-34 స్కోరుతో దబాంగ్ ఢిల్లీని ఓడించి టైటిల్ అందుకుంది. దబాంగ్ జట్టులో నవీన్‌కుమార్ అత్యధికంగా 18 పాయింట్లు సాధించినా జట్టును గెలిపించలేకపోయాడు. విరామ సమయానికి 17-17తో ఇరు జట్లు సమానంగా నిలిచినా ద్వితీయార్ధంలో బెంగాల్ పుంజుకుని అయిదు పాయింట్ల తేడాతో విజయాన్నం దుకుంది. బెంగాల్ జట్టులో మొహమ్మద్ నబీబక్ష్ 10 పాయింట్లు సాధించగా, సుకేష్ హెగ్డె 8, రవీంద్ర రమేష్ కుమావత్ 6, జీవకుమార్ 4, బల్దేవ్ సింగ్, రింకు నర్వాల్ చెరి రెండు పాయింట్లతో సహకరించారు. ఢిల్లీ జట్టులో నవీన్‌కుమార్ 24సార్లు రెయిడింగ్‌కు వెళ్లి 18 పాయింట్లు సాధించాడు. ఇతర ఆటగాళ్లలో అనిల్‌కుమార్, విజయ్ చెరో 3, చంద్రన్ రంజిత్, మీరజ్ షేక్ చెరో 2 పాయింట్లు సాధించారు. రెయిండింగ్‌లో ఢిల్లీ జట్టు 27-22తో పైచేయి సాధించగా, టాకిలింగ్‌లో బెంగాల్ 10-3తో ఆధిక్యం ప్రదర్శించింది. ఢిల్లీ మూడుసార్లు ఆలౌటవడంకూడా బెంగాల్‌కు లాభించింది. బెంగాల్ ఒకసారి ఆలౌటయింది. లీగ్ దశలో 85 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన ఢిల్లీ జట్టు ఫైనల్లో రెండో స్థానంలోని బెంగాల్ చేతిలో ఓడి రన్నర్ స్థానంతో సరిపెట్టుకుంది.



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

epaper.prabhanews.com



అదృష్టానికి శ్రమ తోడయితే విజయం సాధించడం ఒక అలవాటుగా మారుతుంది. అలా విజయానికి సన్నిహితురాలైంది బాలీవుడ్ తార కృతి సనన్. ప్రాంతీయ సినిమా ఆమెకు కలిసి రాకున్నా, హిందీ చిత్ర పరిశ్రమ ఈ నవనాయిక ప్రతిభను భుజా లకు ఎత్తుకుంది. ఆదరణ పొందుతున్న సినిమాలతో కృతి ఇప్పుడు అగ్రతార స్థాయిలో ఉంది. ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే అపజయాలు ఎదురైనా, అడుగు ముందుకే వేసింది కృతి. ఐదేళ్లుగా బాలీవుడ్‌లో స్థిరంగా నట ప్రయాణం కొనసాగిస్తోంది. ఇటీవలే హౌస్‌ఫుల్ 4 చిత్రంతో దేశవ్యాప్తంగా ప్రేక్షకులను రాజక ుమారి మధు పాత్రలో పలకరించిన కృతి సనన్ కెరీర్ విశేషాలు ఆంధ్రప్రభ లైఫ్‌లో... మీకోసం

# అతను నన్ను... డేటింగ్ చేయనివ్వడు..

\- కృతి సనన్

నటిగా మారాలని కలలుగన్న అమ్మాయిని నేను. ఢిల్లీ స్వస్థలం. చలన చిత్ర పురస్కార కార్య క్రమాలు టీవీలో ప్రసారమ వుతుంటే ఆసక్తిగా చూసేదాన్ని. ఇవాళ నేనూ అలాంటి తారల్లో ఒకరిగా మారాను. ఇంకా ఇదంతా కలగానే ఉంది. నేను చూసిన ఈ కొద్ది అనుభ వంలో ఎంతోమంది గొప్పవాళ్లతో కలిసి పనిచేశాను. ఈ ప్రయా ణంలో కొందరు మంచి స్నేహితులయ్యారు. మొద ట్లో భయమేసింది. కానీ ఇప్పుడిప్పుడే కాస్త కుదురుకుంటున్నా అనిపిస్తోంది. నటిగా నా చుట్టూ ఉన్న హద్దులు చెరిపేయాలి. మూసకు భిన్నంగా నటించాలి. ఒక గొప్ప కథ విన్నప్పుడు ఉద్వేగానికి గురవుతుంటా. ప్రతిసారీ నటనను పాత్రను ఎంతో ప్రేమిస్తూ కెమెరా ముందుకు వెళ్తాను.

## ఇప్పుడు నమ్ముతున్నారు...

ఇక్కడ విజయమే మనకో గుర్తింపు తీసుకొస్తుంది. 'బరేలీకి బర్ఫీ' సినిమా నాకు అలాంటి గుర్తింపు ఇచ్చింది. ఈ సిని మాకు ముందు కృతి నటించగలదా అనే సందేహాలు అందరిలో ఉండేవి. అది తప్పు కాదు. మనల్ని మనం నిరూపించుకునే వరకు ఎవరైనా ఎలా నమ్ము తారు. 'బరేలీకి బర్ఫీ' విజయం సాధించాక... నటిగా చూస్తున్నారు. 'రబ్తా' సినిమాలో కూడా బాగా నటించాను. అయితే ఆ సినిమా ఆదరణ పొం దలేదు. 'లూకా చుప్పీ' బాక్సాఫీస్ హిట్ అయ్యింది. ఈ చిత్రం సాధించిన వసూళ్లు నటిగా నా స్థాయిని పెంచాయి. నేను స్టార్ అవ్వాలనే అనుకున్నా, అయితే నటిగానూ పేరు తెచ్చుకోవాలి. ఇప్పుడు నన్నంతా నమ్ముతున్నారు. ఓ క్లిష్టమైన పాత్రలో కూడా కృతి మెప్పించగలదు... అనుకుంటున్నారు. నాయిక ప్రధాన చిత్రాలకూ సంప్రదిస్తున్నారు. హాస్య పాత్రల్లో మెప్పించడం కష్టం. అయితే కథలో మంచి సందర్భాలుంటే కొంత సులువవుతుంది. అక్షయ్ కుమార్‌కు కామెడీ టైమింగ్ చాలా ఎక్కువ. సెట్స్ లోనే కాదు బయట కూడా బాగా నవ్విస్తారు.

## వారానికో మార్పు..

ప్రణాళికలు లేనప్పుడు అంచనాలూ ఉండవు. అతి పెద్దదైన ఈ పరిశ్రమలో నాకంటూ స్థానం ఉంటుందని ఆశించాను. ఎలాంటి వారసత్వం, సినిమా నేపథ్యం లేకుండా ఇక్కడికి వచ్చాను కాబట్టి నాకు నేనుగా ఎదగాలి.. అని బలంగా నమ్మాను. ఇది చాలా కష్టమని నాకు తెలుసు. చిత్ర పరిశ్రమలో ప్రతివారం మన తలరాత మారుతుం టుంది. అయితే అవకాశాలు వస్తాయని, నా ప్రతిభని చూపించగలనని నమ్మాను. భిన్నమైన పాత్రలు చేస్తూ కష్టపడుతుంటే ఎక్కువ కాలం కొనసాగుతాం అనేది నిజం. నాతో పాటే నటుడిగా పరిచయం అయ్యారు టైగర్ ష్రాఫ్. ఇద్దరం కలిసే ప్రేక్షకుల ముందుకొచ్చాం. అతని కష్టం నాకు తెలుసు. మంచి మనసున్న వాడు.



## యుద్ధ కథలో..

పానిపట్ యుద్ధం ఆధారంగా రూపొందిస్తున్న సినిమా పానిపట్. ఈ చిత్రం నాకు పూర్తిగా కొత్త లోకంగా కనిపిస్తోంది. ఉత్తరాది అమ్మాయినైన నాకు మరాఠా యువతిగా నటించడం సవాలుగా అనిపిస్తోంది.

అయితే దర్శకుడు అషుతోష్ గోవారికర్ బాగా సహకారం అందిస్తున్నారు. ఆయన సహకారంతో నటించడాన్ని ఆస్వాదిస్తున్నాను. పార్వతీ బాయి అనే పాత్రలో నటిస్తున్నాను. ఈ పాత్ర చాలా బలమైనది. స్వేచ్ఛగా తన అభిప్రాయాలు చెప్పి, ప్రవర్తించే స్వభావంతో ఉంటుంది.

## అన్నీ ముఖ్యమే...

ప్రతి చిత్రానికి భారీ వసూళ్లు రావడం సంతోషాన్నిచ్చే విషయమే. వంద కోట్ల క్లబ్‌లో సినిమా చేరడం ఆనందమే... అయినా వసూళ్లు ఒక్కటే ప్రాధాన్యం కాదు. సినిమా నిర్మాణ వ్యయంతో పోల్చితే మంచి లాభాలు తీసుకురావాలి. ప్రేక్షకులకు వినోదాన్ని అందించాలి. పరిశ్రమలో ఎవరూ తెలియకుండా నటిగా అరంగేట్రం చేశాను. ఇప్పుడు నాకంటూ ఓ దారి ఏర్పరచుకున్నాను. పరిశ్రమ, ప్రేక్షకులు నటిగా నన్ను అంగీకరించారని భావిస్తున్నాను. గ్రామీణ యువతిగా నేను సరిపోను... అనేవారికి 'బరేలీకి బర్ఫీ' సమాధానమిచ్చింది. నేను ఎంత బాగా నటిం చినా.. సినిమా విజయం సాధించినప్పుడే ప్రశంసలు దక్కుతాయి. సినిమాల ఎంపికలో ధైర్యాన్ని ప్రదర్శిస్తుంటాను. ఏఏ దర్శకులతో పనిచేయాలి... అనే జాబితా నా దగ్గర ఉంది. త్వరలో ఒక్కొక్కరితో పనిచేయాలని ఆశిస్తున్నా.

## విభిన్నత ఉండాలి..

ఒక తరహా చిత్రాలే నాకు బాగుంటాయని ఎప్పుడూ అనుకోలేదు. నేను వరుసగా వినోదాత్మక చిత్రాల్లో నటిస్తున్నానని ఒప్పుకుంటాను. నా గత చిత్రం 'బరేలీ కి బర్ఫీ' హాస్య చిత్రమే. అది విజయం సాధించడంతో నాకన్నీ అలాంటి చిత్రాలే వస్తున్నాయి. అయితే ఇవన్నీ వినోదాత్మక చిత్రాలైనా ఒకే తరహా కథలు కాదు. వేటికవి భిన్నమైనవి. నటిగా నేనూ ప్రతి చిత్రానికీ వైవిధ్యం చూపించాలి అనుకుంటున్నాను. ఈ సినిమాల్లో నటిస్తున్నప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. పాత్రలూ అలాంటివే. కాబట్టి మరింత సహజంగా ఆ కథల్లో కనిపిస్తాను.

## పుస్తకాలు చదువుతూ..

చిత్రీకరణలతో తీరిక లేకుండా ఉండటం వల్ల నాకిష్టమైన పుస్తకాలు చదవడం కుదరడం లేదు. నేను పుస్తకాల పురుగును. ఏమాత్రం సమయం ఉన్నా చదివేస్తుంటా. ప్రయాణాల్లో, చిత్రీకరణ విరామంలో పేజీలు తిరగేస్తుంటా. నేను చదవడమే కాదు మంచి పుస్తకాలను స్నేహితులకు కానుకగా ఇస్తుంటాను. నాకూ కొన్ని పుస్తకాలు బహుమతులుగా వచ్చాయి. నా అభిరుచి తెలిసిన ఓ దర్శకుడు 'లవ్ స్టోరీ' అనే పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చాడు. ప్రస్తుతం ఆ ప్రేమ పుస్తకం చదువుతున్నా.

## డేటింగ్ చేస్తానంటే..

నా సహ నటుడు వరుణ్ ధావన్ నా విషయంలో చాలా శ్రద్ధ తీసుకుంటాడు. నేను డేటింగ్ చేద్దామని అనుకున్నా. కానీ తను చేయనివ్వడు. నేను రేపు ఎవరితోనైనా డేటింగ్‌కు వెళ్తే...ఆ విషయం అతనికి చెప్పాలా వద్దా అని సందేహిస్తుంటాను. ఒకవేళ నేను సహజీవనం చేస్తే ఆ విషయం నా సన్నిహి తులకు మాత్రమే తెలియాలనుకుం టాను. ఎవరో అపరిచితులకు మా విషయాలు చెప్పి, మా సంబంధం మంచిదా కాదా అని నిర్ణయించే అవకాశం వాళ్లకు ఇవ్వకూడదు.

## పారితోషకం పెంచేసింది...

✓ 'లూకా చుప్పీ' ప్రేక్షకాదరణ దక్కించుకుని గొప్ప విజయాన్ని అందుకుంది. ఈ సినిమా వంద కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు రాబట్టింది. లూకా చుప్పీ విజయంతో కృతికి బాగా పేరొచ్చింది. అప్పటిదాకా ఇచ్చినంత తీసుకుంటూ వచ్చిన కృతి... ఒక్కసారిగా తన పారితోషికంలో 40 శాతం దాకా పెంచేసిందట.

✓ మరో ఆసక్తికరమైన చిత్రాన్ని దక్కించుకుంది కృతి సనన్. అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్న 'బచ్చన్ పాండే' అనే చిత్రంలో నాయికగా ఎంపికైంది. హౌస్‌ఫుల్ 4 తర్వాత అక్షయ్‌తో కృతి కలిసి నటిస్తున్న మరో చిత్రమిది. 'బచ్చన్ పాండే' ఆమెకు మరింత పేరు తెచ్చే అవకాశాలున్నాయి. మాస్ మసాలా కథాంశంతో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. ఫర్హాద్ సమ్జీ దర్శకత్వం వహిస్తున్నారు. సాజిద్ నడియావాలా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది క్రిస్టమస్‌కు 'బచ్చన్ పాండే' ప్రేక్షకుల ముందుకు రానుంది.

## రీమేక్ సినిమాలు కష్టం

రీమేకుల్లో నటించడం చాలా కష్టం. నటనలో శిక్షణ ఇచ్చేవాళ్లు ఒక పాత్రను పది రకాలుగా చేయాలని అడుగుతారు. ఇదీ అలాంటిదే. ఒక భాషలో తీసిన సినిమాలోని పాత్రను మరో భాషాచిత్రంలోనూ యథా తథంగా చేస్తాం. అ యితే అలాంటప్పుడు మరో భాషలోనూ కొత్తగా, మాతృకకు భిన్నంగా నటించాలని ప్రయత్నిస్తాను. మల్టీస్టారర్ చిత్రాలు చేయడంలో అభద్రతా భావమేదీ లేదు. అలా భయపడితే ఏ సినిమాలో నటించలేం. నటనలోనే కాదు వ్యక్తిగత జీవితంలోనూ ముందుకు సాగలేం.

## ఆ చిత్రాలు ఇప్పుడు కాదు...

నాయిక ప్రధాన చిత్రాలకు ఇప్పుడే సరిపోను. కథను ఒక్కదాన్నే మోయడం నా వల్ల కాదు. ఇంకొంత అనుభవం వచ్చాకే నాయిక ప్రధాన చిత్రాలు చేస్తాను. నాకు నచ్చాయని నాయిక ప్రధాన చిత్రాలు చేస్తే వాటి ఫలితం అంతగా రాకపోవచ్చు. దాని వల్ల నిర్మాత నష్టపోతాడు. నా వల్ల ఎవరూ ఇబ్బంది పడకూడదు.

\- రమేష్ గోపిశెట్టి

---

యోగా లైఫ్

# మేనుకి... ఎంతో మేలు!

- ❍ జీర్ణవ్యవస్థకు..సువర్ణాసనం
- ❍ మోకాళ్ల కదలికలు సులువు
- ❍ ముఖం కాంతిమంతం

## అర్ధ బద్ధ పద్మోత్తానాసనం

రెండు కాళ్లను దగ్గరగా ఉంచి నిటారుగా నిలబడాలి. శ్వాస తీసుకొని కుడికాలుని మోకాలి వద్ద మడిచి...చిత్రంలో చూపినట్టుగా ఎడమ మోకాలిపై ఉంచాలి. ఎడమ చేత్తో కుడి పాదాన్ని పట్టుకోవాలి. కుడిచేతిని వీపు వెనుక నుంచి తీసుకొని వచ్చి కుడిపాదాన్ని పట్టుకోవాలి. ఇప్పుడు కుడిపాదాన్ని పట్టుకున్న ఎడమ చేతిని వదిలేయాలి. కుడిపాదాన్ని కుడి చేతిని అలాగే ఉంచి... శ్వాసని వదులుతూ శరీరాన్ని ముందుకు వంచి ఎడమ చేత్తో ఎడమ పాదం తాకాలి. ఇదే స్థితిలో ఉండి రెండు మూడు శ్వాసలు తీసుకున్నాక... పైకి లేవాలి. ఇదే విధంగా కాళ్లు చేతులు మార్చుతూ రెండవ వైపున కూడా చేయాలి.



### ప్రయోజనాలు

- ➧ మోకాళ్లు పట్టేయటం, బిగుసుకుపోవటం లాంటి సమస్యలు తగ్గి రిలాక్స్ అవుతాయి. నడుము కింద అన్ని భాగాల్లో కదలికలు సులువవుతాయి.
- ➧ కడుపు కండరాలు బలపడి జీర్ణశక్తి మెరుగవుతుంది. జీర్ణక్రియని నిర్వహించే అవయవాలకు ఆక్సిజన్‌తో కూడిన తాజారక్తం అందుతుంది. పేగుల్లోంచి వ్యర్థాలు, అధిక వాయువులు వంటివి బయటకు పోతాయి.
- ➧ శరీరంలో పైభాగానికి ముఖ్యంగా తలకు రక్త సరఫరా పెరుగుతుంది. దీనివలన నరాల్లోని ఒత్తిడి తగ్గుతుంది. తలకు రక్త సరఫరా పెరగటం వలన మొహంపైన చర్మానికి ఏవైనా సమస్యలు ఉంటే తగ్గుతాయి. ముఖం కాంతిమంతంగా మారుతుంది.
- ➧ భుజాలు ఛాతీభాగం విశాలమవుతాయి. భుజాలకు మంచి వ్యాయామం జరుగుతుంది. భుజాల్లో రక్త సరఫరా సైతం పెరుగుతుంది. శ్వాసక్రియ మరింత సమర్ధవంతంగా జరుగుతుంది.
- ➧ ఈ ఆసనాన్ని దీర్ఘకాలంపాటు సాధన చేయటం వలన మరెన్నో ప్రయోజనాలను పొందవచ్చు. కాళ్లకు శక్తి, అందం పెరుగుతాయి. శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వు తగ్గుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది. శరీరంలో సంతులన స్థితి పెరుగుతుంది.

ఈ ఆసనాన్ని సవ్యంగా వేయాలంటే శరీరం ఎంతో శక్తిమంతంగా, కదలికలు సులువుగా ఫ్లెక్సిబుల్‌గా ఉండాలి. అందుకే దీనిని సాధన చేయాలనుకునేవారు అంతకంటే ముందు శరీరాన్ని వంచకుండా... నిలబడి ఉన్న భంగిమ అర్ధ పద్మ వృక్షాసనం వరకు సాధన చేసి తరువాత వంగి చేతిని నేలకు నిదానంగా ఆనించే ప్రయత్నం చేయాలి.

### గమనిక:

☞ నయాటికా నొప్పి, మోకాళ్లకు గాయాలు, లేదా మోకాళ్ల జాయింట్లలో ఏదైనా సమస్య ఉన్నవారు ఈ ఆసనం వేయకూడదు.

☞ తలనొప్పి, అధిక రక్తపోటు, విరేచినాలు సమస్యలున్నవారు సైతం ఈ ఆసనం వేయరాదు.

గాయత్రి
యోగా ట్రైనర్

---

యాపిల్ ఆరోగ్యానికి మంచిదని ఎప్పటినుండో పరిశోధకులు చెబుతున్నారు. దీనిపై మరిన్ని పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. మరింత వినూత్న సమాచారం మనకు అందుతూనే ఉంది.



# యాపిల్... ఓ ఔషధాస్త్రం

నాలుగేళ్లపాటు వారి ఆహారానికి సంబంధించిన ప్రశ్నలు అడిగి సేకరించిన సమాచారం ప్రకారం... వారానికి మూడుసార్లు యాపిల్ తిన్నవారిలో మధుమేహం వచ్చే రిస్క్ ఏడుశాతం వరకు తగ్గినట్టుగా వెల్లడైంది.

➲ క్రమం తప్పకుండా యాపిల్‌ని తినటం వలన థ్రాంబోటిక్ స్ట్రోక్ (మెదడుకి రక్తాన్ని తీసుకుని వెళ్లే నాళంలో ఏర్పడే క్లాట్ వలన ఏర్పడుతుంది) వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

➲ క్రమం తప్పకుండా రోజూ తాజా యాపిల్ జ్యూస్‌ని తాగుతూ ఉంటే జ్ఞాపకశక్తి పెరుగుతుందని అమెరికాలోని మసాచుసెట్స్ లోవెల్ యూనివర్శిటీ వారి పరిశోధనలో తేలింది. యాపిల్‌ని జ్యూస్ చేసినప్పుడు అది మెదడులోని ఒక ముఖ్యమైన న్యూరోట్రాన్స్‌మీటర్ (నాడీ కణాల మధ్య లేదా నాడీ కణాలు కండరాల మధ్య సందేశాలను తీసుకుని వెళ్లే ఒక రసాయనం) ఉత్పత్తిని పెంచుతుంది. ఈ రసాయనం మతిమరుపు వ్యాధి అల్జీమర్స్‌కి గురయినవారిలో కూడా మెదడు సామర్థ్యాన్ని తగ్గిపోకుండా చేస్తుందని ఈ పరిశోధన చెబుతోంది.

➲ అల్జీమర్స్ వ్యాధి ఉన్నవారిలో మెదడు కణాలు చనిపోతుంటాయి. యాపిల్, అరటి పండు, ఆరెంజ్ లాంటి పళ్లలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు (కణాలు ఆక్సీకరణం చెంది నాశనం కాకుండా అడ్డుకుంటాయి) మెదడులోని నాడీ కణాలు క్షీణించ కుండా నివారించగలు గుతాయి. ఫుడ్‌సైన్స్ జర్నల్‌లో ప్రచురి తమైన అధ్యయనం ప్రకారం అరటిపండు, ఆరెంజ్‌లలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లకంటే యాపిల్‌లో ఉన్న పోషకాలు మరింత ప్రతిభావంతంగా కణాలను కాపాడతాయి.

➲ బ్రిటీష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం యాపిల్ పండు మధుమేహం వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది. యుకె, అమెరికా, సింగపూర్‌లలో 1,87,382మందిని

**182 గ్రాముల బరువున్న మధ్యస్థపరిమాణం ఉన్న యాపిల్‌లో 95 కేలరీలు, 25గ్రాముల కార్బోహైడ్రేట్లు, నాలుగు గ్రాముల పీచు, రోజూ తీసుకోవాల్సిన విటమిన్ సిలో 14శాతం, రోజూ తీసుకోవాల్సిన పొటాషియంలో ఆరుశాతం, విటమిన్ కె ఐదుశాతం, మెగ్నీషియం, కాపర్, ఎ ఇ విటమిన్లు, బి1, బి2, బి6 విటమిన్లు 2 నుండి 4 శాతం లభిస్తాయి. యాపిల్‌లోని పీచులో సగం దాని తోలులోనే ఉంటుంది కనుక యాపిల్‌ని తోలుతో పాటు తింటేనే మంచిది.**



➲ 1967-1994 మధ్యకాలంలో ఫిన్లాండ్‌లోని నేషనల్ పబ్లిక్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు 9,208మందిని ప్రశ్నించి నిర్వహించిన అధ్యయనం ప్రకారం యాపిల్‌లో ఉన్న యాంటీ ఆక్సిడెంట్ ఫ్లేవనాయిడ్ క్వెర్‌సెటిన్...మెదడులోని రక్తనాళాలకు వచ్చే జబ్బులపై ప్రభావం చూపుతుందని తేల్చారు. సరిగ్గా కారణం ఇదీ అని చెప్పలేకపోయినా...యాపిల్ బ్రెయిన్ స్ట్రోక్ ప్రమాదాన్ని నివారిస్తుందని మాత్రం ఈ పరిశోధకులు వెల్లడించారు.

➲ ఇటలీలోని పెరుగియా యూనివర్శిటీ పరిశోధకులు యాపిల్ లంగ్ క్యాన్సర్ రిస్క్‌ని తగ్గిస్తుందని కనుగొన్నారు. అంతేకాదు యాపిల్‌ని తినటం వలన పెద్దపేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదం తగ్గుతుందని...జీర్ణనాళానికి సంబంధించిన అన్నిరకాల క్యాన్సర్లను ఇది నివారిస్తుందని ఒక తరహా అధ్యయనాలు వెల్లడిస్తుండగా...మరో తరహా అధ్యయనం మాత్రం...ఈ క్యాన్సర్లపై యాపిల్ ప్రభావం చూపదని తేల్చాయి. ఏదిఏమైనా యాపిల్ ఎన్నో అనారోగ్యాలపై అద్భుతమైన పిల్..అంటే మాత్రలా పని చేస్తుందని మాత్రం చెప్పక తప్పదు.

# దినఫలాలు

**మేష రాశి**
పనులు వాయిదా వేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు సంభవం. ఆరోగ్యభంగం. శ్రమతప్పదు. బంధువులతో విభేదాలు. ఉద్యోగయత్నాలు ముందుకు సాగవు. వ్యాపారాలు నిరాశ పరుస్తాయి. ఉద్యోగాలలో చికాకులు.

**వృషభ రాశి**
పరిచయాలు పెరుగుతాయి. ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. వ్యవహారాలలో విజయం. ఒప్పందాలు చేసుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగాలలో ఉత్సాహవంత వాతావరణం ఉంటుంది.

**మిథున రాశి**
సన్నిహితులతో విభేదాలు. ఆకస్మిక ప్రయాణాలు. ఒప్పందాలు వాయిదా. శ్రమాధిక్యం. పనులలో ఆటంకాలు. ఆరోగ్యభంగం. వ్యాపారాలలో ఒడిదుడుకులు. ఉద్యోగాలలో ఒత్తిడులు.

**కర్కాటక రాశి**
పాతబాకీలు వసూలవుతాయి. పనుల్లో విజయం. ఆస్తివివాదాలు పరిష్కారం. శుభకార్యాలలో పాల్గొంటారు. దైవదర్శనాలు. వ్యాపారాలు మరింత విస్తరిస్తారు. ఉద్యోగాలలో చికాకులు తొలగుతాయి.

**సింహ రాశి**
నూతన ఉద్యోగాలు పొందుతారు. ఆత్మీయులతో సఖ్యత. విందువినోదాలు. వివాదాలు కొన్ని పరిష్కారం. శుభకార్యాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగాలలో గందరగోళం తొలగుతుంది.

**కన్యా రాశి**
రుణాలు చేస్తారు. ఆత్మీయులతో విభేదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబంలో ఒత్తిడులు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార లావాదేవీలు మందగిస్తాయి.

**తుల రాశి**
పరిస్థితులు అనుకూలించవు. వ్యయప్రయాసలు. బంధువులతో తగాదాలు. అనారోగ్యం. అనుకోని ప్రయాణాలు. ఆలయ దర్శనాలు. వ్యాపారాలు కొంత సామాన్యంగా ఉంటాయి. ఉద్యోగాలలో సమస్యలు.

**వృశ్చిక రాశి**
కొత్త వ్యక్తుల పరిచయం. శుభవార్తలు. వ్యవహారాలలో విజయం. కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఆస్తివివాదాలు పరిష్కారం. వస్తులాభాలు. వ్యాపారాలలో లాభాలు. ఉద్యోగాలలో ప్రోత్సాహం.

**ధనూ రాశి**
పరిస్థితులు అనుకూలిస్తాయి. సంఘంలో గౌరవం. భూవివాదాలు పరిష్కారం. వాహనయోగం. చర్చలు సఫలం. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగాలలో కొత్త ఆశలు.

**మకర రాశి**
పనుల్లో తొందరపాటు. ఆర్థిక ఇబ్బందులు. దూరప్రయాణాలు. ఇంటాబయటా సమస్యలు. ఉద్యోగయత్నాలు నత్తనడకన సాగుతాయి. వ్యాపారాలలో ఒడిదుడుకులు. ఉద్యోగాలలో చికాకులు.

**కుంభ రాశి**
ఆర్థిక లావాదేవీలు నిరుత్సాహం. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఆకస్మిక ప్రయాణాలు. శ్రమ పెరుగుతుంది. దైవచింతన. వ్యాపారాలు మందకొడిగా ఉంటాయి. ఉద్యోగాలలో కొత్త సమస్యలు.

**మీన రాశి**
నూతన పరిచయాలు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. బాకీలు కొన్ని వసూలవుతాయి. విందు వినోదాలు. వ్యవహారాలలో పురోగతి. వ్యాపారాలు పుంజుకుంటాయి. ఉద్యోగాలలో మీదే పై చేయిగా ఉంటుంది.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి

# గో గీత

**గావః ప్రతిష్ఠా భూతానాం గావః స్వస్త్యయనం మహత్**
**గావో భూతంచ భవ్యంచ గావః పుష్టిః సనాతనీ**
**(మహాభారతంఅను.2వ అ.)**

గోవులే మనుష్యుల మొదలు సమస్త ప్రాణికోటికి జీవనాధారాలు. గోవులు కల్యాణ కారకాలు. శుభాలు సమకూరుస్తాయి. పూర్వం ఐశ్వర్యానికి గోవులే ఆధారంగా ఉండేవి. ముందు ముందు మనం కూడా గోవుల వల్లనే అభివృద్ధి పొందుతాము. గోవులు అన్ని కాలాల్లోనూ పుష్టిని అందిస్తాయి.



- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

# చింతన

# సరైన మానవుడనిపించుకోవాలి

**తానేమిటో తెలుసుకుని అహంకారాన్ని వీడి సాటి మనుజులతో కలిసి మెలసి జీవించేవాడే సరైన మానవుడనిపించుకుంటాడు. తాను బ్రతుకుతూ ఇతరులు కూడా బ్రతకాలని కోరుకోవాలి. అపుడే వారిని అదృష్ట దేవత వరిస్తుంది. ఎందుకంటే సాటి మనిషికి సేవ చేస్తే మానవ సేవే మాధవసేవగా భగవంతుడు పరిగణిస్తాడు**

**గతం అనంతమైతే అందులో నేను లేను**
**రాబోయే అనంతంలో ఉంటానో లేదో**
**ఈ అగాధ ఆద్యంతరహిత శూన్యంలో**
**ఈ క్షణం నేనుగా వెలగాలని ఉంది**

క్షణికమైన జీవితయానంలో నేనెంత, నా బ్రతుకెంత? దాని విలువెంత? ఈ అనంత విశ్వంలో నేనెంత? మరి ఎందుకింత మిడిసిపాటు? ఎందుకింత మదము?

ప్రతి మనిషిలోను అజ్ఞాతంగా మరో మనిషి అంతర్లీనంగా దాగి ఉన్నాడు. అతడే అన్ని అనర్థాలకూ మూలం. అతడు మనకు ఎంతో ఆప్తుడుగా కనిపిస్తాడు. కానీ అతడే కొన్ని సందర్భాల్లో అగర్భ శత్రువై మనల్ని చెడు మార్గంలో పయనించేలా చేస్తాడు. మన పురోగతికి అవరోధమవుతాడు. ఈ అంతశ్శత్రువు పేరే అహంకారం. దీని వలనే మనలో ఏ ప్రత్యేకతలూ లేకపోయినా మనంతవాడు లేడన్న భ్రమ కలుగుతుంటుంది. వాపును కూడా బలంగా చూపెడుతుంది. అనుక్షణం మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. మానసికంగా లోబరచుకుని క్షణక్షణం వేధిస్తుంది. ప్రశాంతత అనేదే లేకుండా చేస్తుంది. వాడెంత? వీడెంత? అనే విధంగా మనను ప్రేరేపిస్తుంది. 'నేను' అనే ఈ రెండక్షరాల పదమే మానవుడి పతనానికి అన్ని విధాలా కారణం అవుతోంది. మనల్ని ఏమారుస్తోంది. ఈ అహంకారం మనల్ని రోజు రోజుకీ ఈ సమాజం నుంచి దూరం చేస్తుంది. నిజాన్ని చూడలేనంతగా చేస్తుంది. నిజమైన విషయాన్ని దాచేస్తుంది. ఎదుటివారు తమ కంటె ఎక్కువని ఈ సమాజం గుర్తించినా, తానే స్వయంగా అనుభవించినా సహించలేదు.

అహంకారంతో ఎగిసిపడే వానికి భగవంతుడు ఎన్ని అనూహ్యమైన సౌకర్యాలిచ్చినా ఏదో అసంతృప్తి

కోపం, ద్వేషం తనకు తెలియకుండానే పిలవకుండానే పలుకుతాయి. సద్గుణాలను కూడా ఒక విధంగా దూరం గావిస్తుంది.



వెంటాడుతుంది.

ఈ దేహం ఎప్పుడు మృత్యుగతమవుతుందో తెలియదు. గుణాలకూ, దేహానికి మధ్య అనంత వ్యత్యాసం ఉంది శరీరం క్షణంలో నశిస్తుంది. గుణాలు మాత్రం తాను పోయినా ఇంకా ఈ సమాజం గుర్తుంచుకునేలా చేస్తాయి. అందుకే మహాత్ములైనవారు ఇలా అన్నారు:

**జగతిని జీవించువాడు మనుజుడు కావలె**
**మొదట**
**మనుజుల దుష్కృతులనెల్ల**
**పొగడుచుండెడివాడు చవట**
**తనను తాను తెల్సుకొనుట అదియె**
**ముక్తికి బాట**

తానేమిటో తెలుసుకుని అహంకారాన్ని వీడి సాటి మనుజులతో కలిసి మెలసి జీవించేవాడే సరైన మానవుడనిపించుకుంటాడు. తాను బ్రతుకుతూ ఇతరులు కూడా బ్రతకాలని కోరుకోవాలి. అపుడే వారిని అదృష్ట దేవత వరిస్తుంది. ఎందుకంటే సాటి మనిషికి సేవ చేస్తే మానవ సేవే మాధవసేవగా భగవంతుడు పరిగణిస్తాడు చెప్పాడు కావున. అందుకే ప్రతి మనిషి బ్రతికినన్నాళ్లూ అహంకారం లేకుండా, మంచిగా జీవించాలి. అహంకారి అయినవాడు ఈ ప్రకృతిలోని అపురూపమైన అందాలను సైతం ఆస్వాదించలేడు. నయాగరా జలపాతాన్ని కూడా ఏముంది అదొక నీటిధారేనంటూ తీసిపారేస్తాడు. ఒక మహానుభావుడు అన్నట్లుగా Everybody dies, but not everybody lives. అవును కదా! అందరూ ఏదో ఒకనాడు చనిపోవలసినవారే కాని ఏ కొద్ది మందో చనిపోయాక కూడా జీవిస్తారు. ఆలోచించి చూస్తే ఇందులో నిగూఢంగా ఏదో పరమార్థం ఉంది. నూరేళ్ళ నిండా బ్రతకడానికి శరీరారోగ్యం కంటె ముఖ్యమైందీ,

అవసరమైందీ మరొకటి ఉంది. అదే మంచి దృక్పథం కలిగి ఉండడం. ప్రతి విషయాన్ని దైవ సంకల్పంగా ఆస్వాదించే లక్షణం ఉండటం.

అహంకారిని భగవంతుడు ఆమడ దూరంలో ఉంచుతాడు. ముందు 'నేను' అనే అహం నుంచి బయటపడితే నిన్ను నా దగ్గరకు చేర్చుకుంటానంటాడు.

**వివిధ దుర్వ్యసనంబుల వీడలేక**
**ముక్తి మార్గంబు వెదకు అహముతోడ**
**కర్మ పంకిలములనబడి అహంకారియై**
**మట్టిగల్సును తుదకు ఈ జన్మంబు వీడి**

మానవుడు తాను ఏమి చేసినా ఎలా ప్రవర్తించినా ఈ బొందిలో ఆ గాలి తిరుగుతున్నంత వరకేనని గ్రహించాలి. ఆ పరికరం ఎంత కాలం నడవాలని ఆ భగవంతుడు నిర్ణయించాడో ఎవ్వరికీ తెలియదు. అందుకే ప్రతి క్షణాన్నీ అమూల్యంగా భావించి సద్వినియోగం గావించుకుందాం అహం విడచి.



డాక్టర్ పులివర్తి కృష్ణమూర్తి

# భగవద్గీత

# గురువు నుంచి వింటే సత్ఫలితం



అధ్యాయం- 18
శ్లోకం- 75

**వ్యాసప్రసాదాచ్ఛ్రుతవాన్**
**ఏతద్గుహ్యమహం పరమ్।**
**యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్**
**సాక్షాత్ కథయతః స్వయమ్॥**

**తాత్పర్యం**
అర్జునునితో స్వయముగా సంభాషించుచున్న యోగేశ్వరుడైన శ్రీకృష్ణుని నుండి ఈ పరమగుహ్య వచనములను వ్యాసదేవుని కరుణచే నేను ప్రత్యక్షముగా వినగలిగితిని.

**భాష్యం**
సంజయుడు తన గురువైన వేదవ్యాసుని కృప ద్వారా దేవాదిదేవుడైన శ్రీకృష్ణుని అర్థము చేసుకొనగలిగినాడు. అలాగే ప్రతి ఒక్కరూ గురువు ద్వారా కృష్ణుని అర్థము చేసుకొనగలరే గాని స్వంత ప్రయత్నముతో కాదు. అర్జునుడు కృష్ణుని నుండి వినుట, సంజయుడు వ్యాసుని ద్వారా ఆ సంవాదమును వినుటలో తేడా ఏమీ లేదు. అనగా గురుపరంపరలో ఉన్న ఏ గురువు నుండీ విన్నా సరే అర్జునుని వలే ఫలితమును పొందవచ్చును. వ్యాసుడు నారదముని శిష్యుడు. సంజయుడు వ్యాసుని శిష్యుడు. ఈ విధముగా పరంపరలోని ప్రతి గురువు వ్యాసుని వంటి వాడే. కాబట్టి గురువు జన్మదినమును వ్యాసపూజగా శిష్యులు జరుపుకుందురు. సరైన గురు శిష్య పరంపరలో విననట్లయితే సరైన జ్ఞానమును పొందలేరు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత యథాతథము' ఆధారంగా సమర్పిస్తున్నాము.

android Google play | iOS iTunes

# ధర్మసందేహాలు

## సూర్యుడు లేదా నవగ్రహాల చిత్ర పటాలు ఇంట్లో ఉండవచ్చునా?

దేవతల చిత్ర పటాలు ఇంట్లో ఉండటం నిషేధం కాదు. దైవాంశను చూసినా, వినినా, స్మరించినా శుభమే కలుగుతుంది. మనము శుభమైన భావముతో దర్శించినా, సేవించినా సత్ఫలితాలు కలుగుతాయి. నవగ్రహాలు మనని బాధించేవే కాదు. అవి శుభఫలితాలను ప్రసాదిస్తాయి. మంచిని మరచి చెడును మాత్రమే తలుచుకుని భయపడి, భయపెట్టి మన భావనలతో అశుభాన్ని పొందుతున్నాము. మనము చేస్తున్న కర్మలకు ఫలములుగా భగవంతుడు ఆయా గ్రహాల రూపంలో మనకి ఇస్తున్నాడు. అన్నీ అందరూ భగవంతుని రూపాలే అనే భావన కలిగి ఉంటే అనుమానం తొలగిపోతుంది. నవగ్రహాలను భగవంతుని అంశలుగా భావించిన నాడు ఆ చిత్ర పటాలు ఇంట్లో ఉంచుకుని వాటిలో భగవంతుడిని చూసుకోవచ్చు.

సూర్య భగవానుడు సూర్యనారాయణుడిగా లోకమంతా ప్రసిద్ధి. భవిష్య పురాణంలో సూర్య ఆరాధన పేరు మీద 187 అధ్యాయాలు, సుమారు ఆరు వేల శ్లోకాలు వివరించబడ్డాయి. రథ సప్తమి, మకర సంక్రాంతి, ధనుర్మాసం, ఉత్తరాయనం, దక్షిణాయనం వంటివి సూర్య గమనం మీదే ఆధారపడి వస్తాయి. ఈ పండగలన్నీ సూర్యారాధనే కావున నవగ్రహాల మీద ఉన్న భావన, భయాన్ని తొలగించుకుని భగవంతుడిగా చూసి ఆరాధించాలి.



డా॥ కందాడై రామానుజాచార్య

# మూడు రకాల యోగులు



కొన్ని యోగ శాస్త్ర సంప్రదాయాలలో యోగులను మూడు తరగతులుగా విభజిస్తారు. మంద యోగులు, మధ్యమ యోగులు, ఉత్తమ యోగులు అని. వారేమిటో తెలుసుకుందాం.

## 'మంద' యోగులు

వీరిది వచ్చిపోయే జ్ఞానం. 'మంద' యోగి అంటే, ఉన్నతమైన సచేతనత్వ స్థితిని కొంత చవి చూసినవాడు. సృష్టిమూలాలను దర్శించి, ఏకత్వాన్ని అనుభూతి చేసుకొన్నవాడే కానీ, నిరంతరం అదే అనుభూతిలో ఉండిపోలేడు. అప్పుడప్పుడు మళ్లీ తనకు తానే దాన్ని గుర్తుచేసుకొంటూ ఉండాలి. స్పృహలో ఉన్నప్పుడు ఆ అనుభూతి ఉంటుంది, అది లేనప్పుడు, సాధారణ స్థితికి వస్తాడు. ఈ అనుభూతి కేవలం మనశ్శాంతికీ, సంతోషానికీ సంబంధించింది కాదు. ఇది పేరులేని, చెప్పలేని బ్రహ్మానంద పారవశ్య అనుభూతి! మొదటి తరగతికి చెందిన 'మంద' యోగులు ఈ అనుభూతిని ఎరిగినవారే. కానీ వాళ్లు ఎప్పుడూ అదే స్థితిలో ఉండిపోలేరు. ఎప్పటికప్పుడు తమకు తాము ఆ స్థితిని గుర్తుచేసుకొంటూ ఉండాల్సిందే. మరోలా చెప్పాలంటే, ఈ తరగతి యోగుల చైతన్యానుభూతి ఎప్పుడూ ఒకేలా ఉండదు. మీరు చైతన్యంతో ఉండి, గ్రహించ గలిగితే, మీకు పెద్దవీ, చిన్నవీ ఎన్నో విషయాలు కనిపిస్తాయి. మీరు జాగ్రదవస్థలో లేకపోతే, మీ బాహ్య స్పృహ మందగించి ఉంటే, అవన్నీ అనుభవంలోకి రావు. మీ స్పృహ మరింత తగ్గిపోతే, (ఉదాహరణకు మీరు నిద్రావస్థలో ఉన్నప్పుడు), మీకు బాహ్య ప్రపంచంలో విషయాలను గ్రహించే శక్తి లోపిస్తుంది. అందుకే మీకు మీ నిద్రావస్థలో బయటి ప్రపంచం అనేదే మాయమైపోతుంది.

సరిగ్గా అదేవిధంగా, కొన్ని రకాలైన అతిసూక్ష్మమైన విషయాల ఎరుకా, అనుభూతి కలగాలంటే, మామూలు కంటే ఎక్కువ సచేతనమైన, ఉన్నతమైన స్థితి అవసరమవుతుంది. ఎవరూ కూడా ఇరవై నాలుగు గంటలూ ప్రయత్నపూర్వకంగా ఎరుకతో ఉండలేరు. అలాంటి స్థితిని ప్రత్యేక కృషితో ప్రయత్నపూర్వకంగా మాత్రమే చేరగల వాళ్లకు, ఆ స్థితిలో కొన్ని సెకన్లపాటో, నిమిషాలపాటో ఉండగలగటమే గొప్ప! అతి స్వల్ప సమయంలోనే ఆ ఉన్నత చైతన్యస్థితి చెదిరిపోతుంది. ఇదిగో ఇలాంటి ఈ మొదటి దశలో ఉన్న యోగిని 'మంద' యోగి అంటారు.



నీమ్ కరోలీ బాబా

## 'మధ్యమ' యోగులు

యోగులలో రెండవ కోవకు చెందినవారు 'మధ్యమ' యోగులు. ఇది ఉత్తమస్థాయికీ, మందస్థాయికీ మధ్యస్థం. ఈ యోగికి అంతరంగ అనుభూతులూ, అలౌకిక అనుభవాలూ ఎప్పుడూ అనుభవమౌతూనే ఉంటాయి. కానీ అతనికి భౌతిక విషయాల ధ్యాస బొత్తిగా లోపించి, మామూలు లౌకిక వ్యవహారాల నిర్వహణ కూడా కష్టమైపోతుంది. ఇలాంటి మహా యోగులెందరో ఈనాటికీ మహనీయులుగా, లోకపూజ్యులుగా నిలిచి ఉన్నారు. వీళ్లు తమ జీవితకాలంలో, ప్రాపంచికమైన పనులేవీ చేయగలిగేవారు కాదు. జీవితంలోని కొన్ని దశలలో వీళ్లకు భోజనం చేయాలీ, కాలకృత్యాలు తీర్చుకోవాలీ అని కూడా మరెవరో పక్కన ఉండి గుర్తు చేయాల్సి వస్తుండేది. వీళ్లు ఎప్పుడూ అలౌకికానంద పారవశ్యస్థితిలో ఉండేవారు. కానీ భౌతిక విషయాలలో మాత్రం పసిపాపలా నిస్సహాయంగా ఉండేవాళ్లు. వీళ్లకు భౌతిక ప్రపంచంతో సంబంధమే ఉండేది కాదు.

ఇలాంటి యోగులకు ఉదాహరణ నీమ్ కరోలీబాబా. ఆయన ఒకేచోట అలా పారవశ్యస్థితిలో కూర్చొని ఉంటే, ఆయనకు లఘుశంకాదులు తీర్చుకోవాలని గూడా గుర్తుండేది కాదు. 'మీరు ఇలా కూర్చొని చాలా గంటలు గడిచిపోయాయి. మీరు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకొని రావాలి' అని ఎవరైనా వచ్చి చెప్తుండేవారు. అప్పుడే ఆయన వెళ్లేవారు. అలాంటి యోగులకు శరీర ధర్మాలూ, ప్రాపంచిక విషయాల స్పృహ ఉండేది కాదు. వాళ్లు నిరంతరం ఒక అలౌకిక పారవశ్య స్థితిలో ఉండేవాళ్లు. కానీ ఎంతటి పారవశ్యమైనా, మీరు అదే స్థితిలో ఉండిపోలేరు. భౌతిక ప్రపంచంతో బంధాలు పూర్తిగా తెంచేసుకొన్న తరువాత, భౌతిక శరీరంతో ఉండటం కూడా అసాధ్యమే అయిపోతుంది.

ప్రేమాశీస్సులతో సద్గురు

(తరువాయి భాగం వచ్చే సంచికలో...)



# సంస్కృతి



ప్రోత్సాహం వుండిన కళ పురోగతిని సాధిస్తుంది లేకుంటే తిరోగతిలో పయనిస్తుంది. ఏ కళా రూపమైనా అభివృద్ధి చెందాలి అంటే దానికి తగినంత సాధన కృషితో బాటు ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. అటువంటి ప్రోత్సాహం కరువైనప్పుడు ఆ కళ ముందుకు సాగడం భారంగా మారుతుంది. ప్రతిభ ఉన్నప్పటికీ ప్రతికూల స్థితులు పురోగతికి అవరోధంగా మారతాయి. ఈ విషయంలో సీతాదేవిగారు తన సోదరి పిలకా విజయలక్ష్మిగారిలా అదృష్టవంతురాలు కాదు.

# తొలితరం చిత్రకారిణి సీతాదేవి



పి. సీతాదేవి

తెలుగునాట వర్ధిల్లిన చిత్రకళాకారులలో పురుషులతో పోలిస్తే మహిళల సంఖ్య కొంత తక్కువే అయినప్పటికినీ తొలి తరం నుండి కూడా ఎందరో మహిళలు వారి కుటుంబం నుండి అందిన ప్రోత్సాహంతో ఈ కళను అభ్యసించి తమదైన శైలిలో ఎన్నో విలువైన చిత్రాలు అందించి చిత్రకళా చరిత్రలో స్థిరమైన స్థానాన్ని సంపాదించిన వారెందరో వున్నారు. వారిలో మొదట చెప్పుకోదగిన చిత్రకారిణి దామెర్ల సత్యవాణి. ఈమె ఆధునిక ఆంధ్ర చిత్రకళకు ఆద్యుడిగా నిలిచిన స్వర్గీయ దామెర్ల రామారావు యొక్క సతీమణి కావడం విశేషం. తరువాత రామారావుకు స్వయానా సోదరి అయిన బుచ్చిక్రిష్ణమ్మ, ఇంకా పిలకా విజయ లక్ష్మి, వంగా చిట్టెమ్మ, కోవ్విడి దుర్గాంబ, బి.వి.కరుణారావులాంటి వారు ఎందరో ఇరవయ్యవ శతాబ్దపు తొలి దశాబ్దాలలో విరివిగా చిత్రకళపై కృషి చేసి మంచి చిత్రకారిణులుగా పేరు గడించారు. అలాంటి వారి సరసన నిలిచిన మరో ప్రముఖ చిత్రకారిణి పిసిపాటి సీతాదేవిగారు. అలనాడు తెలుగునాట విఖ్యాతి గాంచిన చిత్రకారులలో ఒకరైన మొక్కపాటి కృష్ణమూర్తిగారి ఇరువురి సోదరీమణులలో ఒకరు సీతాదేవిగారు.

పిసిపాటి (మొక్కపాటి) సీతాదేవిగారు 1920వ సంవత్సరంలో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుకి సమీపంలోని వసంతవాడ అనే గ్రామంలో జన్మించారు. కుటుంబంలో అన్నయ్య, చెల్లెలు మరియు వారి కుమారుడు అందరూ మంచి చిత్రకారులే. అంతేగాక వీరి తమ్ముడు మంచి వైణిక విద్వాంసుడు కూడా. చిన్నతనంలోనే తన అన్న మొక్కపాటి కృష్ణమూర్తి వేసే చిత్రాలు సహజంగానే వీరిలో చిత్రకళా ఆసక్తిని రేకెత్తించాయి. అందుచేతనే సీతాదేవి గారు ప్రత్యేకంగా ఏ కళాశాలలోను చిత్రకళను అభ్యసించలేదు. మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నందలి రాయ్ చౌదరి వద్ద విద్యనభ్యసించిన తన అన్న మొక్కపాటి కృష్ణమూర్తి వద్దనే చిత్రకళా పాఠాలు నేర్చుకున్నారు. ఆపై ఆమె తనదైన స్వతంత్ర శైలిని సృష్టించుకుని ఎన్నో చిత్రాలు రచించారు. వీరి చిత్ర రచన ప్రధానంగా జలవర్ణాలలోనే సాగింది. తన అన్న వద్దనే చిత్రకళను నేర్చుకున్నప్పటికిని ఆ ఛాయలు ఏమాత్రం తన చిత్రాలలో పడకుండా జాగ్రత్త వహించి తనదైన సొంతశైలిని సృష్టించుకుని ఎన్నో చిత్రాలను సృష్టించడమేగాక ఎన్నో ప్రదర్శనలు కూడా చేసిన ఒక విశిష్ట చిత్రకారిణి సీతాదేవిగారు. వీరు వేసిన చిత్రాలలో సుకుమారంతో కూడిన ఒక లయాత్మక రేఖా సౌందర్యాన్ని మనం గమనిస్తాము. ఆ రేఖల మధ్య పూసిన పారదర్శకమైన వర్ణలేపనం ఒకవిధమైన సొగసును సౌందర్యాన్ని వీక్షకుడికి అందిస్తాయి. లలిత లలితమైన ఆ రేఖలు పారదర్శకమైన ఆ వర్ణలేపనం ప్రేక్షకుడి మనసుకు ఒక విధమైన హాయిని గొల్పు తాయి. వీరి చిత్రాలలో అధిక భాగం రాధాకృష్ణుల ప్రేమ తత్త్వాన్ని ప్రధానంగా చూపించడం జరిగింది. గోపికా గోవులతో వేణుగోపాల స్వామి లీలలు, మాతృప్రేమ, పల్లెవాతావరణం, గోకులాలు, అమ్మలక్కల కబుర్లు, ఆలమందలు వీరి చిత్రాల్లో ఎక్కువగా మనం చూస్తాము. ఆలమందలు అన్న చిత్రంలోని గోవులమందని చిత్రించడంలో చూపించే అనాటమి, రేఖా విన్యాసం, అలాగే మురళీరవళి అన్న చిత్రంలో కృష్ణుడు వేణువు ఊదుతుండగా ఆ వేణునాద మైకంలో ఓలలాడుతున్న గోవుల నుండి గోపికలు పాలు పితుకుతున్నట్లుగా వేసిన చిత్రంలోని రేఖలలో చూపిన లయవిన్యాసం, రంగుల పోహళింపు మనసును తూగుటుయ్యాలలనూగించిన అనుభూతిని కలిగిస్తాయి. అలాగే తల్లి ప్రేమ అన్న చిత్రంలో బిడ్డకు పాలిస్తున్న తల్లి కూర్చునే భంగిమలో చాలా సహజత్వం కనిపిస్తుంది. ముద్దుల కృష్ణుడు అన్న మరో చిత్రంలో గోపికలంతా బాలకృష్ణుడిని లాలించే దృశ్యం మనసును హత్తుకునేలా ఉంటుంది.

1930 నుండి 1960 వరకు తన అన్న మొక్కపాటి కృష్ణమూర్తిగారు అందించిన ప్రోత్సాహంతో విరివిగా ఎన్నో చిత్రాలు వీరు వేశారు. అవి ఆనాటి ప్రముఖ సారస్వత పత్రిక అయిన భారతిలో తరచుగా ప్రచురింపబడడం వీరి ప్రతిభకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. అంతేగాక వీరి చిత్రాలు ఢిల్లీ, మద్రాస్ తదితర నగరాలలో ప్రదర్శింపబడడమే గాక ఎన్నో అవార్డులు సత్కారాలను వీరు అందుకున్నారు. ఆంధ్రమహిళా సభ మద్రాస్‌వారు స్వాతంత్ర సమరయోధురాలు దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సమక్షంలో వీరిని సన్మానించి వెండి పెట్టెను బహూకరించడం గొప్ప విశేషం. ప్రోత్సాహం వుండిన కళ పురోగతిని సాధిస్తుంది లేకుంటే తిరోగతిలో పయనిస్తుంది. ఏ కళా రూపమైనా అభివృద్ధి చెందాలి అంటే దానికి తగినంత సాధన కృషితో బాటు ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. అటువంటి ప్రోత్సాహం కరువైనప్పుడు ఆ కళ ముందుకు సాగడం భారంగా మారు తుంది. ప్రతిభ ఉన్నప్పటికీ ప్రతికూల స్థితులు పురోగతికి అవరోధంగా మారతాయి. ఈ విషయంలో సీతాదేవిగారు తన సోదరి పిలకా విజయలక్ష్మిగారిలా అదృష్టవంతురాలు కాదు. కాస్త దురదృష్టవంతురాలనే చెప్పాలి. 1935 నుండి 1960 వరకూ అన్న ప్రోత్సాహంతో సానుకూలంగా సాగిన వీరి చిత్రకళకు 1960 తర్వాత అనగా వివాహ అనంతరం మొక్క పాటి సీతాదేవి పిసిపాటి సీతాదేవిగా మారిన తర్వాత కాస్త బ్రేక్ పడిందనే చెప్పాలి. భర్త సహకారం లేకపోవడమే గాక తన అత్తవారింట సరైన ఆదరణ కొరవడడంతో క్రమక్రమంగా వీరి చిత్ర రచనకు అంతరాయం ఏర్పడడం జరిగిందని చెప్తారు టెలిఫోన్ శాఖలో వున్నతోద్యోగిగా పదవీ విరమణ చేసి ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్న సీతాదేవి గారి కుమారుడు పి.వి.శాస్త్రిగారు.

ఒకనాడు తన అన్న ప్రోత్సాహంతో ఎన్నో మంచి చిత్రాలు వేసినప్పటికీ తన సమకాలిక చిత్రకారిణులైన సత్యవాణి, బుచ్చి కృష్ణమ్మ, విజయలక్ష్మిలకు వొచ్చిన గుర్తింపు రాకపోవడం విచారకరం. అందుకే తన అమ్మగారి కళను నేటి జనావళికి పరిచయం చేయాలనే సంకల్పంతో శాస్త్రిగారు తన తల్లిగారి చిత్రాలతో ''పాతతరం చిత్రకారిణి పిసిపాటి సీతాదేవి'' అన్న పేరుతో ఒక చిరుగ్రంథాన్ని ముద్రించడం జరిగింది. తన తల్లి తరపు వారు అంతా చిత్రకారులు కావడం వల్లనో ఏమో శాస్త్రిగారు కూడా చిత్రకళలో ప్రవేశమున్నవారే. మన దేశ నాయకులైన గాంధీ, నెహ్రూ, పటేల్, శాస్త్రి, అంబేద్కర్, అబ్దుల్ కలాం, తదితర ఎందరో నాయకుల రూప చిత్రాలను పెన్సిల్, చార్కోల్ మరియు జలవర్ణాల్లో వేశారు. మాతృమూర్తి యొక్క కళను జనావళికి దృష్టికి తీసుకురావాలనే సంకల్పంతో వీరు ప్రతి ఏటా ఆమె చిత్రాలతో ఒక చిన్న కేలండర్‌ని ప్రచురించి అందరికి ఉచితంగా పంచడం తల్లి కళ పట్ల వీరి అభిమానము ప్రేమను తెలియజేస్తుంది. శాస్త్రిగారు ఆశించిన విధంగా విస్మరణకు గురైన ఈ తొలితరం చిత్రకారిణి యొక్క కళా కృషికి నేటికైనా తగిన గుర్తింపు రావాలని కోరుకుందాం.







- వెంటపల్లి సత్యనారాయణ
9491378313

# వీరబాహుడి వారసులు కాటిపాపలు

మనదేశ సంస్కృతి సంప్రదాయాల్లో భాగమైన ''సత్యం'' పేరు చెప్పగానే చటుక్కున గుర్తుకు వచ్చే పౌరాణిక పాత్ర ''సత్య హరిశ్చంద్రుడు''. సత్యంకోసం నిజమే చెబుతూ అనేక కష్టాలను ఇష్టంగా అనుభవించిన మహనీయుడు ''హరిశ్చంద్రుడు''. తన సత్యపాలనలో భాగంగా చెప్పిన మాటకోసం తన యావత్ రాజ్యాన్ని చివరకు కొడుకు భార్యను కడకు తను కూడా అమ్ముడు అయిపోయి ''వీరబాహుడు'' అనే కాటికాపరి వద్ద శవాలను కాల్చే పనిచేసిన హరిశ్చంద్రుని కథ మన అందరికి తెలుసు. అందులోని వీరబాహుడు యొక్క వారసులుగా చెప్పబడుతు ''కాటిపాపల వాళ్లు''గా తెలంగాణ ప్రాంత గ్రామాల్లో నేటికి యాచకవృత్తితో జీవనం సాగిస్తున్న సామాజిక వర్గం వారు వున్నారు.

వీరు సాధారణంగా నేటికి ఉమ్మడి కుటుంబ జీవనం సాగిస్తూ ఏడాదిలో ఆరుమాసాల పాటు సంచార జీవనం గడుపుతున్నారు. ఊరూర తిరిగి యాచన చేసే వేళ రంగు రంగుల బట్టలు ధరించి తలకు రాగిరేకుల కిరీటం చేతులో బొణగ (ఇనుపరేకుతో తయారుచేసిన పెద్దగంట) పట్టుకుని యక్షగానాల బాణీలో పాటలు ఆలపిస్తూ తిరుగుతుంటారు. ఈ కుటుంబాలలో ఇంటి పెద్ద ప్రధాన పాపడుగా వ్యవహరిస్తే మరో ఒక్కరు గాని ఇద్దరు గాని రంగుల బట్టలు ధరించి పాటలు పాడుతూ అతనికి సహకరిస్తూ అనుసరిస్తుంటారు.

ప్రధాన పాపడు మాత్రమే రాగిరేకుల కిరీటం ధరిస్తాడు. అంతేగాక వాళ్లు కనికట్టుగ చెప్పే ఇంద్రజాల ప్రదర్శనలు చేస్తూ గ్రామస్తులను అలరిస్తుంటారు. ఈ కనికట్టు విద్యలో వాళ్లు చిన్న సైజు రాళ్లు గోళీకాయలు నోటి నుంచి తీయడం మనిషి పుర్రె, చేతిఎముకలు తాళపత్రాలు ఉపయోగించి మరికొన్ని కనికట్టు విద్యలు చేస్తుంటారు. ఇలాంటి విద్యలు కేవలం ఆ కుటుంబాల పెద్ద మాత్రమే చేస్తాడు. ఆ ఇంద్రజాల విద్యలు వాళ్లు వంశపారంపర్యంగా ఒకరి నుంచి మరొకరు నేర్చుకుంటారు. ఈ విద్యలు చేసే పెద్దాయన కాళ్లకు చెప్పులు ధరించకపోవడం ఒక్కపూట భోజనం చేయడం లాంటి నియమాలు పాటిస్తుంటారు.



ఇలాంటి కనికట్టు విద్యలను వీళ్లు గ్రామపెద్ద ఇంటివద్దగాని గ్రామ చావడిలో గాని చేసి ఎక్కువ మొత్తంలో నగదు తీసుకుంటారు. ఇలా కాటిపాపల వాళ్లు విద్యలు చేయడం వల్ల ఆయాగ్రామాలకు భూతప్రేతాత్మల ద్వారా హాని కలగదని చెబుతారు.

వెనుకబడిన సామాజిక వర్గం (బిసి)గా గుర్తించబడుతున్న వీరు పూర్వం ఆయా సామాజిక వర్గాల వారిలో సంభవించే మరణాల సందర్భంలో అంతిమయాత్రలోను దహన సంస్కారాలలోను, ప్రధానపాత్ర వహించి ఆయా కార్యక్రమాలను నిర్వహించి చనిపోయిన వాళ్లు భూతప్రేతాలుగా మారకుండ స్వర్గలోక యాత్ర చేసేట్టు సహకరిస్తారని భావించేవారు. అందరి ఆదరణతో అది వారి కులవృత్తిగా కూడా కొంతకాలం కొనసాగింది.

కాలక్రమేణ వచ్చిన మార్పులుతో అంతిమ సంస్కారాలు చేసే ''కులవృత్తి'' అంతరించిపోయి ప్రస్తుతం యాచక జీవనం సాగిస్తున్నారు. ఏడాదిలో సగకాలం సంచార జీవనం చేయడంవల్ల వారి కుటుంబాలు ప్రభుత్వ పథకాలకు దూరం అవ్వడంతో పాటు పిల్లలు కూడా చదువులకు దూరం అవుతున్నారు. పేదరికంతో అవిద్యతో అనారోగ్యాలతో ఈ కాటిపాపలు సామాజిక వర్గం అంతరించిపోయే జాతుల్లో కలిసే ప్రమాదం ఏర్పడింది.

వీరు కేవలం యాచకత్వంతోను, కనికట్టు విద్యలతోను కుటుంబాలను పోషించుకునే స్థితిలో లేక వారికి తెలిసిన నాటు వైద్యాలు, మూలికా వైద్యాలు చేస్తూ వారాంతపు సంతలు, దేవతల జాతర్లలోను కనిపిస్తుంటారు.

ఎంతో చారిత్రక పౌరాణిక నేపథ్యం గల ఈ కాటిపాపల వాళ్ల జాతి మన భారతీయ సంప్రదాయ వారసత్వ సంపద. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన పాలకులు, పాలితులు ఇద్దరికీ వుంది. మన సమాజంలో అంతర్భాగమైన వీరిని కేవలం యాచకులుగా కాక ఇంద్రజాల విద్య చేసే కళాకారులుగ గుర్తించి కళాకారులుగా వీరికి ప్రాధాన్యతలు ఇస్తూ ప్రభుత్వ కార్యకలాపాలలోను, సమావేశాలలోను ప్రభుత్వ పథకాల ప్రచారకులుగ వీరిని ఉపయోగించవచ్చు.

మన ప్రభుత్వాలు అధికారులు ఆ దిశగ ఆచరణాత్మక ఆలోచనలు చేస్తే మనదేశానికి చెందిన ఒక ఉత్కృష్టమైన జాతిని కాపాడి మనముందు తరాల వారికి దానిని అందించే అవకాశం ఉంటుంది.

నేటికి మనం ఆరాధనీయంగా చూస్తున్న గంగిరెద్దుల వారి వర్గానికి అనుబంధంగా వున్న ఈ కాటిపాపల వారిని అంతేస్థాయిలో గౌరవించాల్సిన అవసరం వుంది. అంతేగాని మనలో కొందరు భావిస్తున్నట్టు వీరు అశుభ కార్యాలకు చెందిన వారుగ చూడాల్సిన అవసరం లేదు.

అందరు అంతిమసంస్కారాలు చేసుకోవాల్సిన వాళ్లమే. అవి మానవజీవితంలో అంతర్భాగమే గాని 'అశుభం' కాదనే ఆలోచనా దృక్పథం కూడా నేటి మన ఆధునిక కాలానికి అత్యవసరం. అందులో భాగంగానే మన ఈ కాటిపాపల వాళ్లు అతిముఖ్యమైనవారే!!

- డా॥ అమ్మిన శ్రీనివాసరాజు
7729883223

# గుప్తుల యుగంలో సాంఘిక జీవనం

గుప్తుల కాలంలో సాంఘిక వ్యవస్థ గల రాజుల కాలం కంటే కొంత భిన్నంగా ఉందని చెప్పవచ్చు. నాటి శిలాశాసనాల పట్ల, చైనాయాత్రికుడు ఫాహియాన్ కథనం వల్ల గుప్తుల కాలం నాటి సాంఘిక పరిస్థితులను గూర్చి పెక్కు ఆసక్తికర విషయాలు తెలిశాయి. ఆనాటి ప్రజలు ధనవంతులుగాను, శీలవంతులుగాను ఉన్నారని తెలుస్తుంది. నగరాలలోనే ఎక్కువ జనాభా వుండేదని,



ప్రజలు అహింసావాదులని తెలుస్తుంది. ప్రజలు చాలావరకు శాకాహారాన్ని భుజించేవారని స్పష్టమవుతోంది. ఎట్టి పానశాలలు నాడు ఉండేవి కావు. మద్యపానం లేదు. ప్రజలు మాంసాహారం, ఉల్లిపాయలు, మసాల దినుసులు ముట్టుకునేవారు కాదు. సాంఘిక వ్యవస్థ నుండి వెలివేయబడ్డ దిగువతరగతివారు మాత్రమే మద్యమాంసాదులు తీసుకునేవారు. ప్రజలు తగాదాలు పెట్టుకునేవారు కాదు. శాంతియుత జీవనం సాగించేవారు.

నాడు దొంగతనాల వంటివి జరిగేవి కావు. రహదారులెంట నిర్మించిన విశ్రాంతి భవనాలలో మంచి సదుపాయా లుండేవి. మధ్యదేశంలోని ప్రజలు ఎన్నో స్వచ్ఛంద సంస్థలను స్థాపించి, బీద, బిక్కి, అనాథలకు ఉచితాహారం, మందులు ఇచ్చేవారు. ఫాహియాన్ చెప్పిన ఈ విషయాలలో తక్కువ జాతుల వారు తప్ప మిగిలిన ప్రజలందరూ శాకాహారులే అని, అహింసావాదులు అనే వ్యాఖ్యానం పూర్తిగా నిజం కాకపో వచ్చునని చరిత్రకారులంటారు.

బౌద్ధ యాత్రికునిగా వచ్చిన ఫాహియాన్ సామాన్యంగా బౌద్ధ మతాన్ని అవలంబించిన ప్రజలతోనే గడిపినందున ఆ భావన ఏర్పడి ఉండవచ్చు. కాని ప్రజల శీలసంపదను గూర్చి రాసిన విషయాలు యదార్థాలేనంటారు చరిత్రకారులు.

గుప్తుల కాలంలో సాంఘిక వ్యవస్థ ఎన్నో మార్పులకు లోనయింది. కుల పద్ధతి కొనసాగినా, ప్రజలు తమ వృత్తులను మార్చుకొనే అవకాశముండేది. క్షత్రియులు వ్యాపారం చేయడం, వైశ్యులు రాజ్యపాలన చేయడం, వృత్తి పనివారు సైన్యంలో చేరడం వంటి విషయాలు సంభవించేవి. వృత్తి, వివాహ విషయాలలో కులాల మధ్య అంత పట్టుదల ఉండేది కాదు. అయితే అంటరానితనం మాత్రం ఉండేది. వారు గ్రామాలకు దూరంగా ఉండేవారు. విదేశీయులు కూడా సాంప్రదాయక సాంఘిక వ్యవస్థలో కలిసిపోయారు. బ్రాహ్మణమతం గుప్తరాజుల కాలంలో ఆదరణ పొంది నూతన హిందూ మతం రూపొంది అభివృద్ధి చెందింది. బ్రాహ్మణులను ద్విజులుగా వ్యవహరించే వారు. గుప్తయుగంలో స్త్రీల ప్రాధాన్యత తగ్గింది. యుక్తవయస్సు రాకముందే వివాహాలు జరిగేవి. బహుభార్యత్వం సర్వసాధారణ విషయంగా ఉండేది. ఉన్నత కుటుంబాలకు చెందిన స్త్రీలు చదువుకునేవారు. పాలనారంగంలో కూడా పాలుపంచు కొనేవారు. కాని సామాన్య స్త్రీల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండేది. నాటి న్యాయ సూత్రాలు పితృస్వామిక సమాజ వ్యవస్థను, ఉమ్మడి కుటుంబ వ్యవస్థను బలపరిచాయి. సతీసహగమన దురాచారం గూర్చి కూడా ప్రస్థావనలు కలవు. దేవదాసి వ్యవస్థ ఉన్నట్టుగా చరిత్రకారులు తెలుపుతారు.

- వెంకట్


అల్లు అర్జున్

# దీపావళికి విజయ్ విజిల్




నయనతార

తెలుగు, తమిళ్ భాషల్లో 'విజిల్' చిత్రాన్ని దీపావళికి విడుదల చేయబోతున్నారు. తమిళ స్టార్ విజయ్ ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రానికి అట్లీ దర్శకుడు. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇంతకు ముందు పోలీస్, అదిరింది చిత్రాలు వచ్చాయి. 'విజిల్' చిత్రాన్ని ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. కల్పాతి ఎస్. అఘోరాం, కల్పాతి ఎస్. గణేష్, కల్పాతి ఎస్. సురేష్ సంయుక్తంగా నిర్మించి ఈ చిత్రాన్ని ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు తెలుగులో అందిస్తున్నారు. అక్టోబర్ 25న దీపావళి కానుకగా విడుదల చేస్తున్నారు. మహిళా ఫుట్‌బాల్ క్రీడ ఆధారంగా చేసుకుని అట్లీ తెరకెక్కించారు. రాజప్ప అనే మాస్ పాత్రతో పాటుగా యంగ్‌లుక్ మైకేల్ అనే ఫుట్‌బాల్ కోచ్ పాత్రలో విజయ్ కనిపిస్తారు. మహిళా టీమ్‌కు మైకేల్ ఎలా శిక్షణ ఇచ్చాడు? అనే కాన్సెప్ట్‌తో విడుదల చేసిన ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోందని మహేష్ కోనేరు తెలిపారు. ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఫ్యాన్సీ రేటుతో హక్కులు తీసుకున్నట్టుగా తెలిపారు. విజయ్, నయనతార, జాకీష్రాఫ్, వివేక్, కదిర్, యోగిబాబు, దేవదర్శిని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఎ.ఆర్.రెహమాన్, ఛాయాగ్రహణం: జికె.విష్ణు, మాటలు: శ్రీరామకృష్ణ



## తాతామనవళ్ళ అనుబంధంతో
# ప్రతిరోజు పండగే

ఇటీవల చిత్రలహరి విజయంతో ఇనుమడించిన ఉత్సాహంతో ముందుకు సాగుతున్న హీరో సాయితేజ్ తాజాగా నటిస్తున్న చిత్రం ప్రతిరోజు పండగే. మారుతి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో జిఎ 2, యువి పిక్చర్స్ పతాకాలపై బన్ని వాస్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 20న విడుదల కానుంది. ఈ విషయాన్ని చిత్రబృందం తెలియజేస్తూ...ఇటీవల రామోజీ ఫిలింసిటీలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించామని వెల్లడించింది. సాయితేజ్ తన జన్మదినోత్సవాన్ని సినిమా సెట్స్‌లోనే జరుపుకున్నారు. ఈ చిత్రం తదుపరి షెడ్యూల్‌ను అమెరికాలో జరపను న్నారు. ఇక ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం గ్లిమ్స్‌కు మంచి ఆదరణ లభిస్తోందని బృందం తెలిపింది. ఈ వీడియోలో సాయితేజ్, సత్యరాజ్‌ల కు మధ్య వచ్చే సన్నివేశాలు ఎంతో అలరిస్తున్నా యని, తాత, మనవడు మధ్య అనుబంధాన్ని ఈ చిత్రంలో అందంగా చూపించడం జరుగు తుందని బృందం పేర్కొంది. సాయితేజ్‌ను కొత్తరకమైన పాత్ర చిత్రణతో, న్యూలుక్‌తో దర్శకుడు మారుతి చూపించబోతు న్నారని చెప్పారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే కుటుంబ బంధాల్ని, విలువల్ని ఎమోషనల్‌గా చిత్రీకరిస్తు న్నట్లు తెలిపారు. ఇక మారుతి చిత్రాల్లో సహజం గా కనిపించే వినోదం ఇందులో రెండు రెట్లు ఎక్కువగానే ఉండబోతోందని అన్నారు. ఈ చిత్రంలో సాయితేజ్ సరసన రాశీఖన్నా నాయికగా నటిస్తుండగా...ఇతర ముఖ్యపాత్రల్లో విజయకుమార్, రావు రమేష్, మురళీశర్మ, అజయ్, ప్రవీణ్, శ్రీకాంత్ అయ్యంగార్, సత్యం రాజేష్, సత్య శ్రీనివాస్, సుభాష్, భరత్‌రెడ్డి, గాయత్రి భార్గవి, హరితేజ, మహేష్, సుహాస్ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: తమన్, సినిమాటోగ్రఫీ: జయకుమార్, ఎడిటింగ్: కోటగిరి, ఆర్ట్: రవీందర్, సహ నిర్మాత: ఎస్.కె.ఎన్.

# ఇన్ని లైక్స్ రావడం ఇదే ప్రథమం

అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్ చిత్రం 'అల వైకుంఠపురములో'. ఇందులోని మొదటిపాట సామజవరగమన విడుదలైన విషయం తెలిసిందే. సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన ఈ గీతానికి తమన్ స్వరరచన చేశారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. పాట విడుదలైన తర్వాత వేలాది లైక్స్ వచ్చాయని చిత్రబృందం తెలిపింది. తాజాగా 40 మిలియన్ వ్యూస్, ఏడు లక్షల లైక్స్ వచ్చాయని వారు చెప్పారు. ఒక తెలుగు పాటకు ఇన్ని లైక్స్, వ్యూస్ రావడం ఇదే ప్రథమం అని చెప్పారు. అల్లు అర్జున్, పూజా హెగ్డే, టబు, రాజేంద్రప్రసాద్, సచిన్ ఖేడ్, తనికెళ్ళ భరణి, మురళీశర్మ, సముద్రఖని, సునీల్, సుశాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: పిఎస్. వినోద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌పిడివి. ప్రసాద్, నిర్మాతలు' అల్లు అరవింద్, ఎస్. రాధాకృష్ణ



# రచయితలు సరస్వతీ పుత్రులు

**- కృష్ణంరాజు**

తెలుగు సినిమా రచయితల సంఘం రజతోత్సవ కార్యక్రమం నవంబర్ 3న హైదరాబాద్‌లో జరగనుంది. ఈ కార్యక్రమ వివరాలను సంఘ సభ్యులు ఫిలింఛాంబర్‌లో జరిగిన సమావేశంలో తెలియజేశారు. ఆకెళ్ల, పరుచూరి సోదరులు, ఎస్వీ రామారావు తదితర సంఘ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి రెబల్‌స్టార్ కృష్ణంరాజు అతిథిగా వచ్చారు. అనంతరం కృష్ణంరాజు మాట్లాడుతూ...రచయితలంటే సరస్వతీ పుత్రులు. నాకు రచయితలంటే ఎంతో గౌరవం. సమాజం బాగుండటానికి, ప్రజల వ్యక్తిత్వాన్ని పెంపొందించే శక్తి రచయితలకే ఉంది. సినిమా రచనలో నాటికీ నేటికీ చాలా తేడాలు వచ్చాయి. మాటల్లో గౌరవం తగ్గింది. లక్ష్మీ ఎదురొస్తే ఆహ్వానించాలి కానీ సరస్వతిని వెతుక్కుంటూ వెళ్లాలి అంటారు. సి నారాయణరెడ్డి, పరుచూరి సోదరులు, ఆత్రేయ వంటి వారితో నాకు మంచి అనుబంధం ఉంది. మీ సంఘం మంచి భవనం కట్టుకోవాలి. అందుకు నాకు చేతనైన సహకారం అందిస్తా. అన్నారు. నవంబర్ 3న ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో రచయితల సంఘం రజతోత్సవ వేడుక జరగనుంది.

# నూటొక్క జిల్లాల అందగాడు

నూటొక్క జిల్లాల అందగాడు అని వినిపించగానే వెంటనే నటుడు నూతన్ ప్రసాద్ గుర్తుకువస్తారు. ఆయన పాపులర్ డైలాగుల్లో ఇదొకటి. ఇప్పుడు ఇదే పేరుతో ఓ సినిమా తెరకెక్కుతోంది. దిల్, రాజు, క్రిష్ కలిసి 'నూటొక్క జిల్లాల అందగాడు' పేరుతో సినిమా రూపొందిస్తున్నారు.

శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రాచకొండ విద్యాసాగర్ దర్శకత్వం వహిస్తున్నారు. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మాతలు. అవసరాల శ్రీనివాస్, రుహానీ శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం రామ్, సంగీతం స్వీకార్ అగస్తి.


దిల్ రాజు, క్రిష్ అవసరాల

# ప్రేమ పిపాసి టీజర్ విడుదల

జిపిఎస్, కపిలాక్షి మల్హోత్రా, సోనాక్షీ వర్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ప్రేమ పిపాసి. పిఎస్ రామకృష్ణ నిర్మాణంలో దర్శకుడు మురళీరామస్వామి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేమ పిపాసి సినిమా టీజర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్మాత పిఎస్ రామకృష్ణ మాట్లాడుతూ...మాకిది నిర్మాతలుగా తొలి చిత్రం. టీజర్‌లో చూసింది కొంచెమే. సినిమా అంతా కొత్తగా ఉంటుంది. ఇవాళ్టి ట్రెండ్ సినిమాలకు దగ్గరగా అనిపిస్తుంది. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో సినిమాను విడుదల చేస్తాము. అన్నారు. దర్శకుడు మురళీరామస్వామి మాట్లాడుతూ...సినిమా కలర్‌ఫుల్‌గా ఉంటుంది. చిత్రాన్ని చాలా రా గా తీశాం. ప్రతి మనిషిలో మరో కోణం ఉంటుంది. ఆ కోణంలో కథ సాగుతుంటుంది. లవ్ రొమాన్స్ యాక్షన్ అంశాలుంటాయి. అన్నారు.


జిపిఎస్, కపిలాక్షి మల్హోత్రా

# వెలుగుల పండక్కి బాలీవుడ్ వినోదం

**వెలుగుల పండగ దీపావళికి సందడి చేసేందుకు బాలీవుడ్ చిత్రాలు సిద్ధమవుతున్నాయి. పండక్కి పలు రకాల పటాకులు ఉన్నట్లే...ఈ సారి తెరపైకి వస్తున్న మూడు చిత్రాలు వేటికవే భిన్నమైన కథ కథనాలతో రూపొందాయి. అయితే పోటీ అక్షయ్ కుమార్ హౌస్‌ఫుల్ 4, తాప్సీ సాంఢ్ కీ ఆంఖ్ మధ్యే ప్రధానంగా నెలకొంది.**




బాలీవుడ్‌లో ఘన విజయం సాధించిన సినిమా సిరీస్‌లో హౌస్‌ఫుల్ ఒకటి. 2010లో హౌస్‌ఫుల్‌తో మొదలైన ఈ సిరీస్ మూడు చిత్రాలతో ప్రేక్షకులను నవ్వించింది. నాలుగో సినిమా ఈ దీపావళి పండక్కి థియేటర్‌లలో సందడి చేయబోతోంది. అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్, బాబీ డియోల్, పూజా హెగ్డే, కృతి సనన్, కృతి ఖర్బంధా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పునర్జన్మల నేపథ్యంతో దర్శకుడు ఫర్హాద్ సమ్జీ హౌస్‌ఫుల్ 4 సినిమాను రూపొందించారు. ప్రతిష్టాత్మక చిత్రంగా భారీ బడ్జెట్‌తో, సాంకేతిక హంగులతో తెరకెక్కిన ఈ సినిమా అక్టోబర్ 25న ప్రేక్షకుల ముందుకొస్తోంది.

విలక్షణ చిత్రాల కథానాయకుడు రాజ్‌కుమార్ రావ్ నటిస్తున్న కొత్త సినిమా మేడిన్ చైనా. ఈ సినిమా. దర్శకుడు మికిల్ ముసాలే ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మౌనీ రాయ్, అమైరా దస్తూర్, బొమన్ ఇరానీ, పరేష్ రావల్ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు. మేడిన్ చైన్ సినిమా అక్టోబర్ 25న తెరపైకి వస్తోంది.

తాప్సీ. తొలితరం భారతీయ షార్ప్ షూటర్స్ చంద్రో తోమర్ జీవిత కథా చిత్రంలో నాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి హిరానందానీ దర్శకత్వం వహిస్తుండగా..అనురాగ్ కశ్యప్ నిర్మాణ బాధ్యతలు వహిస్తున్నారు. సాంఢ్ కీ ఆంఖ్ పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో మరో షూటర్ ప్రకాషీ తోమర్ పాత్రను భూమి ఫడ్నేకర్ పోషిస్తోంది. తాప్సీ సాంఢ్ కీ ఆంఖ్‌లో 60 ఏళ్ల వయసున్న పాత్రలో నటిస్తోంది. వదినా మరదళ్ల పాత్రలో భూమి పడ్నేకర్, తాప్సీ కనిపించనున్నారు. సాంఢ్ కీ ఆంఖ్, అక్షయ్ కుమార్ హౌస్‌ఫుల్ 4 సినిమాతో పాటు దీపావళి పండక్కి తెరపైకి వస్తోంది. ఈ నేపథ్యంలో తాప్సీ మాట్లాడుతూ...మా సినిమా ట్రైలర్ చూసి అక్షయ్ కుమార్ నన్ను, భూమిని పిలిచి మాట్లాడారు. ట్రైలర్ బాగుందని ప్రశంసించారు. ఆయన హౌస్‌ఫుల్ 4, మా సాంఢ్ కీ ఆంఖ్ ఒకే రోజున విడుదలవుతున్నాయి. ఇక్కడ పోటీ అంటూ ఏం లేదు. ఆ రోజుకు ఎవరి సినిమా చూడాలనుకుంటే వాళ్ల చిత్రాన్ని ప్రేక్షకులు చూస్తారు. అని చెప్పింది.







Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?

అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076